తాతలనాటి కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిలప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 215 | శుక్రవారం | 24-01-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

రోడ్ల గుంతలపై యాప్

రోడ్లపై గుంతల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ప్రజలు తెచ్చేందుకు వీలుగా ఒక యాప్‌ను 4 వారాల్లోగా రూపొందించాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఆర్‌అండ్‌బీలో ఉన్నట్లుగా టిరస్తా అనే యాప్ ఉన్నట్లుగానే ఇతర రోడ్ల విషయంలోనూ యాప్ ఉండాలంది. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్‌శాఖ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏలను ఆదేశించింది.లాయర్ అఖిల్ శ్రీగురుతేజ వేసిన పిల్‌ను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ జి.రాధారాణిలతో కూడిన బెంచ్ గురువారం విచారించింది.

తెలంగాణ@ రూ.1.78 లక్షల కోట్లు

డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడుల ప్రతిపాదనలు

ఆచరణలోకి వస్తే 49,500 ఉద్యోగాలు

16 ప్రముఖ కంపెనీలతో అవగాహన

ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన

ప్రజాపక్షం / హైదరాబాద్

స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ బృందం' దాదాపు రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు, 49500 ఉద్యోగాలను సాధించి పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడుల రికార్డు నమోదు చేసింది. గత ఏడాది దావోస్ పర్యటనలో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు అవగాహన ఒప్పందం కుదిరింది. అప్పటితో పోలిస్తే ఈసారి నాలుగింతలకు మించిన పెట్టుబడులు రావడం విశేషం. దావోస్ వేదికపై ఈసారి తెలంగాణ రాష్ట్రం అందరి దృష్టిని ఆకర్షించింది. దేశ విదేశాలకు చెందిన పేరొందిన 16 ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటి, ఎఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించి భారీ పెట్టుబడులను సాధించిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు సారథ్యంలో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్‌లో వివిధ పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశాలన్నీ విజయవంతమయ్యాయి. దేశ విదేశాలకు చెందిన పేరొందిన పది ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఐటి, ఎఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించినట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. దావోస్‌లో వరుసగా మూడు రోజుల పాటు ప్రభుత్వం కుదుర్చుకున్న తరువాయి 2లో

అమెజాన్@ రూ.60వేల కోట్లు

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం దావోస్‌లో అతి పెద్ద పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో రూ.60,000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అమెజాన్ కంపెనీ అంగీకరించింది. డేటా సెంటర్లలో పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో గురువారం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంతో హైదరాబాద్ దేశంలో డేటా సెంటర్ల కేంద్రంగా తిరుగులేని గుర్తింపు సాధిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. స్విట్జర్‌లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ పుంకేతో భేటీ అయ్యారు. దాదాపు రూ.60,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళికలతో హైదరాబాద్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ తమ డేటా సెంటర్లను పెద్దవి తున విస్తరిస్తోంది. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఆధారిత క్లౌడ్ సేవల వృద్ధికి ఈ డేటా సెంటర్లు కీలకంగా మారనున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. తెలంగాణలో తన క్లౌడ్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి 2030 నాటికి 4.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరువాయి 2లో

భారత ఓటర్లు 99.1 కోట్లు

న్యూఢిల్లీ : దేశంలో ఓటర్ల సంఖ్య 99.1 కోట్లకు చేరుకుంది. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆ సంఖ్య 96.88 కోట్లుగా ఉన్నట్లు ఎన్నికల కమిషన్ (ఎన్‌సి) సభ్యులు తెలిపారు. ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నేపథ్యంలో బుధవారం ఎన్నికల సంఘం ఓటర్ల వివరాలను వెల్లడించింది. యువత, లింగం ఆధారంగా ఓటర్లను పరిశీలిస్తే 18–29 ఏళ్ల మధ్య ఉన్నవారు 21.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. 2024తో పోల్చితే లింగ నిష్పత్తిలో ఆరు పాయింట్లు పెరిగింది. 2024లో 948గా ఉండగా, 2025లో 954కు చేరింది. ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారు. కాగా, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఈనెల 7వ తేదీన విడుదల చేసిన సందర్భంగా ఎన్నికల ముఖ్య కమిషనర్ (సిఇసి) రాజీవ్ కుమార్ మాట్లాడుతూ భారత్ త్వరలో బిలియన్‌కుపైగా ఓటర్లతో కొత్త రికార్డును నెలకొల్పనుందన్నారు. జనవరి 26వ తేదీ నాటికి ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందన్నారు.

ఇద్దరు కుమార్తెలు సహా తల్లి ఆత్మహత్య

ప్రజాపక్షం/ మధిర రూరల్

ఖమ్మం జిల్లా మధిర మండలం నిధానపురం గ్రామంలో ఉరేసుకుని ఇద్దరు కుమార్తెలతో సహా తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిధానపురం గ్రామానికి చెందిన షేక్.బాజీ భార్య ప్రేజా(30), తన కూతర్లు మెహక్(4), మోనురూల్(3) ఇంట్లో ఇద్దరు పిల్లలకు ఉరివేసి తన కూడా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త తరువాయి 2లో

ఎవరెస్టు ఎక్కేందుకు భారీ ఫీజు

15 వేల డాలర్లు పెంచిన నేపాల్

కఠ్మండు : ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనుకునేవారు ఇక భారీగా ఫీజులు చెల్లించాలి. ఎవరెస్టు పర్వతారోహకులు ఇకమీదట తలకు 15,000 డాలర్లు రూ.13 లక్షలు) చెల్లించవలసి ఉంటుంది. ఇప్పటివరకూ ఎవరెస్టు అధిరోహకులు రూ.11,000 డాలర్లు మాత్రమే చెల్లించేవారు. కానీ ఒక్కసారిగా ఈ అధిరోహణ ఫీజును నేపాల్ ప్రభుత్వం 4,000 డాలర్లు పెంచేసింది. సెప్టెంబరు నుండి నవంబరు వరకు మూడునెలల కాలంలో ఈ ఫీజులు పెరుగుతాయి. శీతాకాలంలో పర్మిట్ ధర, వర్షాకాలంలో పర్మిట్ ధరలు కొంచెం తక్కువగా ఉంటాయి.

సుందిళ్ల బ్యారేజీకి డ్యామేజీ ఎలా?

ఎలాంటి చర్యలు తీసుకున్నారు? 'నవయుగ' ప్రతినిధులను విచారించిన 'కాళేశ్వరం' కమిషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణలో భాగంగా సుందిళ్ల బ్యారేజీ నిర్మాణం చేపట్టిన నవయుగ సంస్థ ప్రతినిధులను కాళేశ్వరం జస్టిస్ పి.సి.ఘోష్ విచారణ కమిషన్ విచారించింది. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో జరిగిన బహిరంగ విచారణకు మొత్తం నలుగురు ప్రతినిధులు హాజరయ్యారు. నవయుగ డైరెక్టర్ రమేశ్ అఫిడవిట్‌ను మిగతా ముగ్గురు కాపీ పేస్ట్ చేసినట్లు కమిషన్ గుర్తించినట్లు వర్గాలు తెలిపారు. అందరి అఫిడవిట్లు ఒకేలా ఉన్నాయని, తరువాయి 2లో

అండమాన్ దీవులకు సుభాష్ చంద్రబోస్ పేరు

'పరాక్రమ దివస్' సందేశంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : వికసిత్ భారత్ లక్ష్య సాధనకోసం ఐక్యంగా ఉందామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారంనాడు ఆయన కటక్‌లో జరిగిన 'పరాక్రమ్ దివస్' కార్యక్రమంలో దృశ్యమాధ్యమ పద్ధతులలో పాల్గొని సందేశం ఇచ్చారు. దేశాన్ని బలహీనపరచి, దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసే శక్తులకు వ్యతిరేకంగా, వికసిత్ భారత్ లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఐక్యంగా ఉండాలని పిలుపు ఇచ్చారు. అండమాన్‌లో దీవులకు సుభాష్ చంద్రబోస్ పేరు పెట్టడంతోపాటు ఇండియా గేట్ వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆయన జయంతిని ''పరాక్రమ్ దివస్''గా పాటించడం తరువాయి 2లో

రెప్పపాటుకూడా కరెంటు పోవద్దు

వేసవి దృష్ట్యా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలి

వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలి

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రానున్న వేసవిలో రెప్పపాటు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. వేసవిలో విద్యుత్ అంతరాయం అనే మాటనే వినిపించకుండా, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరాటంకంగా సరఫరా చేయాలన్నారు. వేసవి వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని పీక్ డిమాండ్‌ను తట్టుకునే విధంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని, సబ్‌స్టేషన్ల వారీగా ఓవర్ లోడ్ సమస్యలను గుర్తించి, వాటిని ముందుస్తుగానే పరిష్కరించుకోవాలని సూచించారు. రానున్న వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికలపై హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఎన్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో అధికారులతో భట్టి విక్రమార్క గురువారం సుధీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా సిఎండిలు మొదలు ఎస్ఇల వరకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా సమీక్ష, అవగాహన సమావేశాలు నిర్వహించాలని, ఈ సమావేశాలలో వినియోగదారులను, మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. గత వేసవిలో ఎదురైన ఇబ్బందులు,వాటిని అధిగమిస్తూ రానున్న వేసవిలో సమర్థవంతంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఈ సమావేశాల్లో వివరించాలని సూచించారు. ఉన్నతాధికారులు క్షేత్ర పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను వెనువెంటనే విడుదల చేయాలని భట్టి ఆదేశించారు. 108 తరహాలోనే విద్యుత్ సరఫరాలో సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాట్లు చేసిన 1912ను విస్తృతంగా ప్రచారం చేయాలని, 1912 కు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, ఈ వ్యవస్థ నిర్వాహణ ప్రచారానికి అదనపు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఎన్‌పిడిసిఎల్ పరిధిలో వచ్చే మార్చిలో పీక్ డిమాండ్ 6328 మెగా వాట్ల విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఒకవేళ ఈదురు గాలులతో విద్యుత్ అంతరాయం ఏర్పడితే తరువాయి 2లో

ప్రాణాలతో చెలగాటం ఆసుపత్రులపై కఠినం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి

ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులపై దాడులు నిర్వహించాలి

అనుమతిలేని వాటిపై క్రిమినల్ చర్యలు : ఎఐవైఎఫ్ డిమాండ్

కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయం ముట్టడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్ర మంతా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపైన దాడులు చేపట్టాలని, అనుమతులు లేనివాటిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ మెడికల్ మాఫియా దందాను అరికట్టాలని, ప్రభుత్వ తరువాయి 12లో

కొత్తగూడెంలో విమానాశ్రయానికి... స్థలపరిశీలన

జిల్లాలో పర్యటించిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధిబృందం

ఎయిర్‌పోర్ట్ ఆవశ్యకతను వివరించిన ఎంపి రామసహాయం, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాచలం

కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు అనువైన స్థలం అధ్యయనానికి గురువారం కేంద్రం నుంచి ఏరో ప్లానింగ్ అధికారి అబ్దుల్ అజీజ్, అర్కిటెక్చర్ మొహ్మద్ సాకిబ్, ఆపరేషన్ అధికారి ప్రశాంత్ గుప్త, సిఎన్‌ఎస్ అధికారి దివాకర్, ఇంజనీర్ సి మనీష్ జోన్వాల్, ఎఫ్‌పిడి అధికారి ప్రవీణ్ ఉన్ని కృష్ణన్ సభ్యులతో కూడిన ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధి బృంధం కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో తరువాయి 12లో

'గ్రామ,వార్డు' సభలు 85శాతం పూర్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం వరకు 13,861గ్రామాలు, వార్డులలో గ్రామ సభలు (85.96 శాతం) పూర్తయ్యాయని ప్రభుత్వం వెల్లడించింది.గ్రామ సభలు ప్రారంభమైన మూడవ రోజున 3,986 గ్రామ సభలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ గ్రామ, వార్డు సభలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై, నాలుగు పథకాలకు సం బంధించి తమ దరఖాస్తులు అందచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు 3130, వార్డు సభలు 856 నిర్వహించినట్టు ప్రభుత్వం పేర్కొంది.

రాజకీయ ప్రేరేపిత ఆందోళనలు : మంత్రి సీతక్క

కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత ఆందోళనలు చేపట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆరోపించారు.గ్రామ సభలను అడ్డుకునే కొందరి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడుతున్నారని తరువాయి 12లో

సొంతింటి కల.. నెరవేరుతున్న వేళ

- పదేళ్ల నిరీక్షణకు తెర
- బిఆర్ఎస్ హయాంలో దరిచేరని సొంతిల్లు
- 26 నుండి ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

పేదోడి సొంతింటి కల నెరవేరబోతోంది. పదేళ్లుగా అందని ద్రాక్షలా ఊరిస్తూ వచ్చిన ఇండ్లు దరిచేరబోతున్నాయి. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వచ్చిన 10,05,454 దరఖాస్తులను పరిశీలించిన అధికారుల బృందం 2,73,751 మందిని అర్హులుగా గుర్తించింది. తొలి విడతలో సొంత జాగా ఉన్నవారికే ప్రాధాన్యత ఇవ్వనుంది. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆమోదంతో పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నారు. దీంతో ఎన్నో ఏళ్ల సొంతింటి కల సాకారం అవుతుందనే ఆనందం పేదల కళ్లలో కనిపిస్తున్నది. తమ కలల సౌధం అందే తరుణం ఆసన్నం కావడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సొంత ఇంటి కోసం నిరుపేదలు ఎదురు చూస్తున్నారు. 2014లో స్వరాష్ట్రంలో బిఆర్ఎస్ తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని రద్దు చేసి, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చింది. 2016–17 నుంచి 2018–19 వరకు మూడేళ్లకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు 32 వేల డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఐదువేల ఇళ్లు కూడా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్లు సైతం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో 2023లో బిఆర్ఎస్ ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతో ఇళ్లు నిర్మించుకునేవారికి తరువాయి 12లో

కాలిఫోర్నియాలో మళ్ళీ దావాగ్ని

ఇళ్ళు ఖాళీచేయాలని 50 వేలమందికి ఆదేశం

లాస్‌ఏంజెల్స్ : దక్షిణ కాలిఫోర్నియాలో మరోసారి దావాలనం ప్రజ్వరిల్లింది. లాస్‌ఏంజెల్స్‌కు ఉత్తరాన పర్వతాల్లో హుగెష్ ప్రాంతంలో భారీఎత్తున ఈ దావానలం చెలరేగి 21 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో భయంకరంగా వ్యాపించింది. కొన్ని గంటల వ్యవధిలోనే ఎనిమిదివేల ఎకరాలను దావాగ్ని కబళించింది. దీంతో 50,000 మందిని ఇళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోవాలని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. శుక్రవారంనాటికి ఈ రెడ్ ఫ్లాగ్ వార్నింగ్‌ను విస్తరిస్తారు. లాస్‌ఏంజెల్స్ కౌంటీకి చెందిన అధికారి రాబర్ట్ జెన్‌సెన్ మాట్లాడుతూ ఇంతకుముందు దావానలం వ్యాపించడంవల్ల ఉక్కిరిబిక్కిరై, మంటల్లోపడి ఇప్పటివరకూ 28 మంది మరణించారనీ, ఆ పరిస్థితి మళ్ళీ రాకుండా ఉండటంకోసం ప్రజలు ముందుగానే జాగ్రత్తపడి ఈ ప్రాంతం వదిలి వెళ్ళిపోవాలని ఆయన హెచ్చరించారు. జనవరి ఏడో తేదీ నుండి జరుగుతున్న దావాగ్ని బీభత్సంవల్ల 16 వేల ఇళ్ళు, మౌలిక నిర్మాణాలు, మార్కెట్లు, స్కూళ్ళు కాలి బూడిదయ్యాయి. వేలాదిమంది ఇళ్ళుకోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఐతే వీరందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని అటు బైడెన్ ప్రభుత్వంతోపాటు కొత్తగా వచ్చిన ట్రంప్ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. లాస్‌ఏంజెల్స్‌లో ఈ దావానలం వల్ల ఇప్పటివరకూ 250 బిలియన్ డాలర్ల మేరకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆ ప్రాంతంలో నల్లటి పొగమేఘాలు ఆకాశంలో కమ్ముకున్నాయి.

ఊపిరి అందక ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. లాస్‌ఏంజెల్స్ కౌంటీలోని ఆ నగరానికి ఉత్తరంగా 80 కి.మీ దూరంలో ఉన్న క్యాస్టైక్ లేక్ ఏరియాలో ఈ మంటలు చెలరేగాయి. ఈ ప్రాంతంలో చెట్లన్నీ కాలి బూడిదయ్యాయి. దక్షిణ కాలిఫోర్నియా లాస్‌ఏంజెల్స్‌లో ఈ హర్ట్స్ దావాగ్ని, ఏటెన్ దావాగ్ని, పాలిసేడ్స్ ప్రాంత దావాగ్నిలు వేరువేరు ప్రాంతాలలో జనవరి ఏడో తేదీన ప్రారంభమయ్యాయి. వాస్తవానికి దీనిని సైల్మార్ దావాగ్ని అంటారు. శాంతా అనా అనే తీవ్ర ప్రభావంగల పెనుగాలుల ఫలితంగా ఈ దావాగ్ని మరింతగా పేట్రేగిపోయింది.

ప్రపంచం

మెక్సికో సరిహద్దులకు..
10వేలమంది అమెరికా సైన్యం!

వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దులకు 10,000 మంది సైన్యాన్ని పంపాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్ ట్రంప్ ఆలోచిస్తున్నారు. ఇప్పటికే మెక్సికో సరిహద్దులకు 1,500 మంది సైన్యాన్ని పంపించేందుకు ఉత్తర్వులు ఇచ్చారని వార్తలు వచ్చాయి. కానీ తాజా సమాచారం ప్రకారం, అక్రమంగా అమెరికాలోకి వస్తున్న వలసలను అదుపు చేసేందుకు భారీ సైన్యం అవసరం అని ఆయన భావిస్తున్నారు. సంబంధిత సైనిక విభాగానికి ట్రంప్ కార్యాలయం పంపించిన అంతర్గత మెమొరాండం ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి. 1,500 మంది సైన్యాలను శాండియాగో, ఎల్‌పాసో, కాలిఫోర్నియాలకు పంపుతారు. సరిహద్దుల్లో ఇప్పటికే 2,500 మంది సైన్యం ఉన్నారు. వేలాదిమంది వలస ప్రజలు మెక్సికో సరిహద్దుల్లో నిత్యం పడిగాపులు పడి ఉంటున్నారు. వారంతా అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. భారతీయులు కూడా ఉన్నారు!

పారిస్ ఒప్పందం అమలుకు బ్లూంబెర్గ్ పెట్టుబడి

పారిస్ ఒప్పందం నుండి డోనాల్డ్ ట్రంప్ వైదొలగడంతో బ్లూంబెర్గ్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందట. వాతావరణానికి సంబంధించిన ఒప్పందం అమలు కోసం అమెరికు తరపున ఆర్థిక అవసరాలు తీర్చేందుకు తాము పెట్టుబడులు పెడతామని బ్లూంబెర్గ్ ఫౌండేషన్‌కు చెందిన మైఖేల్ బ్లూంబెర్గ్ ముందుకు వచ్చారు. ట్రంప్ అధికారం చేపట్టగానే ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి, పారిస్ ఒప్పందం నుండీ పెట్టుబడులు పెట్టకుండా వైదొలగుతున్నట్లు ప్రకటించారు. పారిస్ ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక మరోసారి ప్రకటించారు. ఐతే వాతావరణ మార్పులకు సంబంధించి బ్లూంబెర్గ్ ఐక్యరాజ్యసమితి తరపున ప్రత్యేక దూతగా వ్యవహరిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావరణ మార్పుల సమస్యలు పరిష్కరించేందుకు సంబంధిత ఒప్పందాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తాము కోరుకుంటున్నామని, అందుకే అమెరికా తరపున తాము పెట్టుబడులు సమకూర్చేందుకు సంసిద్ధత ప్రకటిస్తున్నట్లు బ్లూంబెర్గ్ చెప్పారని బ్రిటన్ వార్తాసంస్థ ప్రకటించింది.



ఎల్‌జిబిటిక్యూ హక్కులకు స్వర్గధామం థాయ్‌లాండ్

200 భిన్నలింగ జంటలకు సామూహిక వివాహాలు

బ్యాంకాక్ : థాయ్‌లాండ్‌లో ఎల్‌జిబిటిక్యూఎలు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న వివాహ సమాన హక్కులు గురువారంనాడు అమలులోకి వచ్చాయి. 200 ఎల్‌జిబిటిక్యూఐఎ+జంటలకు (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్‌జెండర్, క్వీర్, ఇంటర్‌సెక్స్, ఎసెక్సువల్+) చట్టబద్ధంగా వివాహాలు చేసుకున్నట్లు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ సర్టిఫికెట్ పొందినవారిలో థాయ్‌లాండ్ పోలీసు అధికారి పిసిట్ కె సిరిహిరుంఛాయ్ కూడా ఉన్నారు. తన దీర్ఘకాలిన భాగస్వామి ఛనాటిప్ జేన్‌ను ఆయన వివాహం చేసుకున్నారు. థాయలాండ్ రాజు మహావలిరలాంగ్‌కోర్న్ 2024 సెప్టెంబరులో ఈ బిల్లును ఆమోదించారు. 120 రోజుల తర్వాత ఇప్పుడు ఈ చట్టం అమలులోకి వచ్చింది. ''భిన్నలింగ సంపర్కుల వివాహహక్కులకు థాయ్‌లాండ్ ఇకమీదట ప్రపంచానికి ఒక నమూనా మార్గదర్శిగా మారింది. థాయ్‌లాండ్‌లో ఇక అన్నివర్గాలవారికీ థాయ్‌లాండ్‌లో నిజమైన వివాహ హక్కులు లభిస్తాయి'' అని థాయ్‌లాండ్ రైన్‌బో స్కై అసోసియేషన్ అధ్యక్షుడు కిట్టినన్ దరమండ్ హాజ్ వ్యాఖ్యానించారు. అమెరికాలో కొత్త అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎల్‌జిబిటిక్యూలను అణచివేతకు గురిచేసే ఉత్తర్వులు జారీ చేయగా అదేసమయంలో థాయ్‌లాండ్ వారిని చట్టబద్ధంగా గుర్తించింది. థాయ్‌లాండ్‌లో భిన్నలింగ సంపర్కులు దశాబ్దకాలంగా వివాహ హక్కులకోసం పోరాడుతూ ఎట్టకేలకు విజయం సాధించారు. ఈ సందర్భంగా థాయ్‌లాండ్ తూర్పుతీర నగరం పట్టాయా నుండి పర్వతప్రాంత ఉత్తర నగరం చియాంగ్ మై వరకూ గురువారంనాడు ఉత్సవాలు జరిగాయి. బ్యాంకాక్ నగరం వారికి రెడ్‌కార్పెట్ స్వాగతం పలికింది. దీంతో స్వలింగ–భిన్నలింగ సంపర్కులకు థాయ్‌లాండ్ దేశం స్వర్గధామంగా మారింది. ఇలా రిజిస్ట్రేషన్లు చేసుకున్న ఎల్‌జిబిటిక్యూఐఎ జంటల సంఖ్య 23వ తేదీ సాయంత్రానికి 1,448కు చేరుకుంది. దక్షిణ ఆసియాలో భిన్నలింగ సంపర్కుల వివాహ సమాత్వ హక్కులను గుర్తించిన మొట్టమొదటి దేశంగా థాయ్‌లాండ్ చరిత్ర సృష్టించింది. డౌన్‌టౌన్ బ్యాంకాక్‌లో ఉన్న జనాదరణపొందిన సియామ్ పారగాన్ షాపింగ్ మాల్‌లో 200 ఎల్‌జిబిటిక్యూ జంటలు చట్టబద్ధంగా వివాహాలు చేసుకున్నారు. నీనాఛట్నిపాట్ ఛౌడ్‌కుంథాడ్ అనే ట్రాన్స్‌జెండర్ మహిళ ఈ కార్యాక్రమంలో ప్రధాన ఆకర్షణగా మారారు. ఎందుకంటే గతంలో పురుషుడైన ఛౌడ్‌కుంథాడ్ స్త్రీగా మారింది. థాయల్‌లాండ్‌లో చట్టాలు సహకరించకపోవడంవల్ల గడచిన 22 సంవత్సరాలుగా తన బోయ్‌ఫ్రెండ్‌ను వివాహం చేసుకోకుండా ఆమె అలాగే ఉండిపోయారు. ఇప్పుడు చట్టపరమైన ఆటంకాలన్నీ తొలగిపోవడంతో ఆమె ఇప్పుడు తన బోయ్‌ఫ్రెండ్‌ను చట్టబద్ధంగా పెళ్ళి చేసుకున్నారు. ''నా 22 సంవత్సరాల కల ఈనాడు నెరవేరింది, నేనెంతో సంతోషంతో ఉన్నాను'' అని ట్రాన్స్‌జెండర్ ఛౌడ్‌కుంథాడ్ సంతోషంతో చెప్పారు. మూడు వారాలక్రితమే బ్యాంకాక్ శివార్లలో వివాహానికి ముందే ఈ జంట అందరికీ భారీ ఎత్తున విందు ఇచ్చారు.

సుభాష్ చంద్రబోస్ పేరు

(మొదటి పేజీ తరువాయి)

వంటి అనేక కార్యక్రమాలను మోదీ ఈ సందర్భంగా ప్రకటించారు. దేశ వారసత్వానికి బోస్ ఎంతో గర్వకారణమని, ఆయన తరచు భారతదేశ సంపద్వంతమైన ప్రజాస్వామ్య చరిత్ర గురించే మాట్లాడేవారని, దాని నుండి స్ఫూర్తి పొందాలని ప్రజలను ప్రోత్సహించేవారిని మోదీ గుర్తుచేశారు. ప్రజల అభ్యున్నతి, సాయుధ బలగాల పటిష్టత, సమీకృత అభివృద్ధి దేశంలో చేయి చేయి కలిపి ముందుకు సాగుతోందని ఆయన అన్నారు.

దేశంలో 25 కోట్లమంది ప్రజలను పేదరికం నుండి తమ ప్రభుత్వం బయట పడేసిందని, గడచిన దశాబ్ద కాలంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు నిర్మించడమేకాకుండా, సాయుధ బలగాలను అసాధారణరీతిలో బలోపేతం చేశామని అన్నారు. భారతదేశ ప్రగతికి అనుగుణంగా ప్రపంచవ్యాప్తంగా ఒక సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించగలిగామన్నారు. 21వ శతాబ్దంలో భారతదేశం ఏ విధంగా తనను తాను తీర్చిదిద్దుకుంటుందని యావత్ ప్రపంచం మనల్నే చూస్తోందని మోదీ అన్నారు. దేశ స్వాతంత్ర్య సమర యోధులకు ప్రతిరూపంగా నిలిచిన ఆ మహానేత జీవితం దేశ ప్రజలకు స్ఫూర్తిగా కొనసాగాలని అన్నారు. దేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం చేయడాన్నే ఎంచుకోవాలని, సుఖంగా, సౌఖ్యంగా బతికేయాలనే పద్ధతికి స్వస్తిచెప్పాలని సుభాష్ చంద్రబోస్ తరచుగా చెప్పేవారని మోదీ గుర్తుచేశారు. దేశ స్వాతంత్ర్యంపైనే ఆయన పూర్తిగా తన దృష్టికి కేంద్రీకరించారని, స్వాతంత్ర్య సాధన ఒక్కటే ఆయన లక్ష్యంగా పెట్టుకుని జీవితకాలమంతా పోరాడారని గుర్తుచేశారు. దేశంలో విభిన్న మూలాల నుండి వచ్చిన ప్రజలంతా ఈ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడం కోసమే ఐక్యంగా కట్టుబడి ఉండాలని మోదీ కోరారు. భారతదేశం ఐక్యంగా ఉండటంకోసం బోస్ జీవితం నుండి దేశ ప్రజలు స్ఫూర్తి పొందాలని కోరారు. 'వికసిత్ భారత్' కోసం పాటుపడటమే సుభాష్‌చంద్రబోస్‌కు మనం అర్పించే నిజమైన నివాళి కాగలదని ఆయన అన్నారు.

''మనం అప్రమత్తంగా ఉండాలి, దేశాన్ని బలహీనపరచి, మన ఐక్యతను విచ్ఛిన్నంచేయాలని ప్రయత్నంచే వారిపట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి'' అన్నారు. పార్లమెంటులో జరిగిన ఒక కార్యక్రమంలో కూడా సుభాష్ చంద్రబోస్‌కు ప్రధానమంత్రి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే కూడా పాల్గొన్నారు.

కరెంటు పోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఇఆర్‌టి (ఎమర్జెన్సీ రిస్టోర్ టీం) వాహనాలను వాడుతున్నారని, వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతీ ఒక్కరూ అహర్నిశలు కష్టపడుతున్నారని ట్రాన్స్‌కో, ఎన్‌పిడిసిఎల్ అధికారులను భట్టి విక్రమార్క అభినందించారు. అనంతరం ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ముందస్తుగా అన్ని కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, ఎటువంటి ఇబ్బందులు రాకుండా వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ అధికారులు పర్యటించి, వినియోగదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఒక వేళ విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతే, ప్రత్యామ్నాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాన్స్‌కో సిఎండి డి.కృష్ణభాస్కర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ 132/33 కెవి సబ్ స్టేషన్లలో కావాల్సిన సామర్థ్యం మేరకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పెంచుతున్నామన్నారు. తద్వారా వేసవిలో ఎంత డిమాండ్ ఉన్నప్పటికీ ఎటువంటి అంతరాయలు ఏర్పడబోవని వివరించారు. ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని 44 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, మరో 32 వచ్చే నెల వరకు పూర్తి చేస్తామని తెలిపారు. 33 కెవి 13 ఓవర్ లోడ్ ఫీడర్స్, 11 కెవి 35 ఓవర్ లోడ్ ఫీడర్స్ కూడా లోడ్ రిలీఫ్ చేశామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు, ప్రత్యామ్నాయ లైన్ల ఏర్పాటు, 17 కొత్త సబ్ స్టేషన్‌ల ఏర్పాటు, రాబోయే మార్చిలో 12 కొత్త సబ్ స్టేషన్ల ప్రారంభిస్తామన్నారు.

ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు 'వేసవి విస్తృత సమావేశాలు'

ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 4వరకు వేసవిప్రణాళికపై క్షేత్రస్థాయిలో విస్తృత సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సిఎండి వరుణ్ రెడ్డి తెలిపారు. ఈనెల 27న నోడల్ అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తారన్నారు. 29వ తేదీన నోడల్ అధికారులు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో కలిసి జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో వేసవి కార్యాచరణపై సమీక్షా సమావేశాలను నిర్వహిస్తారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు చేపట్టిన పనుల ప్రగతిని,1912'ని విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. ఫిబ్రవరి 4న ఎస్ఇలు డివిజన్ స్థాయిలో పూర్తి సిబ్బందితో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సబ్ స్టేషన్లలో ఓవర్ లోడ్ ఫీడర్లు డిటిఆర్‌లలో గత మూడు సంవత్సరాలుగా ఏర్పడుతున్నప్పటికీ సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోబోతున్నారో వివరించనున్నారు.

తల్లి ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

షేక్. బాజీ ఒక ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. భర్త షేక్.బాజీని ఓ దొంగతనం కేసులో విచారణ నిమిత్తం ఖమ్మం పోలీసులు ఇంటికి వచ్చి అదుపులోకి తీసుకుని వెళ్లారు. ఇది అవమానంగా భావించిన భార్య ప్రేజా తన కూతర్లుతో సహా ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పంచానామా నిర్వహించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి తెలిపారు.

డ్యామేజీ ఎలా? (మొదటి పేజీ తరువాయి)

ఆ సంస్థ తీరుపై కమిషన్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అఫిడవిట్ ఆధారంగానే కమిషన్ క్రాస్ ఎగ్జామింగ్ చేసింది. సుందిళ్ల బ్యారేజీ డ్యామేజీ ఎలా,? ఎప్పుడు జరిగిందని? డ్యామేజీ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకున్నారని కమిషన్ ప్రశ్నించినట్లు సమాచారం. 2022లో భారీ వరదలతో మేజర్ డ్యామేజీ జరిగిందని నవయుగ డైరెక్టర్ రమేశ్ కమిషన్‌కు వివరించారు. గ్రౌంటింగ్‌తో పాటు అన్ని సమస్యలను పరిష్కరించామని డిజైన్ ఆధారంగా డ్యామేజీ తర్వాత రిపేర్లు చేశామని వివరించినట్టు తెలిసింది. పనులు పూర్తయినా ఫైనల్ బిల్లులను ఇంకా ఇవ్వలేదని నవయుగ సంస్థ కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది.

అమెజాన్@ రూ.60వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఇప్పటికే ప్రకటించింది. ఒక బిలియన్ పెట్టుబడులతో రాష్ట్రంలో మూడు సెంటర్లను గతంలోనే అభివృద్ధి చేసింది. ఈ మూడు కేంద్రాలు ఇప్పటికే పనిచేస్తున్నాయి. కొత్తగా చేపట్టే విస్తరణ ప్రణాళికలకు అవసరమైన భూమిని కేటాయించాలని అమెజాన్ వెబ్ సర్వీసెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అంగీకరించింది.

15వేల కోట్లకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ఎంఓయు

హైదరాబాద్‌లో అత్యాధునిక డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ముందుకొచ్చింది. రూ.15,000 కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో అమెరికాకు చెందిన ఈ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఉన్నతాధికారులు టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ ప్రెసిడెంట్ సచిత్ అహుజాతో ఈ ఒప్పందం చేసుకున్నారు.

రూ.5000 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఎఐ డేటా సెంటర్

అమెరికాకు చెందిన ఉర్సా క్లస్టర్స్ కంపెనీ దాదాపు రూ.5000 కోట్లు పెట్టుబడితో తెలంగాణ రాష్ట్రంలో అత్యాధునిక ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. దీనికి సంబంధించి దావోస్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో ఉర్సా క్లస్టర్స్ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. కంపెనీ సిఓఓ సతీష్ అబ్బూరి, సిఆర్‌ఓ ఎరిక్ వార్నర్ ఈ ఒప్పందంపై సంతకం చేశారు. హైదరాబాద్‌లో 100 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తామని కంపెనీ సిఈఓ పెందుర్తి చెప్పారు. ఇందులో హైబ్రిడ్ ఎఐ చిప్‌లను ఉపయోగిస్తామన్నారు.

రూ.7000 కోట్ల పెట్టుబడులతో సోలార్ సెల్స్ తయారీ యూనిట్

మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ అక్షత్ గ్రీన్ టెక్ రూ.7,000 కోట్ల పెట్టుబడులతో తెలంగాణ రాష్ట్రంలో అత్యాధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ స్థాపించనుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సారధ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల సమక్షంలో అక్షత్ గ్రీన్‌టెక్‌తో (మైత్రా గ్రూప్) అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కంపెనీ తరపున డైరెక్టర్ గిరీష్ గెల్లి ఈ సమావేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ కంపెనీ హైదరాబాద్‌లో 6.9 గిగావాట్ల సోలార్ సెల్స్, 6.9 గిగావాట్ల సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుంది. మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ అక్షత్ గ్రీన్ టెక్ ఈ ప్రాజెక్టు కోసం రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుండగా, దాదాపు 2,500 మందికి ఉద్యోగాలు లభిస్తాయని, స్థానికంగా మరింత మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ ఐటి క్యాంపస్ విస్తరణ

ప్రపంచ దిగ్గజ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) సంస్థ ఇన్ఫోసిస్ హైదరాబాద్‌లో తమ ఐటి క్యాంపస్‌ను విస్తరించనుంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం పోచారంలో ఉన్న ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో మొదటి దశలో ఇన్ఫోసిస్ సంస్థ రూ.750 కోట్ల పెట్టుబడితో కొత్త ఐటి భవనాల నిర్మాణం చేపట్టి 17 వేల ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రణాళికను సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా అక్కడున్న సదుపాయాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

గోపనపల్లిలో కొత్తగా మరో ఐటి సెంటర్

హైదరాబాద్‌లోని తమ విప్రో క్యాంపస్‌ను విస్తరించనున్నట్లు విప్రో కంపెనీ ప్రకటించింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని గోపనపల్లిలో కొత్తగా మరో ఐటి సెంటర్‌ను నెలకొల్పనుంది. ఈ సెంటర్‌తో అదనంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 5000 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. హైదరాబాద్‌లో ఐటి రంగం వృద్ధిలో విప్రో కీలక భాగస్వామిగా ఉంది. విప్రో క్యాంపస్ విస్తరణతో రాష్ట్రంలో సాంకేతిక రంగం మరింత వృద్ధి చెందనుందని, ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయని ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. కొత్త ఐటీ సెంటర్ రానున్న రెండు మూడేండ్లలో పూర్తవుతుంది. ప్రభుత్వంతో విప్రో చేసుకున్న ఒప్పందంతో ప్రపంచ ఐటి పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణ ఖ్యాతి మరింత బలోపేతమవుతుంది. విప్రో విస్తరణ ప్రణాళికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వాగతిస్తూ, విప్రో లాంటి పేరొందిన సంస్థలకు తగిన మద్దతు ఇచ్చేందుకు, వ్యాపారాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందన్నారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అవకాశాలు సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేయడం తమకు ఉత్సాహంగా ఉందని ఈ సందర్భంగా విప్రో ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రిషద్ ప్రేమ్‌జి అన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు విప్రో కంపెనీని ఆహ్వానించారు.

హైదరాబాద్‌లో ఎక్లాట్ హెల్త్ కొత్త ఆఫీస్

ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. దాదాపు 800 మంది ఉద్యోగులకు సదుపాయం ఉండే విధంగా ఈ కార్యాలయాన్ని నెలకొల్పనుంది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, అధికారులు ఎక్లాట్ కంపెనీ సిఈఓ కార్తీక్ పోల్సానితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో అత్యాధునిక 800 సీట్ల సౌకర్యాన్ని ఎక్లాట్ ఏర్పాటు చేస్తుందని, ఏప్రిల్ 2025 నాటికి ఇది పనిచేయడం ప్రారంభిస్తుందని, ఎక్లాట్ విస్తరణతో తెలంగాణలో కొత్తగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, నైపుణ్య అభివృద్ధికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రోత్సహకరంగా ఉన్నాయని ఎక్లాట్ హెల్త్ గ్రూప్ సిఈఓ కార్తీక్ పోల్సాని ఈ సందర్భంగా అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ క్లయింట్లకు హెల్త్ కేర్ సేవలను అందించేందుకు తెలంగాణ రాష్ట్రంలో అన్ని అనుకూలతలు ఉన్నాయని ఆయన చెప్పారు.

తెలంగాణలో సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి ఎక్సలెన్స్ సెంటర్

తెలంగాణలో సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి సుహానా మసాలా, ఎకో ఫ్యాక్టరీ ఫౌండేషన్ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సెలెన్స్ సెంటర్‌ను నెలకొల్పుతారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సుగంధ ద్రవ్యాల సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సమావేశం సందర్భంగా సుహానా డైరెక్టర్ ఆనంద్ చోర్డియా తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. ''రానున్న రెండు మూడేండ్లలో ఈ సెంటర్ ద్వారా 25 వేల నుంచి 30 వేల మంది రైతులకు శిక్షణనిస్తారు. సుగంధ ద్రవ్యాల నాణ్యత, వ్యవసాయ పద్ధతులను అధునికరించే నైపుణ్యాలు అందిస్తారు. సుగంధ ద్రవ్యాల ఉత్పత్తికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించటంతో పాటు రైతుల జీవనోపాధి పెంచేలా మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తుంది'' అని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. ఈ స

ఇండ్లు లేని నిరుపేదలకు తొలి ప్రాధాన్యత

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో ఇండ్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతను ఇస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ఆయన అందోల్ మండలంలోని నేరిడి గుంట గ్రామ సభకు కలెక్టర్, అదనపు కలెక్టరలతో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1994లో కొనుగోలు చేసిన ఐదెకరాల్లో పది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల కాలనీ ఏర్పాటుకు శంకుస్థాపన, 1994లో కొనుగోలు చేసిన ఐదెకరాల భూమిని సర్వే జరిపి కాలనీ ఏర్పాటు చేయాలని ఆర్డీఓకు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఇల్లు లేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గురువారం అందోల్ మండలంలోని నేరడి గుంటలో జరిగిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌లతో కలిసి మంత్రి హాజరయ్యారు ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తాను గ్రామంలోని నిరుపేద ప్రజల అవసరాల కోసం, గ్రామాభివృద్ధి పనులు నిర్మాణాల కోసం 1994లో ఐదెకరాల భూమిని కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ భూమిని ఏం చేయాలని మంత్రి గ్రామ ప్రజలను అడిగారు. స్థలాలు లేని నిరుపేద ప్రజలకు ఇళ్లస్థలాలకు పంపిణీ , ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలియజేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. భూమిని సర్వే జరిపించి లే అవుట్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని గ్రామంలోని నిరుపేద లబ్ధిదారులను ఇండ్ల స్థలాలు పంపిణీ కోసం ఎంపిక చేయాలని మంత్రి అందోల్ ఆర్డీఓ పాండును ఆదేశించారు. ఇందిరమ్మ, ఇండ్ల శంకుస్థాపన రోజే నేరడిగుంట ఎర్రారం, రోడ్డు వేయిస్తానని తెలియజేసారు. పార్టీలకతీతంగా నిరుపేద ప్రజలకు ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ, ఇండ్లు, మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పంటలు సాగు చేస్తున్న వ్యవసాయ భూములన్నిటికీ రైతు భరోసా కింద ప్రతి పంటకు రూ.6వేలు చొప్పున ప్రభుత్వం అందజేయున్నట్లు తెలిపారు. రేషన్ కార్డుల పంపిణీ ఇందిరమ్మ, ఇండ్ల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మంత్రి దామోదర్ రాజనర్సింహా తెలిపారు. గత పది సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఆయా పథకాల అమలు కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించారని అనంతరం గ్రామ సభలను ఏర్పాటు చేసి గ్రామ సభలలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోని లబ్దిదారులు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా పౌరసరఫరాల శాఖ అదికారి శ్రీనివాస్‌రెడ్డి, పిడి హౌసింగ్ చలపతిరావు, ఆర్డీఓ పాండు, తహసీల్దార్, విష్ణు, సాగర్, వివిధ సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ చట్టాల అమలు

ఆల్ ఇండియా లోడింగ్, అన్‌లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సుకుమార్ దామ్లే

ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలోని వివిధ రంగాలలో లోడింగ్, అన్‌లోడింగ్ విభాగంలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు ఎటువంటి రక్షణ చట్టాలు లేవని, మహారాష్ట్ర తరహా మథాడి యాక్ట్‌ను ప్రవేశపెట్టాలని, తద్వారా కార్మికులకు న్యాయం జరిగే అవకాశం ఉన్నదని ఆల్ ఇండియా లోడింగ్ అన్‌లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎఐటియుసి జాతీయ కార్యదర్శి సుకుమార్ దామ్లే డిమాండ్ చేశారు. లోడింగ్ ,అన్‌లోడింగ్ కార్మికులకు కూడా సంక్షేమ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాబోయే పార్లమెంటు సమావేశాల సందర్భంగా దేశవ్యాప్తంగా లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులను సమీకరించి 'చలో పార్లమెంటు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 'ఆల్ ఇండియా లోడింగ్ అన్‌లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్' జాతీయ అధ్యక్షులు ఎస్.బాలరాజ్ అధ్యక్షతన 'ఆల్ ఇండియా లోడింగ్ అన్‌లోడింగ్ వర్కర్స్ ఫెడరేషన్' జాతీయ కార్యవర్గ సమావేశం గురువారం హైదరాబాద్, హిమాయత్‌నగర్, ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సుకుమార్ దామ్లే మాట్లాడుతూ మహారాష్ట్ర మథాడి యాక్ట్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, తద్వారా దేశంలో లోడింగ్ అన్‌లోడింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు పేమెంట్ ఆఫ్ వేజెస్, బోనస్, గ్రాచుటీ, ప్రావిడెంట్ ఫండ్, ఇండస్ట్రియల్ డిస్ప్యూటి లాంటి తదితర చట్టాలు అమలు చేసేందుకు అవకాశం ఉంటుందని ఆయన వెల్లడించారు. గతంలో యుపిఎ గవర్నమెంట్ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి,దేశ వ్యాప్తంగా అమలు చేయడం ద్వారా కోట్లాది మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు పరిధిలోనికి వచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలను సవరించి, కార్మికులకు అన్యాయం చేస్తూ, పారిశ్రామిక వేత్తలకు, బడా పెట్టుబడిదారులకు మాత్రమే మేలు జరిగేలా ప్రస్తుత బిజెపి ప్రభుత్వవిధానాలు ఉన్నాయని విమర్శించారు. పేద కార్మికులు కేంద్ర ప్రభుత్వాన్ని తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సివిల్ సప్లై,ఆర్‌టిసి పోర్టర్స్, అగ్రికల్చర్ మార్కెట్ హమాలీస్, ఐఎంఎఫ్‌ఎల్‌డిపో హమాలిస్, బజార్ హమాలీస్ లాంటి లక్షలాది మంది కార్మికులు సరుకులను ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తరలించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. యూనియన్ అధ్యక్షులు ఎస్.బాలరాజు మాట్లాడుతూ లోడింగ్ అన్‌లోడింగ్ హమాలీ కార్మికులను నాలుగవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వానికి, వ్యాపారులకు మధ్యవర్తులుగా ఉండి సరుకు రవాణాలో తమ శ్రమను ఖర్చు చేస్తున్న హమాలీలకు తగిన రక్షణ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, యూనియన్ జాతీయ నాయకులు ఎం.ప్రవీణ్ కుమార్, వెంకట సుబ్బయ్య అంజిబాబు కొఠారి రమణ, మహేష్, సత్పాల్, రంజిత్ తాయా, అమర్ సింగ్ భటియ, ఎ.గట్టయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ : మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హుస్నాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియని అందులో మంత్రిగా నా ప్రమేయం ఏమి ఉండదని తెలంగాణ బిసి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలో పలు వార్డుల్లో 4. 25 కోట్లతో మరియు 3కోట్లతో పందిల్ల వాగు నుండి ఎల్లమ్మ చెరువు వరకు బైపాస్ రోడ్డు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ మిక్కిలనేని మనుచౌదరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ 15 వార్డులో వార్డు సభలో పాల్గొని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులు ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో మంత్రిగా తన పాత్ర ఏమి ఉండదని ఇందులో అధికారులు పారదర్శకంగా అర్హులైన పేదలకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. వార్డు సభలో తమ పేరు రానివారు మరో మారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికి ఉంటుందని ముందు విషయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తగు సూచనలు ఇవ్వాలని కోరారు. రెండు లక్షల రుణమాఫీ కాని వారు మార్చిలో రైతు రుణమాఫీ షెడ్యూల్ పెట్టి అందరికి రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి వార్డు ప్రజలు ఎడ్ల బండ్లతో డప్పు చప్పులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింమూర్తి, సహకార సంఘం చైర్మన్ బి.శివయ్య, మున్సిపల్ చైర్మన్ అకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అనితరెడ్డి , ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మరవిందర్, ఆర్‌డివో రామూర్తి, తహశీల్‌దారు రవిందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడి, మంజూలరెడ్డితో పాటు కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

అడవుల్లో ఏరివేతలు... కూల్చివేతలు

స్థూపాలను కూల్చేస్తున్న భద్రతా బలగాలు
నక్సల్స్ శిక్షణా శిబిరాలు ధ్వంసం

ప్రజాపక్షం/భద్రాచలం : వరుస ఘటనలో బలహీన పడుతున్న మావోయిస్టు పార్టీ అడవుల్లోని వారి శిక్షణా శిబిరాలను, మృతి చెందిన మావోయిస్టుల స్మారక స్థూపాలను భద్రతా బలగాలు ధ్వంసం చేస్తూ , కూల్చివేస్తున్నాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి మావోయిస్టు రహితదేశంగా భారత్ అవతరిస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పలుమార్లు ఇప్పటికే ప్రకటించారు. తాజాగా గరియాబాంద్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత భద్రతాబలగాలపై ప్రశంసల జల్లు కురిపించిన ఆయన లక్ష్యానికి అతి చేరువలో ఉన్నట్లు చెప్పుకొచ్చారు. దీంతో అడవుల్లో వేలాది మంది బలగాలను మోహరాయిస్తూ మావోయిస్టులను ఏరివేసేందుకు మరికొంత దూకుడు ప్రదర్శించడంతో పాటు అడవుల్లోని స్థూపాలను సైతం గునపాలు, సుత్తితో కూల్చివేస్తున్నారు. అడవులను జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల్లోని పలు చోట్ల నక్సల్స్ నిర్మించిన పలు కట్టడాలను గుర్తించారు. ఇదిలా ఉండగా తాజాగా ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ అడవుల్లో భద్రతా బలగాలు మావోయిస్టుల శిక్షణా శిబిరాన్ని గుర్తించాయి. మావోయిస్టు పార్టీకి చెందిన కేంద్రకమిటీ సభ్యుడు కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ స్మారక స్థూపాన్ని గుర్తించి ధ్వంసం చేశాయి. అంతే కాకుండా సుమారు 1.30 కి.మీ విస్తీర్ణంలో గల మావోయిస్టుల ట్రైనింగ్ సెంటర్‌లో నిర్మించిన గుడిసెలు, ఇతర కట్టడాలు, బంకర్లు, మరికొన్ని నిర్మాణాలు ధ్వంసం చేశారు. అందుకు సంబంధించిన వీడియోలను బలగాలు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దండకారణ్యంలో మావోయిస్టులు ఉనికి లేకుండా చేసేందుకు కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తం చేస్తున్న యుద్ధం మరింత ముందుకు సాగే అవకాశాలేని కనిపిస్తున్నాయి.

రజకులను అణగారిన వర్గాలుగా గుర్తించాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఉన్న రజకులను అణుగారిన వర్గాలుగా గుర్తించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకులు ఆర్థికంగా, సామజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వాషెర్‌మెన్ ఫెడరేషన్‌కు తగినన్ని నిధులు కేటాయించి, ఆధునిక సాంకేతికతను జోడిస్తూ రజక వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ అమృత ఎస్టేట్స్‌లోని తెలంగాణ వృత్తిదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో గురువారం తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలండర్‌ను తెలంగాణ రాష్ట్ర వృత్తి సంఘాల సమాఖ్య అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బొడ్డుపల్లి కృష్ణ, ఉపాధ్యక్షులు పగిళ్ల జోజి, కార్యదర్శి గోరుకంటి కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దండు నిరంజన్, ఉడుతల మల్లేష్‌లతో కలసి చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రజకులు దేశంలో 18 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్‌సి జాబితాలో ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలన్నారు. రజక ఫెడరేషన్‌కు పాలకమండలి ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఉన్న రజక జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌ను కేటాయించాలని, దొబీగాట్లను ఆధునీకరించాలన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి చాడ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ చేతి వృత్తులు ప్రాచీన వృత్తులని, గ్రామీణ జీవనంలో మమేకమై అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యాయన్నారు. రజకులకు బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేసి, వారి సంక్షేమానికి ప్రభుత్వం తోడ్పాటును ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న స్కిల్స్ యూనివర్సిటీలో గ్రామీణ చేతి వృత్తిదారులకు ప్రవేశం కల్పించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన శిక్షణను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 55 ఏళ్లు నిండిన రజకులకు రూ.4000 పెన్షన్ మంజూరు చేయాలని, ప్రస్తుతం కొనసాగిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 500 యూనిట్లకు పెంచాలని బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సోషల్ మీడియాలో ఇంటి చిరునామా పెట్టొద్దు

ఊరెళ్తున్నామంటూ పోస్టులు పెట్టొద్దు
తెలంగాణ పోలీసుల సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్: సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో నేరగాళ్లు దీన్ని కూడా తమకు ఒక అవకాశంగా మలచుకుంటున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే చాలా మంది తమకు సంబంధించి ఎప్పటికప్పుడు అప్డేట్స్‌ను పోస్ట్ చేస్తుంటారు. తమ స్టేటస్‌తోపాటు తాము ఏం చేస్తున్నదీ, ఎక్కడికి వెళ్తున్నదీ వంటివి మెసేజ్‌లు పెడుతుంటారు. ఇలాంటి వాటిని నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకునే అవకాశం ఉందని, వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పోస్ట్ చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలంటున్నారు. వ్యూస్ (వీక్షణలు), లైక్స్ కోసం దినచర్యను పోస్ట్ చేయవద్దని, ముఖ్యంగా ఊరెళ్తున్నామంటూ పోస్టు చేయడం యమ డేంజర్ అంటూ 'ఎక్స్' ద్వారా పోలీసులు సూచిస్తున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో వ్యూస్ కోసం హాంటూర్స్ (ఇంటిని చూపించడం) చేయవద్దని, సోషల్ మీడియాలో ఇంటి చిరునామాను బహిర్గతం చేయవద్దని పోలీసులు పేర్కొంటున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

కొత్త మండలాల్లో పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు కృషి : డిజిపి డాక్టర్ జితేందర్

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : రాష్ట్రంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మెదక్ జిల్లాలో నూతనంగా ఏర్పాటైన కొత్త మండలాల్లో పోలీసు స్టేషన్ల ఏర్పాటుకు కృషి చేస్తానని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ స్పష్టం చేశారు. గురువారం మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్మించిన సెల్యూట్ బేస్, గ్యాలరీస్, పరేడ్ మైదానాన్ని తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ ప్రారంభించగా కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎంపి రఘునందన్ రావు, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా కేంద్రంలో మంచి పరేడ్ గ్రౌండ్ అందుబాటులోకి అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సిబ్బంది టీవీడీఏల కోసం రూ.200 కోట్ల రూపాయలు విడుదల చేసిందనీ అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య బిల్లుల కోసం రూ.75 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు సూచించిన మేరకు కొత్త మండలాల్లో పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పర్యవేక్షణలో ఎస్పీ కృషి అభినందనీయం అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ పోలీసులు అనునిత్యం పనిచేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు నిత్యం ఆరోగ్యాంగా ఉండాలంటే, వారు గ్రౌండ్ ను నిత్యం వినియోగించుకోవాలని సూచించారు. పోలీసుల సంక్షేమం కోసం డిజిపి గా నేనున్నా అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసుల కంటే తెలంగాణ పోలీస్ సిబ్బం ది మెరుగ్గా పని చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఉత్తమ సేవలను అందించేందుకు పోలిస్ శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో సైబర్ క్రైమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్లవల్ల ఇబ్బంది పడుతున్నట్లైతే వెంటనే 1930కు ఫోన్ చేసి సైబర్ క్రైమ్‌ల నుంచి రక్షణ పొందాలని అన్నారు.

మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పోలీసులంటే 24 గంటలు డ్యూటీలు ఉండే వ్యక్తులు, అధికార, ప్రతిపక్ష నాయకులకు, ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు 24 గంటలు పని చేస్తారన్నారు. కష్టపడి పని చేసే పోలీసులకు పోలీస్ కానిస్టేబుల్‌లకు కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. పోలీస్ మిత్రులకు మెడికల్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 13 నెలలుగా కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, యూనిఫామ్ సర్వీస్‌లో ఉండే వారికి వారి సమస్యలు చెప్పుకోలేక భయపడుతున్నారని అన్నారు. టివీ, డివిలు కూడా రావడం లేదన్నారు. దీన్ని మొదటి ప్రాధాన్యతగా చూడాలని అన్నారు. మెదక్ జిల్లాలో మాసాయిపేట, నార్సింగి, హవేలీ ఘన్ పూర్, మండలలకు కొత్త పోలీస్ స్టేషన్‌లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలి అని చెప్పారు. మెదక్ పట్టణానికి ఒకే పోలీస్ స్టేషన్ ఉంది. అమీన్ పూర్ పోలీస్ స్టేషన్‌కు ఒక ఎకరం స్థలం కూడా కేటాయించడం జరిగింది అన్నారు. అక్కడ మరొక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాయపోల్ పోలీస్ స్టేషన్ అద్దె భవన్‌లో నడుస్తుంది. అక్కడ కూడా నూతన పోలీస్ స్టేషన్ నూతన భవనం నిర్మాణం, అవసరం ఉంటుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో సీసీ టీవీలు పని చేయడం లేదని మండల కేంద్రంలో సిసి టీవీ నిర్వహణకు సహకరించాలని డిజిపిని కోరారు. పోలీసులకు డ్యూటీతో పాటు శారీరక శ్రమ అవసరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు జిల్లాలో అన్ని మండలాల ఎస్ఐలు, కానిస్టేబుల్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

వలిగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/వలిగొండ : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని, రైతులు బాగుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రికి కోలాట బృందం మహిళలు, బోనాలు, లంబాడ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఘనంగా గజమాలతో స్వాగతం పలికారు. మెయిన్ రోడ్డు నుండి ఫంక్షన్ హాలు వరకు భారీ ర్యాలీతో ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో నూతన పాలకమండలి సభ్యులు ఛైర్మన్ భూక్యా భీమా నాయక్, వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, సభ్యులు గుండు దానయ్య, జక్క దామోదర్ రెడ్డి, రాచమల్ల తిరుపతయ్య, జూకంటి శివమ్మా, ఉక్కుర్తి చెంద్రయ్య, బోయిని యాదయ్య, గజ్జెనపెల్లి నరేందర్ రెడ్డి, దిండిగల్ల సత్తయ్య, కర్నాటి లింగ స్వామి, పెద్దగోని వెంకటేశం, తౌటం నరహరి, నాగేల్లి కృష్ణ మూర్తి, చిట్టెడి వెంకట్రాం రెడ్డి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయించి మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంత సాగు నీటి కాలువలకు 500 కోట్ల నిధులు మంజూరు చేశారని, రైతు బంధు కింద 7625 కోట్ల నిధులు రైతులకు అందజేశారని, రైతులకు సబ్సిడీ కింద వ్యవసాయ పరికరాలు అందజేయాలని1000 కోట్ల నిధులు విడుదల చేశారని, ఈ ప్రాంత రైతులకు ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి మార్కెట్లలో గోదాముల నిర్మాణానికి 2 కోట్ల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని, రైతులకు సాగు నీటి ఎద్దడి తీర్చడానికి ఈ ప్రాంత సాగు నీటి కాల్వలు బునాదిగాని కాల్వకు 269 కోట్లు, పిలాయిపల్లి కాల్వకు, ధర్మారెడ్డి పల్లె కాల్వకు నిధులు ఇవ్వడం జరిగింది అన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, జెడ్‌పి సిఇఒ శోభారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బిసి కుటుంబానికి

రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. గత 9 సంవత్సరాలుగా ఒక్క బిసికి కూడా సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని, రెండుసార్లు 2015లో 3 లక్షల 62 వేల దరఖాస్తులు స్వీకరించినప్పటికీ అప్పటి ప్రభుత్వం రుణాలను మంజూరు చేయలేదని మండిపడ్డారు. బిసి కార్పొరేషన్ ద్వారా ప్రతి బిసి కుటుంబానికి రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, ప్రస్తుతం ఉన్న 12 కుల ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చాలన్నారు. హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చెరుకు మణికంఠ అధ్యక్షత వహించారు. దాదాపు 30 కులాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని, ప్రతి కార్పొరేషన్‌కు చైర్మన్‌తో పాటు పాలకమండలిని ఏర్పాటు చేయాలని, జిల్లా బిసి కార్పొరేషన్ ఇడి పోస్టులు గతంలో రద్దు చేశారని, ప్రస్తుతం రుణాలు ఇవ్వడానికి జిల

ప్రజాపక్షం
శుక్రవారం, జనవరి 24

ఢిల్లీ ఎన్నికలు ఉత్కంఠభరితం

బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)లకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కేంద్రపాలిత ప్రాంతం దిల్లీ(ఢిల్లీ) అసెంబ్లీ ఎన్నికలకు సమయం 12రోజుల్లోకి వచ్చింది. అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో అనూహ్యంగా జాతీయ రాజకీయాల్లోకి దూసుకువచ్చిన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్ ఆప్‌ను ఏర్పాటు చేసి 11సంవత్సరాలకుపైగా దిల్లీలో సాగిస్తున్న పరిపాలనను నిలుపుకోగలరా? లిక్కర్ కుంభకోణం అంటూ బిజెపి కేంద్రప్రభుత్వం ఆయనపై, సీనియర్ మంత్రివర్గ సహచరులపై అవినీతి కేసు బనాయించి జైల్లో నిర్బంధించిన (ఇప్పుడు బెయిలుపై ఉన్నారు) తీరు కేజ్రీవాల్‌కు మేలు చేస్తుందా? లేక చేటు చేస్తుందా? రాజధాని నగరంలో 28సంవత్సరాల తదుపరి అధికారం చేజిక్కించుకునేందుకు బిజెపి చేస్తున్న బహుముఖ ప్రయత్నం ఫలిస్తుందా? 'దేశమంతటా గెలిచినా ఇంట్లో పరాజయం' లాంటి అవమాన భారం నుంచి ప్రధాని నరేంద్రమోదీని దిల్లీ ఓటర్లు ఈసారైనా బయటపడేస్తారా? ఫిబ్రవరి 5న పోలింగ్ తదుపరి 8వ తేదీన ఓట్ల లెక్కింపు మాత్రమే ఈ ప్రశ్నలకు జవాబు చెప్పగలదు. దిల్లీ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 70. మ్యాజిక్ ఫిగర్ 36. గత రెండు–మూడు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి బలం ఏకసంఖ్యను మించలేదు. కాని 7లోక్‌సభ సీట్లను గుండుగుత్తగా బిజెపియే గెలుస్తున్నది! జాతీయస్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా ఏర్పడిన ప్రతిపక్ష పార్టీల కూటమి 'ఇండి'లో కాంగ్రెస్‌తో పాటు ఆప్ కూడా భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలు దిల్లీ రాజకీయాల్లో ఎప్పుడూ ప్రత్యర్థులే. ఎందుకంటే, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఆప్ పుట్టుకొచ్చింది. ఆప్ దిల్లీ వెలుపల అధికారంలో ఉన్న పంజాబ్‌లోనూ అవి ప్రత్యర్థులే. గత లోక్‌సభ ఎన్నికల్లో దిల్లీలో పొత్తుపెట్టుకున్నా అది సానుకూల ఫలితమివ్వలేదు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ విడివిడిగా పోటీ చేస్తున్నాయి. దిల్లీలో స్థాన బలం లేకపోయినా ఇండియా కూటమి భాగస్వాములు మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్, అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాది పార్టీ, శరద్ పవార్ ఎన్‌సిపి కేజ్రీవాల్ పార్టీకి నైతిక మద్దతు ప్రకటించాయి. ఇండియా కూటమినుండి లేదా దాని నాయకత్వం నుండి కాంగ్రెస్‌ను తొలగించాలని ఈ పార్టీలు అంతకుముందే ప్రకటనలు చేసి ఉన్నందున, దిల్లీలో పరస్పర పోటీతో ఆ కూటమి విచ్ఛిన్నమైందని ప్రత్యర్థులు చేసిన ప్రచారానికి ఎటువంటి స్పందన రాలేదు. దాంతో ఆ ప్రచారం అటకెక్కింది. హిందీ బెల్టులో కాంగ్రెస్ బలహీనశక్తిగా, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీలతో కాంగ్రెస్‌కు వైరుధ్యం తప్పదు. అయితే కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఉన్న రాష్ట్రాల్లో ఈ పార్టీలను, కమ్యూనిస్టు పార్టీలను కలుపుకుపోయే విశాల దృష్టి లోపించటం కాంగ్రెస్‌కి నష్టం చేస్తున్నది. ఎన్ని వైరుధ్యాలున్నా ఇండియా కూటమి పార్టీలు దేశ ప్రయోజనాల రీత్యా కలిసి ప్రయాణం చేయటం అవసరం. అయితే దిల్లీలో స్నేహితులుగా పోటీలు కాకుండా ప్రత్యర్థుల్లా పరస్పర నిందారోపణలు చేసుకోవటం పరోక్షంగా బిజెపికి మేలు చేస్తుంది.

> కేజ్రీవాల్ బిజెపికి ముందరి కాళ్లకు బంధం వేసినట్లు, ఫిబ్రవరి1న కేంద్రప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించే 2025–26 బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు అనేక రాయితీలివ్వాలని వ్యూహాత్మకంగా డిమాండ్ చేశారు.

బిజెపి, ఆప్‌లు ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచితాల హామీల్లో పోటీపడ్డాయి. ముఖ్యంగా మహిళా ఓటర్లకు ప్రత్యేకించి, నెలవారీ నగదు బదిలీ పథకాల ప్రకటన ఇటీవల సంవత్సరాల్లో అన్ని రాష్ట్రాల్లో సర్వసాధారణ అయినట్లే దిల్లీలో కాంగ్రెస్ సహా మూడు పార్టీలు ఘనమైన ప్రకటనలు చేశాయి. ప్రభుత్వ విద్య, వైద్య సేవల్లో ఆప్ ప్రభుత్వం మంచిపేరు తెచ్చుకున్నందున బిజెపి మరో అడుగుగెంతి కెజి నుంచి పిజి దాకా ఉచిత విద్య హామీ ఇచ్చింది. ప్రధానమంత్రి స్వయంగా కార్యకర్తలకు బూత్ మేనేజిమెంట్ బోధించారు. కాగా కేజ్రీవాల్ బిజెపికి ముందరి కాళ్లకు బంధం వేసినట్లు, ఫిబ్రవరి1న కేంద్రప్రభుత్వం పార్లమెంటుకు సమర్పించే 2025–26 బడ్జెట్‌లో మధ్యతరగతి ప్రజలకు అనేక రాయితీలివ్వాలని వ్యూహాత్మకంగా డిమాండ్ చేశారు.

ఇదిలాఉండగా 2024తో పోల్చితే అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల చేర్పులు – తొలగింపులపై పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. ఏమైనా, నియోజకవర్గం వారీ ఓటర్ల పెరుగుదల లేక తరుగుదల ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తుంది.

బిఆర్ఎస్ 'పునరుజ్జీవనాని'కి కవిత కీలక పాత్ర?

ఎస్‌కె. జకీర్
9052631212
సీనియర్ జర్నలిస్ట్

''మా పార్టీలో 60 లక్షల మంది సభ్యులున్నారు. ఖబర్దార్! మరోసారి బిఆర్ఎస్ ఆఫీసులవైపు కన్నెత్తి చూస్తే తీవ్ర ప్రతిఘటన ఉంటుంది'' అని ఎమ్మెల్సీ కవిత బుధవారం యాదగిరిగుట్టపై గర్జించారు. కొంతకాలంగా ఆమె కెటిఆర్, హరీశ్‌రావుల కంటే దూకుడుగా ప్రకటనలు చేస్తున్నారు. పులిలా గాండ్రిస్తున్నారు. ప్రభుత్వంపైనా, ముఖ్యమంత్రి, మంత్రులపైనా కవిత అవకాశం దొరికినప్పుడల్లా విరుచుకుపడుతున్నారు. ఆమె ఇలా క్రియాశీల రాజకీయ కార్యకలాపాలు నడపడం ఆ పార్టీకి చెందిన కొందరు ముఖ్యనాయకులకు సహజంగానే రుచించని వ్యవహారం. లిక్కర్ కేసు కారణంగా ఆమెను 'అంటరాని మనిషి'గా కొందరు బిఆర్ఎస్ నేతలే ప్రవర్తిస్తున్నట్టు విమర్శలున్నవి. కవిత నిర్దోషి, అక్రమంగా కేసు బనాయించారంటూ మాట్లాడినవారికి ఆమె 'అంటరాని మనిషి' ఎలా అవుతారో? తెలియదు. కవిత ఇవేవీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నట్టు ఆమె మద్దతుదారులంటున్నారు.

పార్టీ కార్యకర్తలకు మనోబలాన్ని ఇవ్వడానికి కెటిఆర్, హరీశ్‌రావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నా 'వర్క్ వుట్' కావడం లేదు. కొన్ని ఆర్‌టిసి బస్సుల వెనుక 'డ్రైవర్ శిక్షణలో ఉన్నాడు' అని రాసి ఉన్నట్టు గా కెటిఆర్ పరిస్థితి ఉందని ఆయనంటే గిట్టని వాళ్ళు చెప్పే మాట. పార్టీలో అన్ని స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తల ఆమోదం కెటిఆర్ కు లేదన్న ప్రచారం పార్టీ వర్గాల్లో ఉన్నది. ఆయన కన్నా ఎమ్మెల్సీ కవిత బెటర్ అనీ, ఆమెకు పోరాడే పటిమ, నాయకత్వ ప్రతిభ పుష్కలం గా ఉన్నట్టు ఆ వర్గాలే అంటున్నాయి. అయితే కవిత లిక్కర్ కేసు లో జైలుకు వెళ్లి వచ్చినందు న ఆమెకు పార్టీలో ప్రాధాన్యం ఇచ్చే విషయంలో కొంత సందిగ్ధం ఉంది. ఆమె జైలు నుంచి బయటకు వచ్చాక దాదాపు మూడు నెలల దాకా అటువైపు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడలేదు. కవితను పరామర్శిస్తే కెటిఆర్, హరీశ్‌రావు ఏమనుకుంటారోనని వాళ్ళు అనుకోని ఉండవచ్చు.రణరంగం మధ్యలో వైరాగ్యం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని 'పెద్దసారు' కు చెప్పగలిగే సాహసం ఎవరికీ లేదు. కార్యకర్తలకు కెసిఆర్ మాటే మంత్రం. అదే శిరోధార్యం.

కానీ అమిత్ షా, చంద్రబాబు, జగన్, రేవంత్ రెడ్డి తదితరులు అరెస్టయి జైలుకు వెళ్లి రాలేదా? అని కవిత మద్దతుదారులు, పలువురు బిఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. బిఆర్ఎస్‌కు చెందిన కొందరు ముఖ్యులే ఉద్దేశపూర్వకంగా ఆమెను రాజకీయంగా 'తొక్కడానికి' ఇలాంటి పసలేని వాదనలు తీసుకువస్తున్నట్టు తెలుస్తోంది. కవిత ఈ కేసులో నిరపరాధి అని మీడియాలో, పలు సమావేశాల్లో బహిరంగంగానే మాట్లాడుతున్న కొందరు బిఆర్ఎస్ నాయకులు మరి ఆమెకు పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశాలకు ఎందుకు 'గండి' కొడుతున్నారన్న అంశం చర్చకు వస్తోంది. కెటిఆర్, హరీశ్ రావు కన్నా ఆమె 'అగ్రెసివ్' అనీ, ఆమె పార్టీలో క్రియాశీల భూమికను పోషించేటట్లయితే మిగతా 'ప్రముఖుల' ఆటలు సాగవని కవిత అభిమానులంటున్నారు. బిఆర్ఎస్ 'వర్కింగ్ ప్రెసిడెంట్ 2' గా ఆమెను నియమించాలన్న డిమాండ్ వస్తోంది. 'సెక్రెటరీ జనరల్' పదవినిచ్చినా, లేదా అన్ని అనుబంధ సంస్థలకు బాధ్యురాలిగా నియమించినా పార్టీకి పూర్వవైభవం కోసం, పార్టీ పటిష్టత కోసం కవిత కృషి చేస్తారని అంటున్నారు. అలాగే కెసిఆర్ వలె ఎమ్మెల్సీ కవితది కూడా 'పెద్ద చెయ్యి' అనే ప్రచారం ఉన్నది. కొందరు బిఆర్ఎస్ 'ముఖ్యుల' వలె ఆమె 'పిసినారి' కాదని చెబుతున్నారు. పార్టీలో ఎవరు ఏమి చర్చించుకున్నా ఒక ఎజండా రూపొందించుకొని వేగంగా ముందుకు వెళ్లాలని కవిత ఆలోచిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు తండ్రి కెసిఆర్ ఆశీస్సులున్నట్టు కొన్ని వదంతులు లేకపోలేదు.

''అందరూ ఒక ఎత్తు అయితే అగస్త్యుడు ఒక్కడూ ఒక ఎత్తు. అతని కమండలం ఒక ఎత్తు'' అన్నట్టుగా ఉన్నది కెసిఆర్ వ్యవహార శైలి. తనకు తాను విధించుకున్న 'స్వీయ అజ్ఞాతవాసం' నుంచి ఆయన ఎప్పుడు బయటకు వస్తారా అని ఆయన పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నవి. ఆయన హయాంలో పలువురు బిఆర్ఎస్ చోటా మోటా నాయకుల నుంచి ఒక స్థాయి కార్యకర్త వరకు తెలంగాణ వనరులను ఎట్లా 'నంజుకు తిన్నారో' జనానికి తెలుసు. కనుక వాళ్లకు మరలా కెసిఆర్ వస్తేనే ఆ వైభవం వస్తుంది. కెసిఆర్ ఈ రాష్ట్రాన్ని తన సామ్రాజ్యంగా భావించిన కారణంగా ఆయన 'తన వాళ్లందరి'కీ సంపద కూడబెట్టుకునే స్వేచ్ఛను పరోక్షంగా, ప్రత్యక్షంగా కల్పించారన్న ఆరోపణలున్నవి.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకపోయి ఉంటే, ఫార్ములా ఈ కేసు సహా ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అంచనాల పెంపు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ధరణి పేరిట వేలాది ఎకరాల భూముల కైంకర్యం... తదితర వ్యవహారాలేవీ వెలుగు చూసేవి కావు. మూడో టర్మ్ కూడా కెసిఆర్ అధికారంలోకి వచ్చివుంటే బిఆర్ఎస్ కార్యకర్తల విజృంభణ మాములుగా ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కెసిఆర్, కెటిఆర్ ల ద్వారా వివిధ రకాలుగా 'సొమ్ము' చేసుకున్న వారంతా 'కరసేవకులు'గా మారి వీధుల్లో స్వైరవిహారం చేసే వారన్న ఆరోపణలూ ఉన్నవి.

బిఆర్ఎస్ పతనం కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఊహించలేదు. ఓటమి పాలయిన బిఆర్ఎస్‌ను మరి లేవకుండా చేయాలని కాంగ్రెస్ అనుకుంటున్నది. అందుకు పరిపాలనాపరంగా, రాజకీయంగానూ కొత్త పంథాను రేవంత్ ప్రారంభించినందున దాని ఫలితాలు కొంతకాలం తర్వాత గాని వెలుగులోకి రావు.

''రాజసం వేరు. అహంకారం వేరు. రాజరికపు రోజుల్లో రాజుకు అహంకారం ఒక హక్కు. కానీ నిజానికి అది అభద్రతకు సూచన. మీలో ఆత్మవిశ్వాసం పొంగిపొర్లవచ్చు. కానీ మిమ్మల్ని మీరు మోసగించుకుంటున్నారని గుర్తుంచుకోండి. రాజసం ప్రదర్శించినా అది ప్రజలకు నచ్చాలి. మీరు రాజు అని జనం నమ్మాలి. మీ వ్యవహార శైలి ఉదాత్తంగా ఉండాలి. ఆలోచనలు ఉన్నతంగా ఉండాలి'' అని 1601–1658 కాలానికి చెందిన తత్వవేత్త బాలస్తర్ గ్రేషియన్ అన్నాడు. దాదాపు నాలుగు వందల ఏళ్ల కిందట ఆ తత్వవేత్త చెప్పినట్టుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, లేని 'రాజసం' ప్రదర్శిస్తూ, అంతకు మించిన అహంకారాన్ని చూపుతూ పలు సెక్షన్ల ప్రజలకు 'దూరమయ్యారన్న' చర్చ అంతర్గతంగా బిఆర్ఎస్ పార్టీలో చాలాకాలంగా ఉంది.

అదే సమయంలో హరీశ్ రావు విషయంలో పార్టీకి చెందిన కొన్ని సెక్షన్లలో సానుకూలత ఉన్నప్పటికీ, ఆయన 'సంపూర్ణ విధేయతపై' అనుమానాలు లేకపోలేదు. పైగా ఈ మధ్యకాలంలో హరీశ్ రావు పట్ల బిజెపి నాయకుడు, కేంద్రమంత్రి బండి సంజయ్ 'సానుకూల' దృక్పథంతో వ్యాఖ్యలు చేస్తున్నారు. బిఆర్ఎస్ ను గందరగోళ పరచడానికి గాను ఇది బిజెపి ట్రిక్కు కూడా అయి ఉండవచ్చు. హరీశ్ విషయంలో మరో కేంద్రమంత్రి వైఖరి భిన్నంగా ఉందన్న ప్రచారమూ ఉన్నది. హరీశ్‌రావుకు 2016 నుంచే బిజెపి గాలం వేస్తున్నా ఆయన ఆ గాలానికి చిక్కడం లేదు. కేంద్రమంత్రి గడ్కరీతో కూడా రాయబారం నడిపినా ఫలితం లేకపోయిందని బిజెపి వర్గాల్లో చర్చ ఉన్నది. తాను పార్టీ మారే అవకాశాలు శూన్యమని,'కెసిఆర్ మాటే తనకు వేదవాక్కు' అని హరీశ్ రావు, బిజెపి ముఖ్యులకు స్పష్టం చేసినట్టు మరో ప్రచారం ఉన్నది.

బిఆర్ఎస్ నుంచి ఒక 'పొటెన్షియల్' నాయకుడు వస్తే, ఆయన వెంట కొందరు ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి నాయకులు వస్తారని' అనుకుంటున్నది. ఆ వ్యక్తి వ్యూహరచనతోనే 2028 చివరలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనతో బిజెపి ఉన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం సాగుతున్నది. ఎంపి ఈటెల రాజేందర్ సారధ్యంలో గతంలో 'చేరికల కమిటీ'ని ఏర్పాటు చేసినా ఫలితాలు ఆశాజనకంగా లేవు. బిజెపిలో కిషన్ రెడ్డి, ధర్మపురి అరవింద్, ఈటెల రాజేందర్, బండి సంజయ్ ల మధ్య పొసగడం లేదని ఆ పార్టీ శ్రేణులే అంటున్నవి. తనంతట తానుగా 'మ్యాజిక్ సీట్లు'(60) గెలవలేమని బిజెపి భావిస్తోంది. అందుకే ఇతర పార్టీల వైపు, ముఖ్యంగా బిఆర్ఎస్ వైపు చూస్తున్నది. బిఆర్ఎస్‌తో 'అవగాహన' కుదుర్చుకోవడమా? లేక బిఆర్ఎస్ సిద్ధపడితే 'విలీనం'చేసుకోవడమా? అనే అంశాలు చర్చల్లో ఉన్నాయి.

బిఆర్ఎస్‌లో కెసిఆర్ తర్వాత పొటెన్షియల్ నాయకులుగా కెటిఆర్, హరీశ్‌రావు, కవిత మాత్రమే ప్రజల్లో గుర్తింపు పొందారు. మాజీ ఎంపీ సంతోష్ కుమార్ జోగినపల్లి తెరవెనుక 'వ్యవహారాలు' చక్కబెట్టడంలో దిట్టగా పేరు సంపాదించారు. కొంతకాలంగా సంతోష్‌ను కెసిఆర్ దూరం పెట్టారన్న సమాచారం ఉంది. కానీ ఇది తాత్కాలికమే కావచ్చు. గతంలో కూడా పలు సందర్భాలలో సంతోష్‌ను కెసిఆర్ దూరం పెట్టారన్న ప్రచారం జరిగింది. మళ్ళీ కొద్దిరోజులకు కెసిఆర్ పక్కనే ఆయన కనిపించిన ఘటనలున్నవి. ప్రస్తుతం సంతోష్ జోగినపల్లి కూడా కూడా 'అజ్ఞాత వాసం'లో ఉన్నారు.

''ఊళ్ళో అధికారమైనా ఉండాలి లేదా ఊరంచున పొలమైనా ఉండాలి'' అనే పురాతన సామెత ఒకటుంది. కెసిఆర్ కు అధికారం రాకముందే పొలం ఉంది. తర్వాత అధికారంలోకి వచ్చారు. ప్రస్తుతం ''ఊళ్ళో అధికారం'' కోల్పోయారు. ''ఊరంచున పొలం'' అయితే ఉంది. కానీ ఆయన అధికారం లేకుండా, హంగూ ఆర్భాటం లేకుండా, మందీమార్బలం లేకుండా రాజకీయాలు నడిపే మనిషి కాదు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందా? అని కెసిఆర్, కెటిఆర్ కాచుకొని ఉన్నట్టు సోషల్ మీడియాలో బిఆర్ఎస్ వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు.

'నేటి బాలికే రేపటి నాయిక'

సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అవగాహన పెంచడానికి 'జాతీయ బాలిక దినోత్సవం' ప్రతిఏటా జనవరి 24న జరుపుకుంటారు. బాలిక శిశువు అసమానత్వం విద్య, పోషణ, వైద్య సంరక్షణ, చట్టపరమైన హక్కులు, రక్షణ, గౌరవం, బాల్య వివాహాల గురించి అవగాహన. సమాజంలో మహిళల హోదా పెంచడానికి, ప్రోత్సహించడానికి.. సాంఘిక వివక్ష,దోపిడి తొలగించడం, సమాజంలో మహిళల అవసరం, ప్రాథమిక స్వేచ్ఛ గురించి చెప్పడాన్ని చర్చిస్తాం. అలాగే బాలికా మనుగడ, భాగస్వామ్యం, అభివృద్ధి, ఆరోగ్యం, శ్రేయస్సు, గుర్తింపు, వ్యక్తీకరణ, వివక్ష రహితం, సురక్షితమైన వాతావరణం గురించి ఆలోచిస్తాం...

అంతేకాకుండా జీవించే హక్కు, బాలలను నిర్లక్ష్యం, దుర్వినియోగం నుండి రక్షించాలి. విద్యను ప్రాథమిక హక్కుగా భావించాలి. సమాజంలోని ప్రతి జాతి, లింగం, మతం, రంగు, భాష అభిప్రాయాలతో సంబంధం లేకుండా విద్యను అందించాలి. బాలల ఉత్తమ ప్రయోజనాలను ప్రాథమికంగా పరిగణించాలి అని నొక్కి వక్కాణిస్తాం.

ఇక బాలికలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా.. జువైనల్ జస్టిస్ యాక్ట్, బాల్య వివాహాల నిషేధ చట్టం, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం, బాల కార్మిక నిషేధ చట్టం లాంటివి భారతదేశంలో 250 కంటే ఎక్కువ చట్టాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించాయి. ఇండియన్ పీనల్ కోడ్ 1860, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973 ముఖ్యమని పలువురు వివరిస్తారు.

కానీ!..చట్టాలు ఎన్ని ఉన్నా, సంరక్షణ ఎంత ఉన్నా, ప్రాథమికంగా కుటుంబం, సమాజం బాధ్యత ఎంతగానో ఉంటుంది. కుటుంబంలో సమాజంలో అజ్ఞానం, అవగాహనా రాహిత్యం, చిన్నచూపు, వివక్ష ఉంటే అది బాల్యానికి, బాలిక అభ్యుదయానికి తీరని లోటు ఏర్పరుస్తుంది. ఆ లోటు రాకుండానే ప్రభుత్వం తన కర్తవ్య బాధ్యతలను గుర్తించి మసులుకోవాలి. ప్రచారం, ప్రసారం, అవగాహన సమీక్షలు, చర్చా వేదికలు, మేళాలు, ఉత్సవాలు, వేడుకలు తరచూ గ్రామ గ్రామాన సభలు నిర్వహించాలి.

అవిద్య, సనాతన ఆచారాలు, కుసంస్కార భావజాలం వల్ల గ్రామాల్లో ప్రాథమికంగా బాలికలకు అందాల్సిన ప్రోత్సాహం, రక్షణ, అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది.'బాలిక చదువు భవితకు వెలుగని',చదువుకున్న తల్లి 100 మంది గురువులతో సమానమని, బాలికల రక్షణే నవ సమాజానికి నాంది అని, అభ్యుదయ బాలికలే నేటి సభ్య సమాజానికి ఆవశ్యకమని, సభ్యత బ్రతకాలంటే.. సంస్కృతి విరజిల్లాలంటే... సంప్రదాయం ముందుకేగాలంటే...కుటుంబ వ్యవస్థ వర్ధిల్లాలి అంటే...మాన మర్యాదలు, సంబంధ బాంధవ్యాలు, మానవత్వ, సున్నితత్వాలు, సజీవంగా ఉండాలంటే... మనకు ఎంతగానో పేరు తెచ్చిన మన 'వసుదైక కుటుంబ భావన' బ్రతకాలంటే... బాలికను పుట్టనివ్వాలి, పెరగనివ్వాలి, రక్షణ నివ్వాలి, చదువనివ్వాలి, జ్ఞానవంతమైన బాధ్యతాయుతమైన సమాజంవైపు అడుగులెయ్యనియ్యాలి. తల్లిగా, చెల్లిగా, ఆలిగా, సహచరురాలుగా అమూల్యమైన సేవలు ఈ సమాజానికి అందివ్వనియ్యాలి. అందుకే తల్లిగా, తండ్రిగా, గురువుగా, తోబుట్టువుగా, స్నేహితుడిలా, సహచరునిగా... తోడ్పాటునూ అందించాలి.

ఇప్పటికీ పురిటి మరణాలు దేశవ్యాప్తంగా 100000, చట్టసభల్లో ప్రాతినిధ్యం 14.5%, సెకండరీ విద్య పూర్తిచేసిన వారు 39%, శ్రామిక బాలలలో 27.2% బాలికలే ఉన్నారు....! ఈ అంకెలు చట్టాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ సంఖ్యలు సమాజాన్ని వెక్కిరిస్తున్నాయి!!. ఎక్కడో లోపం ఉందని గుర్తు చేస్తున్నాయి. ఈ లోపాలు ఇలాగే కొనసాగితే.... ఓ ద్రౌపదీ ముర్ము, నిర్మలా సీతారామన్, స్మృతిమందాన, మిథాలీ రాజ్, సునీత విలియమ్స్, ప్రియాంక ఇంగ్లె లాంటివారు ఎలా పుట్టుకొస్తారు?? అందుకే తల్లితండ్రుల ఆలోచనల్లో గొప్ప మార్పు రావాలి. గృహ వాతావరణంలో బాలికకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉండాలి. పాఠశాలల్లో బాలికాసాధికార తకై క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. సమాజంలో మార్పుకై సానుకూల దృక్పథంకై చర్యలు తీసుకోవాలి. సమస్యల పట్ల తక్షణ చర్యలు ఉండాలి. క్రీడలతోపాటు అన్ని రంగాల్లో చక్కని రాణింపుకై ప్రణాళికలు ఏర్పాటు చేయాలి. ఉన్నత విద్య అయినా IIIT, IIT, మెడిసిన్ లలో 'జెండర్ రిజర్వేషన్' ఇవ్వాలి.

మొత్తంగా మహిళలు సమాజంలో సగం మంది. మిగిలిన సగం మందికి జన్మనిచ్చారు. కాబట్టి వారే మొత్తం సమాజంగా భావించే ఉదాత్తమైన గుణం మనలో రావాలి.... అన్న ఓ కవి మాటలను గుర్తుతెచ్చుకొని మెదలాలి. మంచి స్త్రీ తన వెనుక లేకుండా ఏ పురుషుడు విజయం సాధించడు. భార్య లేదా తల్లి అదే ఇద్దరు ఉంటే అతను నిజంగా రెండు సార్లు ధన్యుడు అవుతాడు.

స్త్రీలను గౌరవించడం ఒక డిమాండ్ కాదు. దానికి వారు అర్హులు. వారి ప్రేమ, ప్రేరణ, పాలన, లాలన, మన మేథో మరియు నైతిక శక్తుల రెట్టింపు కోసమే అవసరమనే విషయాన్ని లోతుగా ఆలోచించాలి. ఇందులో ఏమాత్రం ఆధిక్యత అనే ఆలోచనను దరికి రానీయరాదు.... అప్పుడే.. ఆ.. ఆదర్శ సంద ర్భాలే, అద్భుతమైన నవ సమాజానికి నాంది పలుకుతాయి.'నేటి బాలికే రేపటి నాయకై' అభ్యుదయ సమాజాన్ని నెలకొల్పుతుంది. ఆ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలే మనం మన బాలికలకు ఇచ్చే నిజమైన గౌరవాలు. అమూల్యమైన ఆభరణాలు. 'జాతీయ బాలిక దినోత్సవం' వర్ధిల్లాలి.

సుతారి మురళీధర్, టీచర్
ZPHS పత్తిపల్లి, మం., జి : ములుగు
గౌ. అధ్యక్షులు ప్రతిభా బాలల సంఘం, 9618939828

రిజర్వేషన్లతో రాజ్యాధికారం సాధ్యమేనా?

ఫిరోజ్ ఖాన్
9640466464

విద్యలో రిజర్వేషన్.. ఉద్యోగాల్లో రిజర్వేషన్.. సర్పంచ్ గా నిలబడాలన్నా రిజర్వేషన్.. కౌన్సిలర్‌గా పోటీ చేయాలన్నా రిజర్వేషన్.. మున్సిపల్ చైర్ పర్సన్.. జడ్పీ చైర్ పర్సన్ కావాలన్నా రిజర్వేషన్.. ఇలా అన్నింటా రిజర్వేషన్లు అమలు చేస్తున్న పాలకులు.. రాజ్యాధికారం విషయానికి వచ్చే సరికి మాత్రం మౌనం వహిస్తున్నారు. వివిధ వర్గాలు రాజ్యాధికారం సాధించే అవకాశాలున్న పదవులైన మంత్రి, సీఎం, ప్రధాన మంత్రి పదవుల విషయంలో మిన్నకుండి పోతున్నారు.

స్థానిక, మున్సిపల్ రిజర్వేషన్లపై చర్చ

ప్రస్తుతం తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలపై జోరుగా చర్చ నడుస్తున్నది. బీసీ రిజర్వేషన్లను ఫైనల్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటెడ్ కమిషన్ త్వరలో నివేదిక అందజేయనుంది. ఈ నేపథ్యంలో నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇప్పుడు చర్చ అంతా రిజర్వేషన్ల గురించే. ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారు? ఏ వర్గానికి అది రిజర్వు అవుతుంది? అనే అంశాలు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్నాయి. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే సంబరాలు.. లేకుంటే నిరాశ అనే పరిస్థితి ఉన్నది. రిజర్వేషన్ అనుకూలంగా లేకపోతే అప్పటి వరకు ఆ కాలనీలో ప్రజలకు సేవలందించిన కౌన్సిలర్ ఎన్నికల బరిలో నిలబడలేని పరిస్థితి వస్తుంది. మరికొందరికి అదృష్టం కలిసి వస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఇదే పరిస్థితి. పోటీ చేయాలనుకున్న వారు పోటీకి దూరమైపోతారు. అనుకోని అదృష్టం కలిసి వస్తే మరికొందరు సర్పంచులుగా గెలుపొందుతారు. మరికొందరు జడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్ చైర్ పర్సన్ పీఠాలను అధిరోహిస్తారు.

ర్యాండమైజేషన్ పద్ధతి..

స్థానిక సంస్థలు, మున్సిపాలిటీల్లో ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆయా వార్డులకు రిజర్వేషన్ కేటాయిస్తారు. సర్పంచ్ అయినా, కౌన్సిలర్ అయినా.. మున్సిపల్, జడ్పీ చైర్ పర్సన్లయినా.. రిజర్వేషన్ మారుతూ ఉంటుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రిజర్వేషన్ ర్యాండమైజేషన్ కాలపరిమితిని పదేండ్లుగా నిర్ణయించగా, ఏడాది క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఐదేండ్లకు కుదించింది. ర్యాండమైజేషన్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేస్తుండడం బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు లాభమే. ఒకటి, రెండు సార్లయినా పదవులను అధిరోహించే అవకాశం దక్కుతుంది. అయితే రిజర్వేషన్ జనరల్ అయితే పార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అవకాశమిచ్చిన దాఖలాలు తక్కువ. అగ్రవర్ణాల వారికే అవకాశమిస్తూ ఉంటాయి. ఇంకా తాము ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీల సంక్షేమానికి పనిచేస్తున్నామంటూ ఊదరగొడుతూ ఉంటాయి.

భారతదేశంలో ప్రతి ఎన్నిక పరోక్ష పద్ధతిలోనే ఉంటుంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలనేవి కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యక్ష పద్ధతిలో జరుగుతుండగా.. మరికొన్ని రాష్

నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తా

ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ హామీ

న్యూఢిల్లీ : దేశరాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో.. రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈక్రమంలోనే తాజాగా ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నిరుద్యోగులను ఉద్దేశిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఆయన గురువారం ఓ వీడియోను విడుదల చేశారు. యువతకు ఉపాధి కల్పించడమే నా ప్రాధాన్యత. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు మా బృందం ఓ ప్రణాళికను రూపొందిస్తోంది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం రెండేళ్లలో 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. అంతే కాక.. మూడు లక్షలకు పైగా ప్రైవేటు రంగ ఉద్యోగాలను కల్పించాం. ఉపాధి ఎలా సృష్టించాలో మాకు బాగా తెలుసు. ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తా అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. కాగా.. దేశ రాజధానిలో ఫిబ్రవరి 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రయత్నిస్తుండగా.. ఈ సారి ఎలాగైన ఆప్‌ను గద్దెదించేందుకు కాంగ్రెస్, బిజెపి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఢిల్లీ ప్రభుత్వ ఏర్పాటులో 'జంప్‌జిలానీలే' కీలకం

తాజాగా పార్టీలు మారిన 20మంది అభ్యర్థులు ఆప్, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖపోటీ

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా మారాయి. ఢిల్లీలో ఎన్నికలు ఒక పార్టీ నుండి మరొక పార్టీలో చేరి ఎన్నికలబరిలో నిలిచిన వారి పాత్రే (జంప్‌జిలానీలు) ప్రస్తుతం కీలకం కానుంది. అసెంబ్లీ ఎన్నికలలో ప్రధానంగా ఎన్నిల బరిలో ఉన్నటువంటి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), బిజెపి, కాంగ్రెస్ పార్టీలు శత్రువులుగా ఉండి మిత్రులుగా మారిన జంప్‌జిలానీలు దాదాపు 20మందిని ఎన్నికల బరిలో నిలిపాయి. కారణంగా ప్రభుత్వ ఏర్పాటులో జంప్‌జిలానీల ప్రాధాన్యతనే పరిగణనలోనికి తీసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. ఏదిమైనప్పటికీ ఈ తాజా పరిణామం తమను తాముగా నిరూపించుకోవాలనే వారి ప్రయత్నం సాఫీగా సాగదనే స్పష్టతను ఇస్తోంది. పార్టీ మారడం అనేది వారికి అనేక సవాళ్లను విసురుతోంది. దానితో సపాటు వారు దత్తత తీసుకున్న కార్యకర్తలు, నాయకులలో అసంతృప్తి నెలకొనడానికి కూడా ప్రధానకారణమైంది. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఆప్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు తమ రాజకీయ జీవితాన్ని దారి మళ్లించాలని, పునరుజ్జీవనం చేసుకోవాలని ఆకాంక్షిస్తూ పార్టీలు మారారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం టికెట్లు పొందడంపై అనిశ్చితి నెలకొనడంతో దాదాపు ఆరుగురు బిజెపి ఎన్నికల టికెట్ ఆశావహులు ఆప్‌లోకి మారారు. ఇది వెంటనే వివిధ నియోజకవర్గాల నుంచి వారిని రంగంలోకి దింపారు. వారు 2020లో బిజెపి అభ్యర్థులుగా ఎన్నికలలో పోటీచేశారు. అలాంటి వారిలో ఒకరు ప్రశాంత్‌రతన్ ఉన్నారు. ఆప్ ఆయనను పటేల్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం (ఎస్‌సి) స్థానం నుంచి బిజెపి అభ్యర్థి రాజ్‌కుమార్ ఆనంద్‌పై పోటీచేయించింది. 2020లో కూడా వారు ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆనంద్ ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి, ప్రవేశ్ రతన్ బిజెపి నుంచి ఎన్నికల్లో పోటీచేయడం జరిగింది. జితేందర్‌సింగ్ షుంటి, సురీందర్‌పాల్ బిట్టు ఆప్‌లో టికెట్లు పొంది షాదరా, తిమర్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్టు పొందారు. కిరారీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ తరపున టికెట్ నిరాకరించబడిన ఔట్ గోయింగ్ పార్టీ ఎమ్మెల్యే రితురాజ్ స్థానంలో ఆమ్‌ఆద్మీ పార్టీ అనిల్ ఝూకు పార్టీ టికెట్ కేటాయించి ఎన్నికలలో పోటీచేయించింది.2020 ఎన్నికలలో రితురాజ్ అనిల్‌ను స్వల్ప ఓట్ల తేడాతో ఓడించారు.అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇటీవల కొద్దినెలల క్రితం పార్టీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎన్నికల బరిలోకి దించింది. పార్టీలో చేరిన కొద్ది రోజులకే ఆమ్ ఆద్మీ పార్టీ వీర్‌సింగ్ ధిన్‌గన్‌ను సీమపురి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, మాటియాలా నుంచి సుమేష్ షోకిన్‌ను, సీలమ్‌పూర్ నుంచి జుబేర్ అహ్మద్‌కు పార్టీ టికెట్లు కేటాయించి పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయిస్తోంది. బిజెపి కూడా మాజీ ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షులు అరవిందర్‌సింగ్ లవ్లీ సహా ఆప్ ప్రభుత్వంలో మాజీ రవాణ శాఖ మంత్రిగా ఉన్నటువంటి కైలాష్ గెహ్లోట్‌ను పార్టీలోకి చేర్చుకుంది. అరవిందర్‌సింగ్ లవ్లీని గాంధీనగర్ స్థానం నుంచి బిజెపి టికెట్‌పై పోటీచేయిస్తోంది. కాగా బిజ్వాసన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గహ్లోట్‌ను పార్టీ అభ్యర్థిగా బరిలోకి దించింది. అంతేకాకుండా మాజీ కాంగ్రెస్ పార్టీ నాయకులైన రాజ్‌కుమార్ చౌహాన్‌ను మంగోల్‌పురి నుంచి, మాజీ ఎమ్మెల్యేలు నీరజ్ బసోయాను కసూర్బానగర్ స్థానం నుంచి, జంగ్‌పురా నుంచి ఫర్వీందర్ మార్‌వావ్ సహా మాజీ నాయకులకు బిజెపి తరపున పోటీలో నిలిపింది. ఆప్ ఔట్‌గోయింగ్ ఆప్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న వెంటనే ధరమ్‌పాల్ లక్రాను (ముండ్కా అసెంబ్లీ నియోజకవర్గం), అబ్దుల్ రెహమాన్ ను(సీలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గం) నుంచి పార్టీ అభ్యర్థులుగా ఆ స్థానాల నుంచి పోటీచేసేలా కాంగ్రెస్ పార్టీ మేనేజ్ చేసింది. ఇదిలాఉంటే ఈనెల మొదట్లో కాంగ్రెస్ పార్టీలో చేరిన లక్రా ముండ్కా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి పోటీచేయాలని కోరుకోవడంలేదు. లక్రాతో పాటు కాంగ్రెస్ పార్టీలోచేరిన ఆప్‌కౌన్సిలర్ రాజేష్ గుప్తా ప్రస్తుతం కిరారీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. 70అసెంబ్లీ స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీపార్టీ, బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

ఢిల్లీకి కావాల్సింది షీలాదీక్షిత్.. 'నిజమైన అభివృద్ధి నమునా'

మోదీ, కేజ్రీవాల్ తప్పుడు ప్రచారం : రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీనగరానికి ఇప్పుడు కావాల్సింది మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ 'నిజమైన అభివృద్ధి నమూనా' అని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తప్పుడు ప్రచారం, పిఆర్ నమూనా కాదన్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కాలుష్యం, అవినీతి వంటి సమస్యలను ఎత్తిచూపుతూ రాహుల్‌గాంధీ ఫేస్‌బుక్‌లో ఓ వీడియోను షేర్ చేశారు. 'అస్తవ్యస్త నిర్మాణం, మురికికూపం, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కాలుష్యం, అవినీతి'తో కూడిన నిజమైన ఢిల్లీ ప్రస్తుతం ప్రజల ముందు ఉందని రాహుల్‌గాంధీ ఫేస్‌బుక్‌లో హిందీలో పోస్టు చేశారు. ఇప్పుడు ఢిల్లీ కావాల్సింది షీలా దీక్షిత్‌జీ 'నిజమైన అభివృద్ధి నము నా' వంటిది కావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, కేజ్రీవాల్ తప్పుడు ప్రచారాలు, పి ఆర్ నమూనా కాదని విమర్శించారు. రాహుల్‌గాంధీకి కొంత అస్వస్థతకు గురికావడం వల్ల బుధవారం ఢిల్లీలోని సదర్ బజార్ నియోజకవర్గంలో నిర్వహించిన బహిరంగసభలో ప్రసంగించలేకపోయారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని ఓ వీడియో సందేశం ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా రాహుల్ ఆరోగ్యపరిస్థితి సరిగా లేకపోవడం వల్ల బెలగావ్‌లో మంగళవారం నిర్వహించిన జైమ్ బాపు, జైభీమ్, జై సంవిధాన్ ర్యాలీల్లో కూడా పాల్గొనాల్సి ఉన్నప్పటికీ అక్కడికి కూడా వెళ్లలేదు. అంతకు ముందు న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయ కార్యక్రమంలో కూడా పాల్గొనలేకపోయారు. అయితే ఈనెల ఆరంభంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై రాహుల్‌గాంధీ విమర్శల పర్వం ప్రారంభించారు. ఈ ఇద్దరికి ఎలాంటి తేడాలేదన్నారు. వీరికి వెనుకబడిన తరగతులవారు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు అవసరం లేదని ఆరోపించారు. అయితే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన మొదటి బహిరంగసభలో కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. మోదీ తప్పుడు వ్యూహాన్ని కేజ్రీవాల్ అవలంభిస్తున్నారన్నారు. దేశ రాజధానిలో ద్రవ్యోల్బణం, అవినీతి, కాలుష్యం పెరుగుతున్నప్పటికీ తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. ఢిల్లీలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కుల సర్వే నిర్వహిస్తామని హామీనిచ్చారు. షీలా దీక్షిత్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులను రాహుల్ ప్రశంసించారు. కాంగ్రెస్ రికార్డును కేజ్రీవాల్‌గానీ, బిజెపిగానీ చేరుకోలేదన్నారు.

తప్పుడు కథనాల పట్ల జాగ్రత్త

ఎన్నికల నిర్వహణ సంస్థలు ఆందోళన

న్యూఢిల్లీ : తప్పుడు కథనాల పట్ల జాగ్రత్త వహించాలని గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ హెచ్చరించారు. అవి ఎన్నికల ప్రక్రియలో విశ్వాసాన్ని కోల్పోతున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ ఢిల్లీలో నిర్వహించిన ఎన్నికల నిర్వహణ సంస్థల అంతర్జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉజ్బెకిస్తాన్, శ్రీలంక, మారిషస్, ఇండోనేషియా, కజకిస్తాన్ దేశాలకు చెందిన ఎన్నికల కమిషన్‌లు 2024లో నిర్వహించిన ఎన్నికల అనుభవంపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, తప్పుడు కథనాలపై ఆందోళనలను వ్యక్తం చేశాయి. మారిషస్ ఇసిసి అబ్దుల్ రెహమాన్ కూడా తప్పుడు వార్తల ముప్పును ఉద్ఘాటించారు. ఇది ఎన్నికల సంస్థలపై ఓటర్ల నమ్మకాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల సిబ్బంది నియామకం కోసం నకిలీ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రత్యేక కేసును ప్రస్తావిస్తూ ఎన్నికల సమయంలో తప్పుడు సమాచారం ముప్పును తీవ్రతరం చేయడంలో సాంకేతికత, సోషల్ మీడియాను ఉపయోగించడంపై రెహమాన్ ఆందోళన వ్యక్తం చేశారు. నమీబియా ఎన్నికల కమిషన్ ప్రతినిధి కూడా నకిలీ వార్తలు పెరుగుతున్న ధోరణిపై ఆందోళన వ్యక్తం చేస్తూ, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను ఎదుర్కోవడంపై సూచనలను కోరారు. ఇండోనేషియా జనరల్ ఎలక్షన్ కమిషన్ కమిషనర్ ఇధాన్ హోలిక్ మాట్లాడుతూ వాస్తవ సమయంలో తప్పుడు సమాచారాన్ని పరిష్కరించడానికి ప్రత్యేకమైన వాట్సాప్ ఛానెల్‌ను ఉపయోగించడంలో వారి అనుభవం గురించి వివరించారు. ఇక భారత ఇసిసి రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల భవిష్యత్తును రూపొందించే కీలక ధోరణులను వివరించారు, వాటిలో ఎఐ ఆధారిత ప్రక్రియలు, ఆన్‌లైన్, రిమోట్ ఓటింగ్, బయోమెట్రిక్ ప్రామాణీకరణ, పెరిగిన ప్రపంచ సహకారం ఉందన్నారు. ఎన్నికలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు సాంకేతిక పురోగతితో అవకాశాలను అన్వేషించాలని ఆయన పోల్ నిర్వహణ సంస్థలను కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియలను రక్షించడంలో మాత్రమే కాకుండా, వాటి పరిధి, ప్రభావాన్ని విస్తరించడంలో కూడా ఎన్నికల నిర్వహణ సంస్థల పాత్ర ఉందన్నారు.

కుంభమేళాలో పదికోట్లకుపైగా పుణ్యస్నానాలు

మహాకుంభ్‌నగర్ : ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహాకుంభమేళా తో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ కళకళలాడుతోంది. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పుణ్యస్నానాలపై ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపింది. ఇప్పటివరకు త్రివేణి సంగమంలో 10 కోట్లకు పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని వెల్లడించింది. గురువారం మధ్యాహ్నం వరకు 30 లక్షల మంది పుణ్యస్నానాలు చేసినట్లు తెలిపింది. మకర సంక్రాంతి రోజు దాదాపు 3.5 కోట్ల మంది సంగమంలో స్నానాలు ఆచరించారు. 1.7 కోట్ల మంది పౌష్ పూర్ణిమ వేడుకలో పాల్గొన్నారు. దీంతో పండుగల వేళలో స్నానాల ప్రదేశంలో భక్తుల సంఖ్యపై పరిమితులు విధించింది. మిగిలిన రోజుల్లో ఎలాంటి ఆంక్షలు అమలులో ఉండవు. అయితే.. ఈ సారి కుంభమేళాకు 45 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటివరకు 10 కోట్ల మందికి పైగా భక్తులు వచ్చినట్లు తెలుస్తోంది. జనవరి 13న మొదలైన కుంభమేళా ఫిబ్రవరి 26 వరకు మొత్తంగా 45 రోజుల పాటు జరగనుంది. విదేశాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ కార్యక్రమం 12 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు సృష్టించింది. తాత్కాలిక వైద్య శిబిరాలతో 1.5 లక్షల మంది నర్సులు, పారామెడిక్స్, ఇతర వైద్య సిబ్బందికి అవకాశాలు లభించాయి.

'బిఎస్ఎఫ్-బిజిబి' భేటీ

మాల్దా : భారత్‌బంగ్లాదేశ్ ఇటీవలి సరిహద్దు ఫెన్సింగ్ సమస్యల నేపథ్యంలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్), బార్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బిజిబి) మధ్య జరిగిన సమన్వయ సమావేశం అత్యంత ప్రాధాన్యత చోటుచేసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణ, సరిహద్దు అక్రమ కార్యకలాపాలను అరికట్టే లక్ష్యంతో ఇరుదేశాల మధ్య ఈ సమన్వయ సమావేశం నిర్వహించబడింది. బుధవారం నాడు బంగ్లాదేశ్‌లోని సోనామజీద్ బార్డర్ ఔట్‌పోస్ట్ (బిఒపి) వద్ద నిర్వహించిన ఈ సమన్వయ సమావేశం బిఎస్ఎఫ్ మాల్దా సెక్టార్ డిఐజి తరుణ్ కుమార్ గౌతమ్, బిజిబి రాజ్‌షాహీ సెక్టార్ కమాండర్ కల్నల్ మొహమ్మద్ ఇమ్రాన్ ఇబ్నే రౌఫల అధ్యక్షతన జరిగింది. ఈ విషయాన్ని గురువారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో పార్లమెంటరీ ఫోర్స్ తెలియజేసింది. అంతర్జాతీయ సరిహద్దులో అనధికారిక కదలికలను నిరోధించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడం, ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడం అంశాలపై చర్చలు జరిగాయని ఆ ప్రకటన వెల్లడించింది. సరిహద్దు సంబంధ సమస్యలను చర్చలు, ఏకాభిప్రాయంతో పరిష్కరించుకోవాలని ఇరుపక్షాల తరపున తమ సమ్మతిని తెలియజేశాయి. జనవరి 18న మాల్దా జిల్లాలోని సుఖ్‌దేవ్‌పూర్ సరిహద్దు వద్ద ఇటీవల జరిగిన సంఘటనపై కూడా సమావేశం లోతుగా చర్చించింది. ఇరుదేశాల రైతుల మధ్య సుఖ్‌దేవ్‌పూర్ సరిహద్దు ఔట్‌పోస్ట్ వద్ద జరిగిన వాగ్వివాదం ఉద్రిక్తతలకు దారితీసింది. అయితే బిఎస్ఎఫ్, బిజిబి దళాలు జోక్యం చేసుకుని పరిస్థితి తీవ్రరూపం దాల్చకుండా నియంత్రించగలిగాయి. బిఎఎఫ్ దక్షిణ బెంగాల్ సరిహద్దు అధికార ప్రతినిధి ఎన్‌కె.పాండే మాట్లాడుతూ ఈ అత్యున్నత స్థాయి సమావేశాలు భారత్‌బంగ్లాదేశ్ మధ్య పటిష్ట భాగస్వామ్యానికి ప్రతీకగా జరిగాయని తెలియజేశారు.

వయనాడ్ పునరావాసం కోసం అందని కేంద్ర సహాయం

కేరళ అసెంబ్లీ సమావేశాలలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసంతృప్తి

తిరువనంతపురం : వయనాడ్‌లో పునరావాసం కోసం కేరళ ప్రభుత్వానికి ఇస్తామన్న నిధులు కేటాయించే విషయంలో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తోంది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేరళ అసెంబ్లీలో గురువారం కేంద్రంపై అసంతృప్తిని వ్యక్తంచేశారు. వయనాడ్‌లో కొండచరియల విధ్వంసం బారినపడి ప్రాణాలతో బయటపడ్డ వారికి పునరావాసం కల్పించేందుకు కేంద్రం ఇప్పటి వరకూ ఎలాంటి సహాయం అందించలేదని నిర్వేదం వ్యక్తం చేశారు. కేరళ శాసనసభ సమావేశాలలో యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) ఎమ్మెల్యే కురుక్కొలి మొయిదీన్ కొశ్చన్ అవర్‌లో లేవనెత్తిన ఒక ప్రశ్నకు ముఖ్యమంత్రి పినరయి విజయన్ సమాధానస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటివరకు చీఫ్ మినిసర్ డిశాస్టర్ రిలీఫ్ ఫండ్(సిఎండిఆర్ఎఫ్)కు అందిన రూ.712.98 కోట్ల మొత్తాన్ని క్షతగాత్రుల సహాయానికి వెచ్చిస్తామని తెలియజేశారు. అయితే కొండచరియల విధ్వంసంలో బాధితులకు పునరావాసం కల్పించేందుకు ప్రారంభంలో కేంద్రం నుంచి కేరళ ప్రభుత్వం రూ.2,221 కోట్ల మొత్తాన్ని డిమాండ్ చేశామని వెల్లడించారు. పోస్ట్ డిశాస్టర్ నీడ్స్ అసెస్‌మెంట్ (పిడిఎన్ఎ) నివేదిక ప్రకారం అధిక మొత్తాన్ని డిమాండ్ చేయవచ్చని తెలియజేశారు. అయితే తాము కోరిన మొత్తంలో సహాయాన్ని అందించడానికి కూడా కేంద్రం స్పందించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రకృతి విపత్తు కింద ప్రకటించిందని, దేశంలోని ప్రతీ పార్లమెంట్ సభ్యుడూ దేశం కోసం తనవంతు సహాయం అందించాలని ఇప్పటికే రాసిన లేఖలలో అభ్యర్థించామని, ప్రతీ ఒక్క ఎంపి రూ.ఒక కోటి మొత్తం మేరకు సహాయం అందజేసే వెసులుబాటు ఉందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ శాసనసభకు చెప్పారు. సిఎండిఆర్ఎఫ్‌కు అందినటువంటి నిధుల మొత్తాన్ని కొండచరియల విధ్వంసంలో నష్టపోయిన క్షతగాత్రుల ప్రయోజనానికి వినియోగించామని, ఈ పునరావస ప్రక్రియ త్వరలోనే పూర్తి అవుతుందని సిఎం హామీ ఇచ్చారు.ప్రతిపాదిత టౌన్‌షిప్‌ల వెలుపల ఉండాలనుకునే వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ.15లక్షలు ఇస్తామని విజయన్ తెలిపారు.కొండచరియలు విరిగిపడి ఆరునెలల కాలం గడిచినప్పటికీ తీవ్రంగా గాయపడ్డ వారికి నేటివరకూ వైద్య చికిత్స ఖర్చులకు సహాయం అందకపోవడం బాధాకరమని ప్రతిపక్ష యుడిఎఫ్ మరో సమస్యను శాసన సభలో లేవనెత్తింది. తక్షణమే సహాయం చేసే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి విజయన్‌ను కోరింది. ప్రతిపక్షనాయకుడు విడి. సతీషన్ మాట్లాడుతూ ప్రతిపాదిత ఇళ్ల కోసం నిర్ణయించిన రూ.30లక్షల మొత్తాన్ని అందజేయడంలో అనిశ్చితి నెలకొన్నదని, పునరావాస మొత్తాన్ని ఖరారు చేసేందుకు కొంత మొత్తాన్ని నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలన్నింటికీ ముఖ్యమంత్రి విజయన్ సమాధానాలిచ్చారు.పునరావాసం కోసం భూమిని 61రోజులలోపు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించిందని సభకు తెలియజేశారు. 2024సంవత్సరం జులై 30న కొండచరియలు విరిగిపడి చోటుచేసుకున్న వయనాడ్ జిల్లా మెప్పాడి పంచాయతీ పరిధి కల్‌పెటాలోని ఎల్‌స్టోన్ ఎస్టేట్‌లో 58.50 హెక్టార్లు, అదే పంచాయతీ పరిధిలోని నెడుంపల ఎస్టేట్‌లో 48.96హెక్టార్లలో మోడల్ టైన్‌షిప్‌లను నిర్మించాలని కేబినెట్ నిర్ణయించిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలియజేశారు.

మావోయిస్టులు అమర్చిన మందుపాతర నిర్వీర్యం..

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లాలోని అడవులను పోలీసు బలగాలు జల్లెడ పడుతున్న సంగతి తెలిసిందే. మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా.. పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. వేలాది మంది పోలీసులు బీజాపూర్ జిల్లాలోని అడవులను తమ ఆధీనంలోకి తీసుకుని, మావోయిస్టుల కదలికలను పసిగడుతూ.. బుల్లెట్ల వర్షం కురిపిస్తున్నారు. తాజాగా బీజాపూర్ జిల్లా అవపల్లి – బాసగూడ రోడ్డుపై మావోయిస్టులు మందుపాతరను అమర్చారు. హైవేపై ఓ సొరంగం తవ్వి.. పోలీసుల వాహనాలే లక్ష్యంగా ముందుపాతరను మావోయిస్టులు పాతిపెట్టారు. మందుపాతరను గుర్తించిన సీఆర్పీఎఫ్ సిబ్బంది, అత్యంత జాగ్రత్తగా దాన్ని నిర్వీర్యం చేశారు. ఇక సుక్మా జిల్లాలో కూడా మరో డంప్‌ను భద్రతా బలగాలు కనుగొన్నాయి. జిల్లాలోని దుల్లేడ్, మెట్టుగూడ అటవీ ప్రాంతంలో 203 కోబ్రా బెటాలియన్, సిఆర్‌పిఎఫ్ 131 బెటాలియన్ సిబ్బంది కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మెట్టుగూడ గ్రామం నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఒక గుహను కనుపెట్టారు. అందులో పరిశీలించగా 21 ఐఇడిలు, మల్టీ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్), ఒక జనరేటర్ సెట్, లాత్ మెషిన్ పరికరాలు, భారీ మొత్తంలో పేలుడు తయారీ పదార్థాలు, తుపాకీ తయారీ పరికరాలు, వైద్య సామాగ్రి ఉన్నాయి. భద్రతా బలగాలు భారీ ఆయుధ డంప్‌ను స్వాధీనం చేసుకోవడంతో మావోయిస్టులకు పెద్ద ఎదురుదెబ్బ తగినట్లయింది.

నేతాజీకి ఇచ్చిన టీ కప్పు సాసర్ 93 ఏళ్ళుగా పోలీస్ స్టేషన్‌లోనే!

జగద్దాల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ తాగడానికి టీ పోసి ఇచ్చిన పింగాణీ కప్పు, సాసరు 93 సంవత్సరాల తర్వాత కూడా ఇంకా చాలా భద్రంగా పశ్చిమ బెంగాల్ నోపారా పోలీస్ స్టేషన్‌లో దాచి ఉంచారు. ఆనాడు ఒక బ్రిటిష్ అధికారి నేతాజీకి ఇదే కప్పులో టీ పోసి అందించారు. కానీ నేతాజీ మాత్రం ఆ టీ తాగేందుకు తిరస్కరించారు. ఎందుకంటే ఆ టీ కప్పును తీసుకు వచ్చి ఆయన చేతికి ఇచ్చేందుకు ప్రయత్నించింది ఒక బ్రిటిష్ అధికారి కాబట్టి. ప్రతి సంవత్సరం పోలీసులు జనవరి 23వ తేదీన నేతాజీ జయంతి రోజున ఆ పోలీస్ స్టేషన్‌లో గుమిగూడటమేకాదు, ఆయన అక్కడ గడచిన ఆ సమయాన్ని అత్యంత విలువైనదిగా, అరుదైనదిగా భావించి ఒక స్మారకదినోత్సవంగా జరుపుతారు. జగద్దాల్‌లోని గోల్‌ఘర్ వద్ద బెంగాల్ జూట్ మిల్లు కార్మికుల సంస్థ నిర్వహించిన సమావేశంలో సుభాష్ చంద్రబోస్ ప్రసంగించేందుకు వెళుతుండగా మార్గమధ్యలో బ్రిటిష్ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఆయన ఆ సమావేశంలో ప్రసంగిస్తే, ప్రజలు ఎంతో ఉత్తేజితులు అవుతారని, దానివల్ల తదుపరి ఆందోళనలు, కల్లోలం ఏర్పడి అనేక సమస్యలు బ్రిటీష్ ప్రభుత్వానికి వస్తాయని పోలీసులు భావించి ముందుగానే అరెస్టు చేశారు. అంటే ఇప్పటికి 93 సంవత్సరాలక్రితం 1931లో అక్టోబరు 11వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేసి నోపారా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఐతే మూడు నెలలపాటు నోపారాలో అదుగుపెట్టకూడదని నేతాజీపై ఆంక్షలు విధించి విడుదల చేశారు. కొద్ది గంటలపాటు అదే పోలీస్ స్టేషన్‌లోని సెల్‌లో నిర్బంధించారు. ఆ సందర్భంగా నేతాజీకి బ్రిటిష్ అధికారి తాగడానికి ఇదే పింగాణీ కప్పులో టీ పోసి ఒక సాసరు కూడా పెట్టి ఆయన అందజేశారు. కానీ నేతాజీ ఎంతో మర్యాదగా ఆ టీ ని తిరస్కరించారు. నోపారా పోలీస్ స్టేషన్ ఆనాటి బర్రక్‌పూర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోకి వస్తుందని నేతాజీపై పరిశోధనలు చేసిన జయంత్ చౌధురి చెప్పారు. యన అరెస్టు విషయంలో ఆనాటి బర్రక్‌పూర్ జిల్లా మెజిస్ట్రేట్ జో

జాబ్ కార్డు ఉండి 20 రోజులు పనిదినాల నిబంధన ఎత్తివేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య

ప్రజాపక్షం/ పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండలం గన్ పెల్లి గ్రామంలో ప్రజా పాలన గ్రామసభలో పాల్గొని గ్రామంలోని నిరుపేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పారదర్శకంగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు ఉపాధి జాబ్ కార్డు ఉండి 20 రోజులు పని దినాలు ఉండాలని నిబంధన ఎత్తివేయాలని ఆయన అధికారులకు సూచించారు. గ్రామసభల్లో రేషన్ కార్డులో లబ్ధిదారుల లిస్టు చదివి వినిపించారని రేషన్ కార్డులు రాని వాళ్ళు గ్రామాలలో పరులైన పేదలు చాలామంది ఉన్నారని కానీ కేవలం ఐదు పదిమందికి ఇచ్చి చేతులు దులుపుకుంటూ రారని పరులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు వెంటనే మంజూరు చేయాలని తన అధికారులను కోరారు. గ్రామసభలు ఇందిరమెండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం ప్రచారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తుందని రానివారు ఇంకా దరఖాస్తులు పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు. ఇక ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టుకోవాలని దరఖాస్తులకే కాలం గడిచిపోతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. డి ఆర్‌డిఏ పిడి శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామ సభలో చూసినలన్నీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని అరులైన పేదలను ఎంపిక చేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు.

టిజియుఎస్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/సూర్యాపేట: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టిజియుఎస్) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 డైరీ, క్యాలెండర్‌ను గురువారం హైద్రాబాద్‌లోని ప్రగతి భవన్‌లో రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ప్రయోజకులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె గోవింద్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి మోతిలాల్ నాయక్, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర భగ్గులాల్ నాయక్, శంకర్ నాయక్, రాజు, కృష్ణకాంత్, రమేష్ రాథోడ్, శ్రీనివాస్, లక్ష్మణ్, శంకర్, రఘు నాయక్ పాల్గొన్నారు.

పాలకుల విధానాలు చూసి ప్రజలు విసిగిపోయారు : తమ్మినేని

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పాలకుల విధానాలను చూసి ప్రజలు విసిగిపోయారని రాబోయే కాలమంతా ఎర్రజెండాదేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం పట్టణంలోని రామచంద్రగూడెంలోని గాదె శ్రీనివాస్‌రెడ్డి స్థూపం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల కోసం నిరంతరం పనిచేసేది ఎర్రజెండా మాత్రమేనన్నారు. అమెరికాలో ట్రంప్ గెలిస్తే దేశానికి లాభం ఉంటుందని కొందరు భావించారని కాని ట్రంప్ ఆంక్షల వల్ల దేశానికి నష్టమన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మెజారిటీ తగ్గిన తన స్వభావాన్ని మార్చుకోలేదని అన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య, కందాల ప్రమీల, పాలడుగు ప్రభావతి, పాలడుగు నాగార్జున, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు 'గణతంత్ర' ఆటల పోటీలు

ప్రజాపక్షం/ఉండవెల్లి: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ వేడుకల లో భాగంగా విద్యార్థులకు ఆటల పోటీలు సంస్కృతి ఈ కార్యక్రమాలు తదితర వంటి పోటీలు ఆయా పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో వారం రోజుల నుంచి కార్యక్రమాల్ని వేస్తున్నారు. విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు స్థానిక దాతల సహకారంతో బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు ఆయా పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

నేతాజీ జయంతి వేడుకలు

ప్రజాపక్షం/ ఎర్రవల్లి : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకల్లో మాజీ ఐపీఎస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుచ భగీరథ వైస్ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ గుప్త, అలంపూర్ బిఆర్ఎస్ యువజన నాయకులు ఆర్.కిషోర్, అలంపూర్ జోగులాంబ ఆలయ మాజీ చైర్మన్ రవి ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. అలంపూర్ పట్టణంలోని స్వాతంత్ర ఉద్యమ వీరుడు సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాల నిఒవాళులర్పించడం జరిగింది. అనంతరం ఇల్లూరి వెంకట్రామయ్య శెట్టి నిర్వహించిన కవి సమ్మేళనంలో సందర్భంలో పాల్గొనడం జరిగింది. బిఆర్ఎస్ నాయకులు కవులు రచయితలు కళకారులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే కాంగ్రెస్ పాలన

మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/కోదాడ: రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకునుగుణంగానే కాంగ్రెస్ పాలన సాగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం కోదాడలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన నూతనపాలకవర్గ కమిటి ప్రమాణస్వీకారోత్సంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలలో నేరుగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అంశంలో అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందని వారు అన్నారు. ఈ అంశంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, వారు పాలించే కాలంలో ఈ పథకాలను ఎందుకు అమలు పర్చడం లేదని విమర్శించారు. వ్యవసాయ యోగమున్న ప్రతి ఎకరాకు 12వేలను అందజేస్తామని, ఎన్నికల సమయానికి ఆర్థిక పరిస్థితి బాగుంటే 15వేలు ఇచ్చేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాలేరు నుండి గోదావరి జలాలను కోదాడకు రప్పించే ఆయకట్టు చివరి ప్రాంతంలోని రైతులను ఆదుకుంటామని అన్నారు. తాము తప్పు చేస్తే నిలదీయండని, ఒక వేళ సంక్షేమ పథకాలను అమలు చేయకపోతే తలవంచుకుంటామే తప్ప మాయమాటలు చెప్పబొమన్నారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రప్రభత్వం అగ్రభాగన ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందజేస్తామన్నారు. అన్నివర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించేందుకు పెట్టుబడులను రప్పిస్తున్నారని కొనియాడారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధే తమ లక్ష్యమని, మా జీవితాలను వారికే అంకింతం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో వేలాది కొట్ల రూపాయలతో అభివృద్ధి బాట పట్టించాలని నీటి వనరులు ఉన్నచోట ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, త్వరలో 100పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. తొలుత వ్యవసాయ మార్కెట్ మిటి చైర్‌పర్సన్ ఏపూరి తిరపతమ్మ సుధీర్, వైస్ ప్రెసిడెంట్ షేక్ బషీర్‌తో పాటు పాలక వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవంలో కోదాడ ఎంఎల్ఎ పద్మావతిరెడ్డి, మాజీ ఎంఎల్ఎ వేనేపల్లి చందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్నేని వెంకటరత్నం, వంగవీటి రామారావు, చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, చింతల పాటి శ్రీనివాసరావు, ప్రమీల, జబ్బార్ పాల్గొన్నారు.

'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/చింతలపాలెం: ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజాపక్షం నిరంతరం పని చేస్తుందని మండల వ్యవసాయాధికారి సంధ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజాపక్షం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజలకు అందదందగా ఉంటూ అధికారులను ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజాపక్షం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామచందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు, ప్రజాపక్షం రిపోర్టర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అందుబాటులో పథకాలు

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్

ప్రజాపక్షం/చిట్యాల: రాష్ట్రంలోని అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆమె జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పాల్గొని మాట్లాడారు. అధికారుల దగ్గర ఉన్న లబ్ధిదారుల జాబితా తుది జాబితా కాదని, జాబితాలో లేని అర్హులైన ప్రతి ఒక్కరు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాల కోసం నిర్వహిస్తున్న సభలలోనే కాకుండా, గ్రామ పంచాయతీలలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ప్రభుత్వ పథకాలు అందుతాయని సూచించారు. ఎవరు కూడా ఆందోళన చెందకుండా గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని, మీ సమస్యలను గ్రామ సభ అధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ గ్రామ సభలలో అధికారులు తెలియజేసే లబ్ధిదారుల జాబితాలో తమ పేరు లేని పక్షంలో దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. తహసిల్దార్ కృష్ణనాయక్, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలన

చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సందర్శించారు. కేంద్రం లో పిల్లలను ఆడించే ఆట వస్తువులను పరిశీలించి వాటితో పిల్లలను ఆడించారు. ఆహార పంపిణీ విధానాన్ని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌హెచ్‌టిఎస్ యాప్‌ను తనిఖీ చేశారు. కేంద్రాన్ని చూసి వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్రంలో బాత్‌రూం సదుపాయం లేని విషయాన్ని అంగన్‌వాడీ టీచర్లు వారి దృష్టికి తీసుకురాగా స్వచ్ఛ్ భారత్ పథకం ద్వారా నిర్మింపజేయాలని అనితారామచంద్రన్ అధికారులను ఆదేశించారు. తహసిల్దార్ కృష్ణానాయక్, అంగన్‌వాడీ టీచర్ అపర్ణ పాల్గొన్నారు.

ఛాయా సోమేశ్వర ఆలయం అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళిక

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని పానగల్లో గల సోమేశ్వరాలయ అభివృద్ధి కోసం భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేయడానికి తెలంగాణ రాష్ట్ర పురావస్తు శాఖ డైరెక్టర్ కుర్ర లక్ష్మి గురువారం తన బృందంతో ఛాయా సోమేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న కాలంలో ఛాయా సోమేశ్వర ఆలయాన్ని మరింత అభివృద్ధి పరచుట కొరకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేవస్థాన భూముల కొరకు గౌరవనీయులైన నల్లగొండ జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికు నివేదిక సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. విచ్చేసిన అధికారులను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణ కుంభ స్వాగతం పలికారు.స్వామివారికి అభిషేకం నిర్వహించిన పిదప అధికారులను శాలువాతో సన్మానించారు. అనంతరం గుడిలో జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాలను నివేదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తు ఆశాఖ ఉన్నతాధికారులు నారాయణ, రాములు నాయక్, నాగరాజు, నాగలక్ష్మి, నర్సింగ్ నాయక్, సోమశేఖార్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్య, దేవాదాయ శాఖ ఈఓ బాలకృష్ణ, ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ గంట్ల అనంత రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం చౌటుప్పల్ మున్సిపాలిటీలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్స్ సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి, ఎంతమంది సిబ్బంది విధులకు హాజరయ్యారని, ఎంత మంది సిబ్బంది ఆబ్సెంట్ అయ్యారని ఆరా తీశారు. విధులకు గైర్హాజరు అయినా వైద్యులకు మరియు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగింది. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. హాస్పిటల్ కి వచ్చిన పేషంట్లతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలన్నారు.హాస్పిటల్ లో ఉన్న ల్యాబ్ ను పరిశీలించారు. ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి, ప్రతి రోజు ఎంతమంది పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసిస్ట్‌ను మందుల స్టాక్ గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు . హాస్పటల్ కు వచ్చిన పేషెంట్లను టెస్టుల కోసం ప్రైవేట్ ల్యాబ్ లకు పంపిస్తే చర్యలు తప్పవని అన్నారు. లేబర్ రూమ్ ను పరిశీలించారు.ప్రైవేట్ ఆసుపత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని ఆరా తీశారు, ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు హాస్పటల్ ఆసుపత్రిలో వైద్యులు,సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నేచురోపతి విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ నిర్మాణంలో ఉన్న కొత్త హాస్పటల్ భవనం పనులను పరిశీలించారు. నూతన భవనం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్లకు 461 దరఖాస్తులు

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జనవరి 26 నుండి అమలు చేసే నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిర మ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు లాంటి పథకాలకు లబ్దిదారులను గుర్తించేందుకే గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభలో చదివిన జాబితాలో పేర్లు లేకపోతే ప్రజలు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 28వ వార్డులో గతంలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఇందిరమ్మ ఇండ్లకొరకు 461 దరఖాస్తు చేసుకొగా 46 మందికి ఇండ్ల స్థలాలు ఉండగా 415 మందికి ఇండ్ల స్థలాలు లేవని తెలిపారు. రేషన్ కార్డుల కోసం 295 దరఖాస్తులు అందగా ప్రజా పాలనలో 195, మీ సేవా కేంద్రాల ద్వారా 50, కలెక్టరేట్ ద్వారా 50తో మొత్తం 295 దరఖాస్తులు అందాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం 113, రేషన్ కార్డులకు 123 కొత్త దరఖాస్తులు కొత్తగా అందాయని వాటిని పరిశీలించి అర్హుల జాబితను విడుదల చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, కౌన్సిలర్ రాపర్తి శ్రీని వాస్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ గంధం ఊరేగింపు ఏర్పాట్లు చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: నేడు, రేపు జాన్‌పహాడ్ దర్గా వద్ద నిర్వహించే గంధం ఊరేగింపుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం నుండి జాతరకు సంబంధించిన అధికారులతో వేబేక్స్‌లో మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా చూడాలని, తాగు నీరు, దర్గా పరిసర ప్రాంతాల్లో పంచాయతీ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పోలీసులు బందోబస్తు నిర్వహించాలని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద వైద్యులు 24గంటల పాటు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జాన్‌పహాడ్ దర్గా ఉర్సు కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నకిలీ ప్రింటెడ్ ఇక్కత్ చేనేత వస్త్రాలను అరికట్టేందుకు చర్యలు : జైస్వాల్

ప్రజాక్షం/భూదాన్ పోచంపల్లి: చేనేత కార్మికులను పట్టిపీడిస్తున్న నకిలీ ప్రింటెడ్ చేనేత వస్త్రాలను అరికట్టేందుకు చర్యలు తీసుకు నేందుకు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని కేంద్ర జౌళి శాఖ ఎకనామిక్ ఎఫైర్స్ డైరెక్టర్ అశోక్ కుమార్ జైస్వాల్ తెలిపారు. పోచంపల్లి మండల వ్యాప్తంగా చేనేతల యొక్క జీవన స్థితిగతులు, మగ్గం నేసే కార్మికులు, ఉపాధి, జీవన ప్రమాణాలు, చేనేత వస్త్రాల మార్కెటింగ్ ధరలను, చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొనేందుకు మొత్తం పరిస్థితిని అధ్యయనం చేసేందుకు గురువారం ఆయన పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత పరిశ్రమ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు ప్రోత్సాహకాలు ఇంకా అందవలసిన పథకాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తే నేతన్నలకు మేలు జరుగుతుంది అనే వాటిని క్షేత్రస్థాయిలో స్వయంగా నేత కార్మికుల ఇళ్లల్లోకి వెళ్లి మొత్తం వస్త్రాల తయారీ పద్ధతిని పరిశీలించారు. చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్య నకిలీ చేనేత ఉత్పత్తులను అరికట్టేందుకు ప్రభుత్వం తరఫున సాయం చేయాల్సిందిగా అధ్యక్షులు భారత లవకుమార్ ఆయనకు మెమోరండం సమర్పించారు. వెంటనే ఆయన స్పందిస్తూ ప్రింటెడ్ నకిలీ చేనేత ఇక్కత్ వస్త్రాలను పూర్తిగా అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యలను ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తానని మెగా క్లస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వానికి సూచిస్తానని ఆయన చెప్పారు.వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్ కుమార్, పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, టై అండ్ డై అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిడైరెక్టర్స్ ఆయన వెంట ఉన్నారు.

జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రత

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం

సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్(పాలకవీడు): నేడు అత్యంత వైభవంగా జరగనున్న జాన్‌పహాడ్ సైదన్న దర్గా ఉర్సు(గంధం ఊరేగింపు) ఉత్సవాలకు పట్టిష్ట భద్రతలను ఏర్పా టు చేసినట్లు డీఐజీ,సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గురువారం జాన్‌పహాడ్ సైదన్న ఉర్సు ఉత్సవాలు ప్రారభమయ్యాయి. జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవాలకు వక్ఫ్‌బోర్డు కమిటీ వారు చేసిన ఏర్పాట్లు ఎస్పీ పరిశీలించారు. దర్గాను సందర్శించి పరిసరాలను పరిశీలించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్యూలైన్లు,బారీకేట్స్ ఏర్పాటు, వాహనాల పార్కింగ్ స్థలాలను,భక్తులు వచ్చి పోయే మార్గలను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలను ప్రజలందరూ కలిసి మెలిసి సోదరభావంతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఉర్సు ఉత్సవాలల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉత్సవ ప్రాంతంలో 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. వాహనాల రద్దీ వలన భక్తులకు ఎటువంటి ఉబ్బందులు కలగకుండా ట్రాఫిక్ రెగ్యూలేషన్ చేస్తూ, పార్కింగ్ పాయింట్‌లు ఏర్పాట చేశామని తెలిపారు. పోలీసుల సచన మేరకు వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని, రోడ్ల వెంట వాహనాలు నిలిపి భక్తులకు అసౌకర్యం కల్పించవద్దని కోరారు. ఉర్సు ఉత్సవాలల్లో ఇరురాష్ట్రాల నుండి భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పిస్తూ బందోబస్తూ నిర్వహించాలని,ప్రణాలిక ప్రకారం ముందుకు వెళ్ళాలని డీఎస్‌పి శ్రీదర్‌రెడ్డి, హుజూర్ నగర్ సీఐ చరమందరాజులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ నాగభూషణం,పాలకవీడు ఎస్ఐ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విమానయాన బృందం పర్యటన శుభపరిణామం

సానుకూల నివేదిక అందిస్తారని ఆశిస్తున్నాం

ఏర్పాటుకు గరీబ్‌పేట ప్రాంతం అనుకూలం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

విమానాశ్రయ అధ్యయన బృందంతో ఎమ్మెల్యే కూనంనేని భేటీ

ప్రజాపక్షం/భద్రాచలం: కొత్తగూడెం ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు పౌరవిమానయాన ప్రతినిధులు కొత్తగూడెంలో పర్యటించడం శుభపరిణామని, బృందం పర్యటనతో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభమైనట్లే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మీడియాతో అన్నారు. గరీబ్‌పేట ప్రాంతాల్లో అధ్యయన బృందంతో గురువారం భేటీ అయిన కూనంనేని ఇక్కడి పరిస్థితులు, విమానాశ్రయ ఏర్పాటు ఆవశ్యకతను బృందానికి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామవరం గరీబ్‌పేట ప్రాంతాల్లో ఉన్న స్థలాన్ని బృందం పరిశీలించిందని,. సానుకూలమైన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. స్థల సేకరణపై ఎలాంటి వివాదాలు ఉండబోవని, ఈప్రాంత ప్రజలు విమానాశ్రయ ఏర్పాటుకు సానుకూలంగా ఉన్నారని, పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న కొత్తగూడెంకు విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు, సమీపంలోని రాష్ట్రాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందన్నారు. విమానాశ్రయం ఏర్పాటుతో కొత్తగూడమే కాకుండా జిల్లా సమగ్రాభివృద్ధి సాధిస్తుందన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, కమిషనర్ శేషాంజన్‌స్వామి, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, ఫహీం, పిడుగు శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరాలకు దీటుగా కొత్తగూడెం అభివృద్ధి

కొత్తగూడెం టౌన్ : నగరాలకు దీటుగా కొత్తగూడెం పట్టణాన్ని అభివృద్ధి చేసి మెరుగైన సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ఆవాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 11వార్డుల్లో రూ.6.32 కోట్ల డిఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభల్లో కూనంనేని మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతం, గిరిజన పల్లెలకు కేంద్రంగా ఉన్న కొత్తగూడెంను సుందర పట్టణంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. విద్య, వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి రానివ్వబోమన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, నూతన పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల ఏర్పాటుకు బాటలుపడతాయన్నారు. విమానాశ్రయం ఏర్పాటుకు తొలి అడుగుపడిందని, అందుకు సంబంధించిన పనుల వేగవంతం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, తహసీల్దార్ పుల్లయ్య, కమిషనర్ శేషాంజన్ స్వామి, డిఇ రవికుమార్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మోరే రూప, నీలావతి, మమతా, ఉమారాణి, శ్రీవల్లి, సత్యభామ, భండారి, వనజ, బోయిన విజయ్‌కుమార్, ధర్మరాజు, సత్యనారాయణాచారి, నాయకులు మునిగడప వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, పల్లపోతు సాయి, అబిద్, ఫహీమ్, పిడుగు శ్రీనివాస్, జె.గట్టయ్య, నేరెళ్ల రమేష్, ధనలక్ష్మి, గడ్డం ప్రభాకర్, గుత్తుల శ్రీనివాస్, రాకేష్, ఇర్ఫాన్, కిశోర్, యాకూబ్ పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం జరిగితే సహించం

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

ప్రజాపక్షం/ఖమ్మం : రోడ్డు వెడల్పు పేరుతో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ హెచ్చరించారు. గురువారం ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని పత్తి మార్కెట్ నుంచి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వైపు వెళ్లే రోడ్డును సిపిఐ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రోడ్డును 80 అడుగుల మేర వెడల్పు చేస్తే పేదలకు చెందిన సుమారు 50 ఇండ్లు తొలగించాల్సి వస్తుందని తెలిపారు. అధికార యంత్రాంగం, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దీనిపై పునః పరిశీలన చేయాలని సురేష్ కోరారు. రోడ్డు వెడల్పుతో ఇండ్లను కోల్పోతున్న వారంతా నిరుపేదలని ఆ విషయాన్ని అధికారులు గుర్తెరగాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జాని మియా, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, నాయకులు మహ్మద్ సలాం, పగడాల మల్లేష్, బి.సత్యనారాయణ, భూక్యా రవీందర్, నామ కుమార్, సురేష్, వి. లింగయ్య, వెంకన్న, వీరన్న, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలతో పేదలకు తీవ్ర అన్యాయం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్

ప్రజాపక్షం/ములకలపల్లి: ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ భరోసా, ఇండ్ల కాలనీ, రేషన్ కార్డ్‌ల లబ్దిదారుల ఎంపికలో అధికారుల నిర్లక్ష్యంతో నిజమైన లబ్దిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నరాటి ప్రసాద్ ఆరోపించారు. అర్హత గల లబ్దిదారుల పేర్లు అధికారులు ప్రకటించిన జాబితాలో రాలేదన్నారు. ములకలపల్లిలో గ్రామ సభకి వచ్చిన ప్రజలు ఆవేదనతో గ్రామసభ బహిష్కరించి ఆందోళన వ్యక్తం చేశారు. ఆందోళన కారుల వద్దకు పాల్వంచ సిఐ వినయ్‌కుమార్, ఎంపిడిఒ వచ్చి పేర్లు లేని వారిని అర్హత గల జాబితాలో నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రమేష్, సంగు సాంబ, వెంకన్న, రాఘవులు, సీతారాములు, సాయి, నాగమ్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంచండి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రభుత్వ పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ కోరారు. గురువారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో శాఖ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ వార్డు సభల్లో ప్రదర్శించిన పథకాలకు సంబంధించిన జాబితాలో అర్హులైన వారి పేర్లు లేవని తెలిపారు. వేల సంఖ్యలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వందల సంఖ్యలో జాబితాలో పేర్లు వచ్చాయని ఆయన తెలిపారు. ఎంతో మంది అర్హులు ప్రభుత్వ పథకాల కోసం ఎదురు చూస్తున్నారని ప్రజల నుంచి దరఖాస్తులు అందించేందుకు గడువును పెంచాలని కోరారు. స్థలం ఉండి ఇల్లు లేని ఎంతో మంది నిరుపేదలు ప్రభుత్వం అందించే ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని వారందరికీ లబ్ది చేకూర్చాలన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెంశాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 14, 15 డివిజన్ల కార్యదర్శులు ప్రతానపు రామనాథం, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, చాగంటి వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, చింతకాయల లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

'మధ్యాహ్న' బిల్లులు తక్షణమే చెల్లించాలి : ఎఐటియుసి డిమాండ్

ప్రజాపక్షం/జూలూరుపాడు : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎంఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగాఎఐటియుసి మండల కార్యదర్శి షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ వేతనాలు అందక, బిల్లులు సకాలంలో రాక అప్పులతో ఏజెన్సీలు నిర్వహిస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి మెనూ చార్జీలు 25 రూపాయలు చెల్లించాలని, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు కనీస వేతనం పదివేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ముదిగొండ లక్ష్మి, గడల మంగమ్మ, సత్యవతి, రజిని, పద్మ, సుశీల, రాణి, సుభద్ర, నిర్మల, లలిత తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వండి

ప్రజాపక్షం/సత్తుపల్లి : వేంసూరు మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న సుమారు 100 కుటుంబాలు వారు ఇల్లు లేక గత రెండు నెలలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని వారందరికీ పట్టాలిచ్చి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ఉపాధి హామీకి సంబంధం లేకుండా భూమి లేని ప్రతి ఒక్కరికి వేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన ప్రజా పాలన గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్‌కు సిపిఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సత్తుపల్లి డివిజన్ కన్వీనర్ ఎస్‌కె రంజాన్ బి, సిపిఐ వేంసూరు సెక్రెటరీ లాల్ మహమ్మద్, నాయకులు, గుడిసెవాసులు ఎట్లా వెంకటేశ్వరరావు, సీతమ్మ, వెంకటమ్మ, ఇజ్రాయిల్, జమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్టివో వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పకుండా పాటించాలని తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఇంటి వద్ద తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు తెలిపి రోడ్డు భద్రతపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ సిఐ సాంబయ్య మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపవద్దని సూచించారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రతపై పలు అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థుల చేత ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అర్హులకే పథకాలు

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రతిపక్షాల కుహనా విమర్శలు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం దృఢ సంకల్పంతో నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తుందని, సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎవరు అధైర్య పడొద్దని, అర్హులు అయితే ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకా లు అందుతాయని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం తిరుమలాయపాలెం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సిసి రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తున్నారన్నారు. ఈనెల 26న మరో నాలుగు సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టారన్నారు. ఎప్పటినుంచో ప్రజలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో లబ్ధిదారులు ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తుందన్నారు. అధికారులను పూర్తిస్థాయిలో గ్రామాలలో సర్వే చేశారన్నారు. ఆ సర్వేతో గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ ప్రతిపక్షాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, గ్రామసభలలో రాద్ధాంతం చేసి గొడవలు సృష్టించి లబ్ధి పొందాలనుకుంటే వారికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కదన్నారు. గ్రామ సభలలో తమ పేర్లు రాలేదని ఎవరు అధైర్య పడద్దని సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని ఆయన తెలిపారు. అర్హులై ఉండి పేర్లు రాకపోతే మరల దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన సూచించారు. రానున్న ఏడాది కాలంలో పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటి ముందు సిసి రోడ్డు ఉంటుందని పాలేరు సమగ్ర అభివృద్ధి నా లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమాల్లో నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం.విజయబాబు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్‌డిఒ నరసింహారావు, పాలేరు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ చైర్మన్ రామ సహాయం నరేష్ రెడ్డి, బెల్లం శ్రీనివాస్, కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ నాయక్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపిడిఒ సిలార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల ఎంపికకే గ్రామసభలు : తెల్లం

ప్రజాపక్షం/భద్రాచలం : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం అందించే పథకాలు అందుతాయని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్ కార్డులపై గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో నాలుగు పథకాలకు సంబంధించి అర్హులైన వారి జాబితాను ఎమ్మెల్యే సమక్షంలో అధికారులు చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారితో పాటు సమగ్ర సర్వే ఆధారంగా అర్హుల జాబితా సిద్ధం చేశారని, పథకాల కోసం ఎలాంటి దరఖాస్తు చేసుకోని వారు ఉంటే ఇప్పుడు దరఖాస్తులు చేయవచ్చని, వారి దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వే నిర్వహించి అర్హులకు పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. భద్రాచలం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని, ఇందుకోసం ప్రభుత్వంతో చర్చించి అధిక నిధులు రాబట్టి మౌలిక సదుపాయాలను సమకూర్చుకుందామని చెప్పారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ బి.రాహుల్, ప్రత్యేకాధికారి చంద్రమౌళి, తహసీల్దార్ శ్రీనివాస్, గ్రామపంచాయతీ ఇఒ శ్రీనివాస్, ఉపాధిహామీ, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

జాబితాలో పేర్లు ఏవీ?

గ్రామసభల్లో ప్రజల ఆగ్రహం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజాపాలన గ్రామ సభల్లో గందరగోళం నెలకొంది. జాబితాలో తమ పేర్లు లేవంటూ గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం రఘునాథపాలెం మండల పరిధిలోని బూడిదంపాడు, హర్యాతండా, కోటపాడు, మల్లేపల్లి, పాపటపల్లి, రజబ్‌అలీనగర్, వి.వెంకటాయపాలెం, వేపకుంట్ల, దారెడు, కామంచికల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నాలుగు పథకాలకు సంబంధించి ప్రాథమికంగా ఎంపిక చేసిన లబ్దిదారుల జాబితా ప్రదర్శించడంతో పాటు సభలో చదివి వినిపించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని తెలిపారు. గ్రామసభల వద్ద హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వి.వెంకటాయపాలెంలో జరిగిన గ్రామసభల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే అధికారులు విచారించి అర్హులు ఉంటే ఎంపిక చేస్తారని తెలిపారు. సభలో ప్రత్యేకాధికారి జి.నగేష్‌కుమార్, కార్యదర్శి కృష్ణ, ఎపిఒ పద్మయ్య నాయుడు, సొసైటీ వైస్ చైర్మన్ రావెళ్ల శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'నేడు' ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ (ఎఐటియుసి) ఖమ్మం రీజియన్ జనరల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరుగుతుందని యూనియన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దపాక వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్ వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, భవిష్యత్తు కార్యాచరణ గురించి కౌన్సిల్‌లో చర్చించడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీల గురించి పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌టిసిపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

రైతుకు చేయూత అందించేందుకు కృషి

డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సహకార సంఘాలను అభివృద్ధి చేసి రైతులకు చేయూతనందించేందుకు కృషి చేస్తున్నట్లు ఖమ్మం కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. డిసిసిబి ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 31 వరకు రూ.3,390 కోట్ల వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గురువారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్యాంక్ సిఇఒ ఎన్. వెంకట ఆదిత్యతో కలిసి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు మాట్లాడారు. సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు చేయూత నందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సొసైటీల ఆధ్వర్యంలో డెయిరీ ఫాంలను ఏర్పాటు చేసి రైతులకు గేదెల కొనుగోలుకు రుణాలు అందించి అట్టి గేదెలను సొసైటీ డెయిరీ ఫాంలకు అనుసంధానం చేసి రైతులకు లాభం చేకూర్చేలా ప్రణాళికలు చేస్తున్నట్లు వారు తెలిపారు. కౌలు రైతులకు కూడా సహకార సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. డిసిసిబి ఆధ్వర్యంలో చెరువుమాధారం, కరుణగిరి, కందుకూరు, అడసర్లపాడు గ్రామాల్లో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలా?

గందరగోళానికి తెరలేపిన గ్రామసభలు

ఏ జాబితాలోనైనా అనర్హులకే పెద్దపీట

భరోసా కోల్పోయిన పేదలు ఆగ్రహం

ప్రజాపక్షం/ఖమ్మం : అరుపులు, కేకలు, తోపులాటలు, అధికారుల నిలదీతల నడుమ గ్రామసభలు గందరగోళానికి తెరతీశాయి. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాలకు సంబంధించి రైతు భరోసా మినహా అన్ని పథకాలకు సంబంధించి లబ్దిదారుల ఎంపికలో పెద్ద గందరగోళం నెలకొంది. అర్హుల కంటే అనర్హులకే పెద్దపీట వేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్దిదారుల ఎంపికపై గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఎంపిక మొత్తం అస్తవ్యస్థంగా మారడంతో ఉన్నతాధికారులు సైతం ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి. కామేపల్లి మండలం కామేపల్లి గ్రామంలో చదువుకుంటున్న విద్యార్థి పేరు ఆత్మీయ భరోసా పథకంలో చోటు చేసుకోవడంతో ఏమి చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. దీనిపై గ్రామస్తులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇదే గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి ఇందిరమ్మ ఇండ్లు రావడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. రేషన్‌కార్డుల పరిస్థితి మరింత ఘోరం. పెళ్లి కాని వారికి సైతం రేషన్‌కార్డుల జాబితాలో పేర్లు నమోదయ్యాయని గ్రామస్తులు స్థానిక అధికారులను నిలదీశారు. మూడు రోజుల్లో జరిగిన గ్రామసభల్లో అతికొద్ది గ్రామాలు మినహాయిస్తే అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. కొన్ని గ్రామాల్లో ప్రజలు వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు దిగారు. అధికార పార్టీకి చెందిన వారికే పెద్దపీట వేశారని విపక్షాలు ఆరోపించాయి. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల విషయంలో అధికార పార్టీకి చెందిన నేతలు ఏమి చెబితే అదే చేశారని ఆరోపణలు వినవచ్చాయి. భూమి కలిగిన అనేక మందికి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చోటు దక్కింది. గతంలో ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన వారికి కూడా ఆ దఫా కూడా అవకాశం కల్పించడం చర్చనీయాంశమైంది.

అర్హులకు అందని ఆత్మీయ భరోసా.. ఆత్మీయ భరోసాకు సంబంధించి అర్హతలు ఉన్న లబ్దిదారులుగా ఎంపిక కాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం 20 రోజులు పనిచేస్తే పేదవాడు అనే ప్రామాణికం తీసుకోవడంతో పేదలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దూరమయ్యారు. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామంలో చాలా మంది 19 రోజులు పనిచేసినప్పటికీ ఆత్మీయ భరోసా రాలేదు. ఈ గ్రామానికి చెందిన ఫీల్డ్ ఆఫీసర్ జాతీయ ఉపాధి హామీ పథకం హాజరులో తప్పులకు పాల్పడ్డారని జాతీయ ఉపాధి హామీ పథకంలో ఒక రోజు కూడా పనికి వెళ్లని వారికి ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేశారని గ్రామసభలో ప్రజలు నిలదీశారు. ఈ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేసిన వారు 210 మంది ఉండగా ఇందులో 94 మందిని ఆత్మీయ భరోసాకు ఎంపిక చేయగా ఇందులో కొద్ది మంది అసలు జాతీయ ఉపాధి హామీ పనికి వెళ్లలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గ్రామసభలో ఈ విషయాన్ని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిలదీయగా సమాధానం చెప్పలేని పరిస్థితి. రేషన్‌కార్డుల పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు.

టార్గెట్‌గా మారిన పంచాయతీ కార్యదర్శులు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి గ్రామ సభల్లోనే లబ్దిదారులను ఎంపిక చేస్తామని చెప్పడం గ్రామసభల్లో మాత్రం ఎక్కడో ఎప్పుడో తయారు చేసి తీసుకు వచ్చిన జాబితాను చదివి వినిపిస్తుండడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.ఈ తప్పిదాలకు కారణం గ్రామ పంచాయతీ కార్యదర్శులనే ప్రజలు దోషులుగా చూసే పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో వివిధ పథకాలకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు జాబితాలో లేకపోవడం అనేక మంది అనర్హుల పేర్లు అర్హులుగా పేర్కొనడం అసలు గ్రామసభలకు సంబంధం లేకుండానే లబ్దిదారులను

ఎసిబి వలలో ఎస్‌టిఓ, సహాయకుడు

విశ్రాంత ఉపాధ్యాయుడి నుంచి రూ.10 వేలు డిమాండ్

ప్రజాపక్షం/రామగుండం :రామగుండం పట్టణంలోని సబ్ ట్రెజరరీ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎస్‌టిఓ ఏకుల మహేశ్వర్, కార్యాలయ సహాయకుడు రెడ్డవేణి పవన్‌లు స్థానిక విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు కన్నూరి ఆనందరావు నుంచి రూ. 10 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధకశాఖ అధికారులకు గురువారం పట్టుబడ్డారు. తన పింఛన్ మంజూరు చేయాలని ఆనందరావు కోరడంతో తమకు రూ.10 వేలు లంచం ఇస్తేనే మంజూరు చేస్తామని ఎస్‌టిఓ చెప్పడంతో బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ఆనందరావు నుంచి లంచం తీసుకుంటున్న ఇద్దరు అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు.

దరఖాస్తులు నిరంతర ప్రక్రియ

మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని పెద్దపెల్లి మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఐదో వార్డులో ఇద్దరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిస్టులో పేరు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది దేవనందిరమకాంత్, మధుకర్, సాగర్, సమీర్, కాంగ్రెస్ నాయకులు గుజ్జుల కుమారస్వామి, పిడుగు సంపత్, బండ్ల లింగారావు తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ గ్రామంలో రసాభాస

ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి ఆందోళన

ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మండలంలోని సైదాబాద్ గ్రామంలోని గ్రామసభకు హుజురాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలపై బైఠాయించి ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు తిరగబడుతున్నారని, ఏ గ్రామంలో చూసినా నిరసనలు, నిలదీతలే ఎదురవుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీల గారడీపై అంతటా గరం గరంగా ఉందన్నారు. పలు చోట్ల ఇందిరమ్మ ఇండ్ల అర్జీలకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని, గ్రామ సభలలో ప్రశ్నిస్తున్న ప్రజలకు అధికారులు సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్నారన్నారు. ఈ క్రమం లో అధికారులు మధ్యలోనే సభల ముగింపు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాపక్షం/కొత్తపల్లి : గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామశివారు బైపాస్ రోడ్డులో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ప్రకారం కరీంనగర్‌లోని వావిలాలపల్లికి చెందిన బండారి రాజు(19), కొత్తపల్లి మండలానికి చెందిన దండి అభిషేక్ (19)లు బుధవారం రాత్రి తమ స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తామని ఇంట్లో తెలిపి రాత్రి 9గంటల ప్రాంతంలో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో మల్కాపూర్ బైపాస్ రోడ్డు మార్గం నుంచి వెళ్తుండగా ద్విచక్రవాహనం అతివేగం, నిర్లక్ష్యంగా నడిపి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మరణించారు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున జరిగినట్లు అంచనా వేస్తున్నారు. దుర్మరణం చెందిన యువకుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి ఎస్ఐ ఎస్.సాంబమూర్తి తెలిపారు.

పల్లె యువకుడికి ఇన్నోవేషన్ అవార్డు

ప్రజాపక్షం/అంతర్గాం:పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన గోలివాడ ప్రదీప్ కుమార్‌కు విలేజ్ ఇన్నోవేషన్ అవార్డు లభించింది.రాష్ట్ర ప్రభుత్వ ఇన్నోవేషన్ సెల్(టిజిఐసి)ద్వారా ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంత యువకులను ప్రోత్సహించేందుకు కొత్తగా ఆవిష్కరించిన వాటికి అవార్డులను ఇస్తోంది. ఈ మేరకు ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ప్రదీప్‌కుమార్ తయారు చేసిన వాటర్ సైకిల్ అందరిని ఆకట్టుకున్నది. ఈ వాటర్ సైకిల్ పర్యాటకులకు, మత్స్యకారులకు ఉపయోగపడనున్నది. దీంతో అతడిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు.26న ప్రదీప్‌కుమార్‌కు అవార్డును అందజేయనున్నట్లు గ్రామ కార్యదర్శి సాగర్ తెలిపారు.ప్రదీప్‌కుమార్‌ను గ్రామ మాజీ సర్పంచి గుమ్ముల రవీందర్, ధర్మాజీ శ్రీనివాస్, ధర్మాజీ కుమార్, గుమ్ముల శ్రీకాంత్, గోలివాడ శేఖర్, కంది విజయ్‌కుమార్‌లు అభినందించారు.

సిఐ లంచం వ్యవహారం వైరల్

రూ.3లక్షలు ఇచ్చానంటూ సామాజిక కార్యకర్త ఆడియో రిలీజ్

ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు విషయంలో తన వద్ద రూ.3 లక్షలు తీసుకుని తిరిగి అట్రాసిటీ కేసు ఎలా పెడతావ్ అంటూ జమ్మికుంట సిఐ వరగంటి రవిని పట్టణ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త షేక్ షాబిర్ అలీ ప్రశ్నిస్తున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోగల ఎస్ఆర్‌కె మిల్క్ డైరీ వివాదం యాజమాన్యంలో పార్టనర్‌లుగా ఉన్న కృష్ణారావు, గోవిందరెడ్డి, మధులపై పెట్టిన కేసు విషయంలో మధ్యవర్తిగా షాబీర్ అలీ సిఐ వద్దకు వెళ్లారు. కేసు పెట్టవద్దంటే రూ.3 లక్షలు ఇవ్వాలని జమ్మికుంట సిఐ డిమాండ్ చేయగా ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆడియోలోతెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు స్టేషన్ బయటకు వెళ్లగానే సిఐ తనతో డబ్బులు తన వాష్‌రూంలో పెట్టివెళ్లాలని కోరగా తాను సిఐ వాష్‌రూంలోకి వెళ్లి బకెట్‌లో మూడు లక్షలు వేసి వెళ్లానని, ఈ విషయం అంతా తన జేబుకు గల స్పై కెమెరాల్లో బంధించినట్లు తెలిపారు. ఈ విషయం అంతా సిఐకి షబ్బీర్ మధ్య జరిగిన ఫోన్ సంభాషణ రూపంలో ఆడియోలీక్ అవ్వడం జమ్మికుంటలో చర్చనీయాంశంగా మారింది. స్పందించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఉన్నతాధికారుల ఆరా?

జమ్మికుంట సిఐపై వైరల్ అవుతున్న ఆడియోపై పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీశారు. జమ్మికుంట సిఐ రూ.3 లక్షలు లంచం తీసుకుని కేసు పెట్టడానికి కారణాలు ఏమిటి? ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులో ఏం జరిగింది? దీని వెనుక గల కారణాలు ఏమిటి? అనే విషయాలపై ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

సిఐపై వేటుకు రంగం సిద్ధం

లంచం తీసుకున్న విషయంలో ఆడియోలో ఒక సామాజిక కార్యకర్తతో తడబడుతూ మాట్లాడడం, అవతలి వ్యక్తి సిఐను పేరుపెట్టి పిలవడంపై పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సిఐపై వేటుకు రంగం సిద్ధం పడుతుందని పలువురు చర్చించుకుంటున్నారు.

అభివృద్ధిలో ప్రతీపల్లె అగ్రస్థానం

రూ.2.50 కోట్లతో కాసారం- గర్శకుర్తి గ్రామాల బిటి రోడ్డు పూర్తి

రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రజాపక్షం/గంగాధర : కాసారం నుంచి గర్శకుర్తి వరకు బిటి రోడ్డు వేయిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు.అధికారులను, కాంట్రాక్టర్‌ను సమన్వయం చేస్తూ యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించారు. చొప్పదండి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రోడ్డు నిర్మాణంపై మేడిపల్లి సత్యం దృష్టి పెట్టి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. గురువారం కాసారం వద్ద నూతనంగా వేసిన రోడ్డును ఆయన ప్రారంభించి మాట్లాడారు. చొప్పదండి నియోజక వర్గంలోని పల్లెల అభివృద్ధి ధ్యేయంగాపనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చినట్లు పేర్కొన్నారు.ప్రతిపల్లెను అభివృద్ధి పథంలో నిలుపుతానన్నారు.గంగాధర కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసి బుచ్చయ్య, సత్తుకనయ్య,కంకణాల రాజగోపాల్‌రెడ్డి, బూరుగు గంగన్న,అట్లా రాజశేఖర్‌రెడ్డి, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రాచమల్ల భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు దశాబ్దాల సమస్యను పూర్తి చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. గంగాధర మండలం మధురా నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణపూర్ ముంపు బాధితులను ఆదుకుంటామని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారాయని, పాలకులు మారినా ప్రాజెక్టు అభివృద్ధిపై ఎవరూ దృష్టి సారించలేదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గంగాధర కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, దుబ్బాసిబుచ్చయ్య, సత్తుకనుకయ్య, కంకణాల రాజగోపాల్ రెడ్డి, బూరుగు గంగన్న, అట్ల శేఖర్ రెడ్డి, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రాచమల్ల భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్, డైరెక్టర్లు రుద్ర మల్లేశం, నరేష్ తదితరులున్నారు.

లాభాల బాటలో తెలంగాణ ఆర్‌టిసి

బస్‌స్టాండ్ అధునీకరణ ప్రారంభోత్సవ సభలో మంత్రి పొన్నం

ప్రజాపక్షం/హుస్నాబాద్: తెలంగాణలోనే నష్టల బాటలో ఉన్న అర్‌టిసి సంస్థ నేడు లాభాల బాటలో ఉందని దీనికి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఒక వరమని తెలంగాణ బిసి రవాణ శాఖ మంత్రి ప్రభాకర్‌గౌడ్ అన్నారు. గురువారం అయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రూ.2కోట్ల అధునిరణతో పాటు అదనంగా మరో నాలుగు ప్లాట్ ఫామ్‌లు కలిగిన నూతన బస్‌స్టాండ్‌ను జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఇడితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 186 కోట్ల నష్టంలో ఉన్న సంస్థ నేడు 4,489 కోట్లలాభాల్లో ఉందని, అర్‌టిపి సంస్థను నేడు 27అదాయంతో నడుస్తుందన్నారు. వేల మంది నూతన అర్‌టిసి కార్మికుల నియామాకం చేసినట్లు తెలిపారు. పర్యావరణకాల్యుం నివారించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువ చ్చామన్నారు. హుస్నబాద్ బస్‌స్టాండ్‌ను అధునికరించడంతో ఈ ప్రాంత ప్రజలకు ఒక కొత్త కళ వచ్చిందన్నారు. కేడం లింగమూర్తి, సహకారసంఘం చైర్మెన్ శివయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ అకుల రజితవెంకన్న, వైస్ చైర్మెన్ అనితరెడ్డి, అర్‌టిసి రీజనల్ అధికారి ఖాన్, హుస్నాబాద్ డిఎం అర్‌డిఓ తహశీల్దార్, నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర కీలకం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : దేశ స్వాతంత్రం కోసం చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని డిసిసి అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నగరంలోని చొప్పదండి రోడ్డులో గల సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి ఎమ్మెల్యే , నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఆర్‌టిఎ మెంబర్ పడాల రాహుల్, అర్బన్ బ్యాంకు చైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి,తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మల్యాల సుజిత్ కుమార్, అజీమ్ మహమ్మద్, ముస్తాక్ అహ్మద్, కలువల రాంచందర్, ఆమీర్, కుర్ర పోచయ్య, విక్టర్, పెద్దిగారి తిరుపతి, వంగల విద్యాసాగర్, రోళ్ల సతీష్, సలీముద్దీన్, ముక్కభాస్కర్, షబానా మహమ్మద్, తదితరులున్నారు.

కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారుల సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : జిల్లా కేంద్రంలో శుక్రవారం కేంద్ర పట్టణ అభివృద్ధి గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ పర్యటన నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, గీతాభవన్ సమీపంలో మల్టీపర్పస్ పార్క్, హౌసింగ్ బోర్డు కాలనీలో 24 గంటల తాగునీటి సరఫరా, కుమార్‌వాడి ఉన్నత పాఠశాలలో స్మార్ట్ తరగతి క్లాసులను ప్రారంభించనున్నారు. ఈమేరకు గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రూట్‌మ్యాప్, ట్రాఫిక్ సమస్య, ప్రోటోకాల్, బందోబస్తు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో మహేశ్వర్, నగరపాలిక ఎస్ఈ రాజ్ కుమార్, వివిధ శాఖల అధికారులున్నారు.

ఏర్పాట్లు పరిశీలన : కలెక్టర్ ఉన్నతాధికారులతో కలిసి అంబేద్కర్ స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, మల్టీపర్పస్ పార్క్, హౌసింగ్ బోర్డు కాలనీ వాటర్ ట్యాంకు పరిసరాలు, కుమార్‌వాడీ పాఠశాలలకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. పబ్లిక్ మీటింగ్ జరిగే వేదికను పరిశీలించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బంది ఆదేశించారు.

ముత్తారం మండల గ్రామసభల్లో వాగ్వివాదం

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని కేషనపల్లి, ఖమ్మంపల్లి,హరిపురం,మైదంబండ,మచ్చుపేట,ముత్తారం గ్రామాలతోపాటు తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల కార్యక్రమాలకు డిఆర్‌డిఓ కాలిందిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని, అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్, ఎంపీ ఓ గోవర్ధన్, గ్రామాల ప్రత్యేక అధికారుల తోపాటు ఆయా గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో వాగ్వాదం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మం పల్లి,కేషనపల్లి,ముత్తారం గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలు కొనసాగుతుండగా సభలో స్వల్పంగా వాగ్వాదం చోటు చేసుకుంది.ప్రజలు మాట్లాడుతుండగా కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలో బిఆర్‌ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరు పార్టీల నాయకులకు స్వల్ప వాగ్వాదం జరిగింది. అధికారులపై గ్రామస్థులు మండిపడ్డారు. తప్పుడు జాబితా తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఖమ్మంపల్లి గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. ఇసుక రీచుల వద్ద ఉన్న పంట పొలాల రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ లిస్టులో చాలామంది పేర్లు రాలేదని తెలపడంతో ఘర్షణకు దిగారు. దీంతో తహసీల్దార్ సుమన్ మాట్లాడుతూ లిస్టులో పేర్లు రానివాళ్లు మరో మారు దరఖాస్తులు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నరేష్, ఎపిఎం పద్మ, కార్యదర్శి బద్రు నాయక్, ఎఒఅనూష,గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువతకు 'టాస్క్ సెంటర్'లో శిక్షణ

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్ నిరుద్యోగ యువతకు చేరువ అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లిలోని ఎంపిడిఓ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) రీజనల్ సెంటర్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్ ద్వారా 2బ్యాచ్‌లకు శిక్షణ అందించామని, ప్రస్తుతం 3వ బ్యాచ్‌కు ట్రైనింగ్ జరుగుతుందన్నారు.వివిధ సాఫ్ట్‌స్కిల్స్,సాంకేతిక కోర్సులు వివరాలను జిల్లాలోని విద్యార్థులకు, నిరుద్యోగులకు తెలియజేసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నిరుద్యోగ యువత వద్దకు చేరుకొని అవసరమైన కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించేందుకు టాస్క్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు.18 సంవత్సరాల నిండిన యువత శిక్షణ పొందవచ్చని, ఇక్కడ ఇంజనీరింగ్ ఫార్మసీ ,డిగ్రీ, ఐటిఐ ,డిప్లమా వంటి కోర్సులు చదివిన యువతకు అవసరమైన సాఫ్ట్ స్కిల్స్, నైపుణ్య శిక్షణను అందించేందుకు ఈ టాస్క్ సెంటర్ ఉపయోగపడుతుందని, దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంట రీజనల్ హెడ్ కం ట్రైనర్ డాక్టర్ టి కౌసల్య బాయ్ , తదితరులు పాల్గొన్నారు.

పథకాలన్నీ బూటకమే..

* హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం
* పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్

ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్ :కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలన్నీ బూటకం గా మారాయని మిట్టపల్లి పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ కనకమల్లయ్య అన్నారు. గురువారం వారు మీడియాతో మాటాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం చెందిందని, ప్రజాపాలన గ్రామసభలను పెట్టి ప్రజల మధ్య చిచ్చుపెడుతదని, అనర్హులను లిస్టులో చేర్చి అర్హులకు మొండిచేయి చూపిందన్నారు. ఏ పద్ధతిలో అర్హుల లిస్టు తయారు చేశారో స్పష్టంగా తెలపాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు సరైన వివరణ ఇవ్వాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జెపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు భవనాల పరిశీలన

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలో నూతనంగా మహిళ పోలీస్ స్టేషన్, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఎలిగేడు పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటు చేయనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస తెలిపారు. పెద్దపెల్లి డిసిపి చేతనతో కలిసి పలుభవనాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన పోలీస్ స్టేషన్‌ల ఏర్పాటుకు భవనాలు, స్థలాలు చూడడం జరిగిందని, పెద్దపల్లి మహిళ పోలీస్ స్టేషన్ కోసం వ్యవసాయ మార్కెట్‌లో, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ కోసం బంధంపల్లిలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రతిపాదించడం జరిగిందని, పెద్దపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కోసం ఇప్పుడు పోలీస్ స్టేషన్ కొనసాగుతున్న భవనం అదేవిధంగా ఎలిగేడు పోలీస్ స్టేషన్ కోసం పాత ఎం.ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ భవనాలను పోలీస్ స్టేషన్‌కు అనుగుణంగా మార్పులు చేస్తూ, పునరుద్ధరణ పనులు చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి జిఒను కూడా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎసిపి జి.కృష్ణ, ట్రాఫిక్ ఎసిపి నరసింహులు, పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, సుల్తానాబాద్ సిఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, పెద్దపల్లి ఎస్ఐలు లక్ష్మణ్ రావు, జూలపల్లి ఎస్ఐ సనత్ కుమార్, సుల్తానాబాద్ ఎస్ఐపాల్గొన్నారు.

ముంపు గ్రామా ప్రజలకు ఉపాధి కోసం పరిశ్రమలు

పదేళ్లుగా రేషన్ కార్డులు, ఇండ్లుఉ/డ్లనివారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/వేములవాడ: అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో గురువారం జరిగిన ప్రజా పాలన గ్రామసభకు ప్రభుత్వ విప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన గ్రామసభల్లో చదివిన జాబితాల్లో వివిధ పథకాల కింద పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అధికారులు దరఖాస్తులపై తక్షణమే విచారణ జరిపి వారిని ఎంపిక చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గతంలో లాగా నాలుగు గోడల మధ్య లబ్ధిదారుల ఎంపిక చేయడం లేదని ప్రజల మధ్య వారి సమక్షంలో లబ్ధిదారులకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12 వేలు వారి ఖాతాల్లో జమ, పంటలకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పెంపు వంటి సంక్షేమ పథకాలను26 నుండి అందించడం జరుగుతుందని చెప్పారు. ముంపు గ్రామాల ప్రజలకు ఉపాధి కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నానని, పథకాల అమలులో పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు.గతంలో ఎమ్మెల్యే కోటా కింద,మంత్రుల కోటా కింద ఇండ్లు ఇచ్చారని కానీ ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 3500 ఇండ్లు ప్రజా కోటా కింద పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఏ సమస్యలు ఉన్నా వాటికి పరిష్కారం చేస్తూ ముందుకు పోతున్నామన్నారు.ముంపు గ్రామాల్లో 3600 పై చిలుకు ఉన్నా దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలిస్తుందని వాటిని త్వరలోనే శాశ్వత పరిష్కారం అవుతుందని చెప్పారు. నూతన రేషన్ కార్డులు మంజూరు చేసినా తర్వాత సన్నం బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అడ తల్లులకు ఆర్టీసీ బస్సులో ఉచిత

ఫోకస్

వ్యవసాయం

సాధారణమవుతున్న 'లా నినా'!

ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో లా నినా పరిస్థితులు సాధారణ ప్రక్రియగా మారాయి. ఐదారు సంవత్సరాలకు ఒకసారి సంభవించే చలి తీవ్రత ఇటీవల కాలంలో ప్రతి రెండేళ్లకోసారి పలకరిస్తుంది. సముద్ర జలాల శీతలీకరణ... పర్యావరణ మార్పులతో చల్లగాలులు వంటి పరిస్థితులను లా నినాగా పేర్కొంటారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) విడుదల చేసిన నివేదికను అనుసరించి, భారత్‌సహా అనేక దేశాల్లో ఇప్పటికే ఈ పరిస్థితులు మొదలయ్యాయి. ప్రస్తుతం తటస్థంగా ఉన్న ప్రాంతాల్లోనూ, ఫిబ్రవరిలోగా లా నినా పరిస్థితులు ఏర్పడతాయి. ఇండోనేషియా, దక్షిణ అమెరికా మధ్య పసిఫిక్ మహాసముద్ర ప్రాంతం సాధారణం కంటే చల్లగా ఉన్నప్పుడు లా నినా సంభవిస్తుంది. అందుకు పూర్తి విర్థంగా, అదే ప్రంతం వేడెక్కడాన్ని ఎల్ నినో అంటారు. కాగా, ఈ దశాబ్దం మూడు వరుస లా నినా సంఘటనలతో ప్రారంభమైంది. ఇది 'ట్రిపుల్ డిప్ లా నినా'గా పిలిచే అరుదైన సంఘటన, మూడు వరుస సంవత్సరాల్లో లా నినా తర్వాత, 2023లో ఎల్ నినో సంభవించింది. చారిత్రాత్మకంగా, లా నినా సాధారణంగా రుతుపవనాల సమయంలో లేదా రుతుపవనాల ముందు ఏర్పడుతుంది. ఇది 1950 నుండి ఇప్పటి వరకూ కేవలం రెండు పర్యాయాలు మాత్రమే అక్టోబర్–డిసెంబర్ మధ్యకాలంలో ఏర్పడింది. మన దేశం విషయానికి వస్తే, లా నినా సమయంలో ఉత్తర భారత దేశం సాధరణం కంటే చలిగా ఉంటుంది. న్యూ ఢిల్లీలోని కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్మెంట్ అండ్ వాటర్ పరిశోధకుల వాతావరణ డేటా విశ్లేషణ కూడా ఈ విషయాన్ని రుజువు చేస్తున్నది. ఎల్ నినోతో పోలిస్తే లా నినా శీతాకాలాలు చల్లటి రాత్రులను కలిగి ఉండగా, పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. గాలి వేగం, గ్రహ సరిహద్దు పొర ఎత్తు వంటి వాతావరణ పారామితులు భూమివాతావరణ పరస్పర చర్యల ద్వారా నేరుగా ప్రభావితమయ్యే అత్యల్ప వాతావరణ పొర కూడా దశల వారీగా మారుతుంది. గాలి నాణ్యతను ప్రభావితం చేస్తుంది. ఇలావుంటే, వాతావరణ కాలుష్యమే తరచు లా నినా పరిస్థితులు ఏర్పడడానికి ప్రధాన కారణమని అంతర్జాతీయ వాతావరణ పరిశోధనా సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. తక్షణ చర్యలు చేపట్టకపోతే, వాతావరణం విపరీత ధోరణులను ప్రదర్శిస్తూ, మానవాళికి సవాళ్లు విసురుతుందని హెచ్చరిస్తున్నాయి. లా నినాలో, వాణిజ్య గాలులు బలపడతాయి. వెచ్చని నీటిని పశ్చిమ పసిఫిక్ వైపు నెట్టివేస్తాయి. తూర్పు పసిఫిక్‌లో దిగువ నుండి చల్లటి నీరు పెరుగుతుంది, దీని వలన ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. లా నినా ఏర్పడడానికి నిర్దిష్టమైన కాలంగానీ, కాలచక్రంగానీ ఏదీ లేదు. మరో రకంగా చెప్పాలంటే క్రమరహిత చక్రాలలో సంభవిస్తుంది. సాధారణంగా రెండు నుండి ఏడు సంవత్సరాల వరకు ఉంటుంది. తరచుగా ఎల్ నినో పరిస్థితుల తర్వాత సంభవిస్తుంది. ఇటీవల, లా నినా దశ 2020 నుండి 2023 వరకు, అంటే, 2023ఎల్ నినో దశకు మారడానికి ముందు వరకూ కొనసాగింది. విపరీతమైన ఉష్ణోగ్రతలుఐ అసాధారణ వాతావరణ నమూనాలు వంటి కారణాలతో లా నినా ప్రభావాల తీవ్రత అధికమవుతుంది. ఆసియా ఖండానికి సంబంధించి, భారతదేశంలో, లా నినా జులై నుండి సెప్టెంబరు వరకు రుతుపవనాల సగటు కంటే ఎక్కువ వర్షపాతానికి దారితీస్తుందని అంచనా. దీని ఫలితంగా ఇండోగంగా మైదానాలలో పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గవచ్చు. కానీ వరి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్‌తోసహా ఆగ్నేయాసియాలో, లా నినా సగటు కంటే ఎక్కువ వర్షపాతాన్ని తెస్తుంది, వరదలకు కారణమవుతుంది. అయితే బియ్యం, పామాయిల్ ఉత్పత్తిని పెరుగుదలకు దోహదపడుతుంది. దక్షిణ అమెరికా విషయానికి వస్తే, దక్షిణ బ్రెజిల్, ఉరుగ్వే, ఉత్తర అర్జెంటీనా దక్షిణ బొలీవియాలో, లా నినా సగటు కంటే తక్కువ వర్షపాతం కలిగిస్తుంది , ఇది కరువుకు దారితీస్తుంది సోయాబీన్స్, మొక్కజొన్నలను ప్రభావితం చేస్తుంది. అయితే, దీనికి విరుద్ధంగా, ఉత్తర బ్రెజిల్, కొలంబియా, వెనిజులా, ఈక్వెడార్, పెరూలోని కొన్ని ప్రాంతాల్లో తడి పరిస్థితులు ఉంటాయి. ఇది సంభావ్య వరదలకు దారి తీస్తుంది. ఇక, తూర్పు ఆఫ్రికాలో, లా నినా డిసెంబర్–జనవరిలో పొడి పరిస్థితులను తెస్తుంది. ఫిబ్రవరి–మార్చిలో పండించిన పంటలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దక్షిణాఫ్రికాలో, లా నినా వేసవిలో సగటు కంటే ఎక్కువ వర్షపాతానికి కారణమవుతుంది, మొక్కజొన్న, జొన్న, గోధుమలు, సోయాబీన్ అధిక దిగుబడితో వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుస్తుంది. ఓషియానియా ప్రాంతాన్ని పరిశీలిస్తే, ఆస్ట్రేలియాలో, ఈ ప్రాంతం ఉత్తర, తూర్పు ప్రాంతాలలో అధికసగటు వర్షపాతం సంభవిస్తుంది, తరచుగా తీవ్రమైన వరదలతో ముడిపడి ఉంటుంది. ఉత్తర అమెరికాకు సంబంధించినంత వరకూ అమెరికాలో లా నినా దక్షిణాదిలో పొడి పరిస్థితులను కలిగిస్తుంది. అలాస్కా, కెనడాతో సహా ఉత్తరాన తడి, తుఫాను వాతావరణాన్ని కలిగిస్తుంది.



- ☞ మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్రంలోని నీటి ఉష్ణోగ్రతలో కాలానుగుణ మార్పులతో కూడిన పునరావృత వాతావరణ నమూనాను ఎల్ నినోసదరన్ ఆసిలేషన్ (ఇఎన్ఎస్ఒ) అంటారు. ఇది ప్రపంచ వాతావరణ నమూనాలను ప్రభావితం చేస్తుంది. కాగా, చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, ఎల్ నినో అనే పదాన్ని దక్షిణ అమెరికా మత్స్యకారులు వెచ్చని క్రిస్మస్ జలాల కోసం ఉపయోగించారు. సర్ గిల్బర్ట్ వాకర్ సదరన్ ఆసిలేషన్‌ను కనుగొన్నాడు. 1960లలో వాతావరణ పరిస్థితులకు సముద్ర పీడన మార్పులను అనుసంధానం చేసి, ఇఎన్ఎస్ఒ పదం వాడుకలోకి వచ్చింది.
- ☞ **ఎల్ నినో:** మధ్య/తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉష్ణోగ్రతలు వేడెక్కడం , తూర్పు గాలులను బలహీనపరుస్తుంది. ఇండోనేషియాలో వర్షపాతం తగ్గుతుంది. మధ్య/తూర్పు పసిఫిక్‌లో అది పెరుగుతుంది.
- ☞ **లా నినా:** మధ్య/తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉష్ణోగ్రతలను చల్లబరుస్తుంది. తూర్పు గాలులను బలపరుస్తుంది. ఇండోనేషియాలో వర్షపాతం పెరుగుతుంది. మధ్య/తూర్పు పసిఫిక్‌లో తగ్గుతుంది.

ప్రమాదంలో హిమానీనదాలు!

హిమానీనదాలు లేదా గ్లాసియర్స్ కరిగిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఏటా మార్చి 21వ తేదీన ప్రపంచ హిమానీనదాల దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఐక్యరాజ్య సమితి (యుఎన్) ఈ ఏడాదిని అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరంగా ప్రకటించడంతో, వీటి పరిరక్షణ చర్చనీయాంశమైంది. శతాబ్దాలుగా కుదించబడిన మంచు నుంచి ఏర్పడి, నెమ్మదిగా కదిలే అతిపెద్ద మంచు ద్రవ్యరాశిని హిమానీనదాలుగా పేర్కొంటారు. ఇవి గురుత్వాకక్షరణ కారణంగా కదులుతాయి. నేడు కనిపించే హిమానీనదాలు సుమారు 10000 సంవత్సరాల క్రితం నాటి మంచు యుగంలో భూమిని కప్పి ఉంచిన మంచు పలకల అవశేషాలు. భూమి చరిత్రలో హిమానీనదాలు ఏర్పడినప్పుడు, హిమనదీయ కాలలు లేదా మంచు యుగాలు, హిమానీనదాలు కరిగిపోయినప్పుడు అంతర్ హిమనదీయ కాలాలు ఏర్పడినట్టు చెప్తారు. చాలా హిమానీనదాలు గ్రీన్‌లాండ్, కెనడియన్ ఆర్కిటిక్, అంటార్కిటికా వంటి ధ్రువ ప్రాంతాల్లో కనిపిస్తాయి. అధిక అక్షాంశాల కారణంగా అక్కడ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండడమే అందుకు కారణం. ఉష్ణమండల హిమానీనదాలు భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న పర్వత శ్రేణులలో, దక్షిణ అమెరికాలోని అండీస్ వంటి ఎత్తయిన ప్రదేశాలలో ఉన్నాయి. భూమిపై ఉన్న నీటిలో సుమారు 2 శాతం హిమానీనదాలలో నిల్వ ఉంటుందని అంచనా. ఈ హిమానీనదాలకు ఇప్పుడు ప్రమాదం ముంచుకొస్తున్నది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల కారణంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. ధ్రువాల వద్ద కూడా ఈ పరిస్థితి తప్పడం లేదు. సత్వర చర్యలు చేపట్టకపోతే, నవిష్యత్తులో హిమానీనదాలు కరిగిపోయి, సముద్రంలో కలుస్తాయి. 2100 నాటికి ప్రపంచంలోని హిమానీనదాలలో మూడింట ఒక వంతు కరిగిపోతుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హిమానీనదాలు కొన్ని లక్షల మందిని, ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రాంతాల వారికి ప్రధాన తాగునీటి వనరు. వేసవి చివరిలో ఆము దర్యా నదీ ప్రవాహంలో ఉండే నీటిలో 27 శాతం వరకూ హిమానీనదాలు శీతాకాలంలోనే అందిస్తాయి. బొలీవియా రాజధాని లా పాజ్ పొడికాలాల్లో నీటి కోసం హిమానీనదాలపై ఆధారపడుతుంది. మన దేశంలో లడఖ్‌లో మంచు స్థూపం అని పిలిచే కృత్రిమ హిమానీనదాలు శీతాకాలంలో నీటిని నిల్వ చేస్తాయి. వసంతకాలంలో ఆ నీటిని విడుదల చేస్తాయి. చల్లని ఏడారి ప్రాంతంలో పంటలకు కీలకమైన నీటిని అందిస్తాయి. ఫైటోప్లాంక్టన్ పెరుగుదలకు తోడ్పడే పోషకాలను గ్లేసియర్స్ విడుదల చేస్తాయి, ఇది సముద్ర జీవవైవిధ్యం మరియు మత్స్య సంపదను ప్రభావితం చేసే జల ఆహార గొలుసుల పునాదిని ఏర్పరుస్తుంది. ఇంతటి ప్రాధాన్యంగల గ్లేసియర్స్ క్రమంగా ప్రమాదంలో పడుతున్నాయి. సుమారు 210,000 హిమానీనదాలను ట్రాక్ చేసే వరల్డ్ గ్లేసియర్ మానిటరింగ్ సర్వీస్ (డబ్ల్యుజిఎంఎస్) 1976–2023 మధ్య పెద్ద ఎత్తున గ్లేసియేషన్‌ను గుర్తించింది. ఎదూ కుష్ హిమాలయన్ క్రయోస్ఫియర్ ప్రపంచ సగటు రేటు కంటే రెండింతలు వేడెక్కుతోందని ప్రకటించింది. గ్లేసియల్ లేక్ ఔట్బరస్ట్ ఫ్లడ్ వంటి హిమనదీయ విపత్తులకు ఈ పరిణామం కారణమవుతుందని తెలిపింది. పర్యావరణ శాస్త్రవేత్తలు సైతం వాతావరణ మార్పులపై ప్రపంచ దేశాలను హెచ్చరిస్తున్నారు. హిమానీనదాలు కరుగుతున్న స్థాయి పెరిగితే, ప్రకృతి విపరీతాలు, ప్రళయాలు సంభవిస్తాయని, కాబట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.

అగ్రిస్టాక్

కిసాన్ కి పెహచాన్ సేవలు, పథకం అమలు వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి రైతు కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)గా రూపొందించారు. ఇది మూడు కీలక భాగాలను కలిగి ఉంటుంది. రైతుల రిజిస్ట్రీ, జియోరిఫరెన్స్ గ్రామ మ్యాప్‌లు, సాగు అయ్యే పంట రిజిస్ట్రీ. అగ్రిస్టాక్ కీలకమైన అంశం ఏమిటంటే రైతులకు విశ్వసనీయమైన డిజిటల్ గుర్తింపుగా ఉపయోగపడే ఆధార్ కార్డ్ మాదిరిగానే 'రైతు ఐడీ'ని ప్రవేశపెట్టడం. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల రూపొందించి, నిర్వహించే ఈ ఐడీలు భూమి రికార్డులు, పశువుల యాజమాన్యం, పంట సాగు, పొందే ప్రయోజనాలతో సహా వివిధ రైతు సంబంధిత డేటాకు అనుసంధానం అయి ఉంటుంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖతో 19 రాష్ట్రాలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ద్వారా అగ్రిస్టాక్ అమలు పురోగమిస్తోంది. రైతు ఐడీల రూపకల్పనకు, డిజిటల్ క్రాప్ సర్వేను పరీక్షించడానికి ఆరు రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్ (ఫరూఖాబాద్), గుజరాత్ (గాంధీనగర్), మహారాష్ట్ర (బీడ్, హర్యానా (యమునా నగర్), పంజాబ్ (ఫతేగఢ్ సాహిబ్), తమిళనాడు (విరుధ్‌నగర్) పైలట్ ప్రాజెక్టులు చేపట్టారు.

ఉపాధి కల్పన

డిజిటల్ అగ్రికల్చర్ మిషన్ కింద, డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డీజీసీఈఎస్) వ్యవసాయ ఉత్పత్తి ఖచ్చితత్వాన్ని పెంపొందించడానికి ఖచ్చితమైన దిగుబడి అంచనాలను అందించడానికి పంట కోత ప్రయోగాలకు ఉపయోగిస్తారు. ఈ మిషన్ వ్యవసాయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని, దాదాపు 2,50,000 మంది శిక్షణ పొందిన స్థానిక యువతకు, కృషి సఖిలకు అవకాశాలను కల్పిస్తుందని భావిస్తున్నారు. డేటా అనలిటిక్స్, ఏఐ, రిమోట్ సెన్సింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, ఈ మిషన్ రైతులకు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలు, సలహాలు ఇవ్వడంతోపాటు అన్ని రకాల సేవలను అందిస్తారు.

ఆరోగ్యశ్రీకి రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి డిమాండ్

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ బకాయిలని, ఒక వెయ్యి కోట్లు విడుదల చేసి ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ల పల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశా రు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రుల పెండింగ్ బకాయిలు దాదాపు 1000 కోట్లు చెల్లించకపోవడంతో రోగుల ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్టు ఆస్పత్రులలో ముందు బోర్డులు పెట్టడంతో రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరణ చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ సిఇఒకు ఆరోగ్యశ్రీ సేవలు ఈ నెల 10 నుండి గుండు బకాయలు చెల్లించకపోవడంతో నడపలేమని ఈమెయిల్ ద్వారా ప్రైవేట్ ఆస్పత్రుల రాష్ట్ర శాఖ తెలపడం జరిగిందని, వారితో అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్చించి మొండి బకాయిలను చెల్లించాలని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొండి బకాయిలు దాదాపు 9 నెలల పాటు చెల్లించకపోవడంతో 672 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి బకాయిలు రెండు నెలలకు ఒకసారి కొద్దికొద్దిగా చెల్లిస్తున్నా బకాయిలు పెరిగి పోవడం జరిగిందని తెలిపారు. త్వరితగతిన రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవలను అందించడం కోసం ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించి రోగులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కర పల్లి శ్రీనివాసరావురాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి : సిపిఐ

ప్రజాపక్షం/గుండాల: నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె. రాజయ్య, మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్యలు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల పరిధిలోని సుద్దాల గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించాలని, రైతులకు నాణ్యమైన 24 గంటల విద్యుత్ అందించి, బిక్కేరు వాగు నుండి సాగునీరు, త్రాగు నీరు అందించాలని, మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకొన దళారుల నుండి రైతులను రక్షించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ఆరు గ్యారంటీలలను అమలు చేయాలని, ఈనెల 26 నుండి ప్రారంభమయ్యే రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణి పథకాలలో భాగంగా అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకాలను అందించే విధంగా ప్రభుత్వం పారదర్శకతతో గ్రామ సభల్లో లబ్దిదారుల జాబితాను ప్రవేశపెట్టాలని వారు కోరారు. రుణమాఫీ కాని రైతులు చాలా మంది ఉ న్నారని వారికి త్వరితగతిన రుణమాఫీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారంలో రైతు సంఘం మండల మహాసభను అనంతారం గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని రైతులు ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమాయ కార్యదర్శి పడకంటి సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కొమురయ్య, మండల కార్యవర్గ సభ్యులు జోసెఫ్, బిక్షం, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే గ్రామసభలు

సంక్షేమ పథకాల ఎంపికలో నిజమైన పేదలకు అన్యాయం : మర్రి వెంకటస్వామి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కేవలం రాజకీయ ప్రాబల్యం కోసం, స్థానిక సంస్థల ఎన్నికల లబ్ధికోసం కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో ప్రజలను మభ్యపెడుతోందని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి దుయ్యబట్టారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల వద్దకు గ్రామసభలు పేరుతో ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేయడమే తప్ప అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. నిజమైన పేద అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు అధికారులకు పూర్తి బాధ్యతలు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రయోజనాలకు వాడుకోవడం తగదన్నారు. గతంలో ప్రజాపాలనకు చేసిన ధరఖాస్తులనే గ్రామసభల్లో జాబితా తయారు చేసారని, అందులోనూ నిజమైన అర్హులైన వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు 30 శాతమే చోటు కల్పించారన్నారు. కాంగ్రెస్ మంత్రులు అర్హులందరికీ మంజూరు చేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. గతంలో మీసేవలో ధరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేశారన్నారు. మిగిలిన వారికి రాలేదన్నారు. ఈ పథకాల లబ్ధిచేకూరే ఫలితంగా గ్రామాల్లో గందరగోళంతో పాటు కొట్టుకొనే స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పేదవారికి సంక్షేమ పథకాలు ఎంపిక చేయలేదని వాపోయారు. ఈ గ్రామ సభలను మరోసారి రెండో విడత చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతూ ప్రజలను మాయ చేస్తోందన్నారు. ఇవి కేవలం ప్రచారాల ఆర్భాటమేనన్నారు. కాంగ్రెస్ నిర్వాకంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు మరిచినందుకు ఆ పార్టీని ఓడించిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదేమాదిరిగా చేస్తుండడాన్ని ప్రజలు గమనిస్తున్నారు జాగ్రత్త అని హెచ్చరించారు. ఎన్నికల హామీల్లో బాగంగా ఇచ్చిన హామీలన్నీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెన్షన్‌లు పెండింగ్‌లో ఉంచడం వల్ల గ్రామాల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక లోటు బడ్జెట్ అని చెప్పుకుంటూనే నియోజకవర్గంలో 3500 ఇండ్లు మంజూరు చేస్తామని హామీలిస్తున్నారని, ఇప్పటిరీతిన హామీలిస్తూ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను లబ్ధి చేకూర్చకపోతే కాంగ్రెస్‌ను దోషిగా నిలబెడతామన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నప్పటికీ ఆర్‌టిసిలో కార్గోను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పజెప్పారన్నారు. అందులో పాత హమాలీలను తీసివేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కొత్తగా హమాలీల కోసం లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా మంత్రి ఉండి ఎందుకని ప్రశ్నించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు సిపిఐ ఆద్వర్యంలో సమరశీల పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల్లో బాగంగా యేడాది పొడవునా గ్రామ గ్రామాన కేంద్ర రాష్ట్ర వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ హక్కుల సాధనకు ఉద్యమ కార్యచరణ చేపడతామన్నారు. ఫిబ్రరి నుంచి శాఖ, మండల, జిల్లా మహాసభల నిర్వహణకై నిర్మాణ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, టేకుమళ్ళ సమ్మయ్య, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బ్రాహ్మండ్ల యుగేందర్, నాయకులు నల్లగొండ శ్రీనివాస్ తదితరులున్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం డిమాండ్

ప్రజాపక్షం / పాల్వంచ టౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభల్లో సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా లాంటి పథకాలు రాజకీయాలకతీతంగా అర్హులైన అందరికీ ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. గురువారం మండల పరిధి లక్ష్మి దేవిపల్లిలో సిపిఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించి అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ..సంక్షేమ పథకాలు అర్హులకు కాకుండా ఉన్న వాళ్లకే మళ్లీ మళ్లీ ఇల్లు వచ్చాయని ప్రజలు అంటున్నారని దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారందరికీ షరతులు లేకుండా సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ.. భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిందని, ఇప్పటి వరకు దేశంలో ఏ పార్టీ 100 సంవత్సరాల చరిత్ర కలిగినది లేదన్నారు. ప్రజలలో మమేకమై అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో 10లక్షల ఎకరాలు భూములు పేదలకు సిపిఐ పంచిపెట్టిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని వారి తరపున పోరాడి సమస్య పరిష్కరించేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం సిపిఐ గ్రామ శాఖ కమిటీని 13మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా భూక్యా విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా వేములపల్లి శేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎస్.గిరి, వల్లపు యాకయ్య, ఎస్.కె.లాలాపాషా, ఖరీమ్, సీనియర్ నాయకులు సోమయ్య, నందిగామ నరసింహరావు, కల్లోజి కిరణ్ కుమార్, ఎరుకుల రాకేష్, మిట్టపల్లి సుందరం, పఠాన్ జానీ, వెంకటరమణ, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

4వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

ఎఐటియుసి జిల్లాకార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

ప్రజాపక్షం/ నల్లగొండ : విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్‌ను తక్షణమే విలీనం చేయాలని ఎఐటియుసి జిల్లాకార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సర్కిల్ విద్యుత్ కార్యాలయం వద్ద టివిఎసి జెఎసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టిజన్స్ రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి నాల్గవ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో గత 20 సంవత్సరాలుగా ఎవరికి ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తున్నామని అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ ఆర్డర్ పేరుతో అన్యాయం చేశారని అన్నారు. ఆర్టిజన్‌లను విద్యార్హతలను బట్టి జూనియర్ లైన్ మెన్‌లుగా డిప్లోమా వారికి సబ్ ఇంజనీర్లుగా ఆఫీస్ సబార్డినేటర్‌లుగా జూనియర్ అసిస్టెంట్‌గా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని

అబద్ధాలతో ప్రజలను రెచ్చగొట్టొద్దు

బిఆర్ఎస్ నేతలపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ధ్వజం

ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : ఎన్నికల ముందు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ అశోక హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. నాలుగు నెలలు ఆలస్యమైనా ఇచ్చిన హామీలునెరవేరుస్తున్నామని,పథకాలు అందే తరుణంలో ప్రజలు బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు అని కోరారు. లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, బీఆర్ఎస్ నాయకులు గ్రామ సభలను డిస్టర్బ్ చేస్తూ, ప్రజలను రెచ్చగొడుతున్నారని,వారు పదేళ్లలో చేసింది లేదు, తా ము చేస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారని అన్నారు. అసలు లబ్ధిదారుల లిస్ట్ ఫైనల్ కూడా కాలేదని, ప్లాన్ ప్రకారం గ్రామసభలను అడ్డుకునే పనిలో గులాబీ శ్రేణులుఉన్నారన్నారు. పేద ప్రజలకోసం రేషన్ కార్డులు, ఇండ్లు, పెన్షన్లు ఇస్తున్నామని, అబద్ధాలతో ప్రజలను రెచ్చగొట్టే వెదవలను కట్టేసి కొట్టండి అని పిలుపునిచ్చారు.అర్హులందరికీ సం క్షేమ పథకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది అని, జనవరి 26 నుండి పథకాలు అర్హులకు అందుతాయని, దీంతో తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ చాప్టర్ క్లోజ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో మిగిలిన నలుగురు మా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, బావా బామ్మర్దులు ఇద్దరు తలుపులు పెట్టుకొని ఇంట్లో కూర్చోవాల్సిందేనన్నారు.కాంగ్రెస్‌కు మంచిపేరు వస్తుం టే గులాబీ పార్టీ ఓర్చుకోవట్లేదని,గ్రామ సభల్లో గొడవలు చేసేది బీఆర్ఎస్ నాయకుల తొత్తులు మాత్రమేనని,పేదలను అయోమయానికి గురి చేసి పబ్బం గడుపుతున్నారని అన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, టిపిసిసి కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు, నాయకులు బత్తిని శ్రీనివాస్, కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పోరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, మామిండ్ల రాజు, గుంటి శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, మానస రాంప్రసాద్, విజయ లక్ష్మి సురేందర్, మాజీ కార్పొరేటర్లు నసీం జహాన్, తాడి శెట్టి విద్యాసాగర్, మహమ్మద్ అబుబాకర్, వీరగంటి రవీందర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, బంక సరళ, డాక్టర్ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

60వ డివిజన్‌లో..

గ్రేటర్‌లోని 60 డివిజన్ లో ప్రజా పాలన వార్డు సభను గురువారం ప్రారంభించారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర అధికారులుమాట్లాడారు. ఎమ్మెల్యే నాయిని,మేయర్, కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ నాలుగు పథకాలకు సంబంధించి సభల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ మున్సిపల్ పరిధిలో ఉన్నందున వ్యవసాయ యోగ్యం కానీ భూములు ఉండడంతో రైతు భరోసా వర్తించదని పేర్కొన్నారు.అదేవిధంగా సామాజిక ఆర్థిక సర్వే సందర్భంగా తమకు రేషన్ కార్డు లేదని పేర్కొన్న వారి వివరాల పరిశీలిన దాదాపు పూర్తయిందని చెప్పారు. రేషన్ కార్డు లేని వారు ఉన్నట్లయితే వార్డు సభలలో అలాంటి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యలను అధిగమిస్తేనే విజయం

ప్రజాపక్షం/కాజీపేట : కాజీపేటలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హనుమకొండ జిల్లా సైకాలజిస్టుల సంఘం అధ్యక్షురాలు,కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ గంగిశెట్టి శ్రీవిద్య పరీక్ష పే చర్చ అనే కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో పరీక్షలలో తలత్తేటువంటి సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలి, చురుకుగా ఎలా ముందుకు వెళ్లాలి, ఒత్తిడి, కుతూహలం, డిప్రెషన్ లాంటి మానసిక సమస్యల నుండి ఏ అధిగమించాలని, మానసిక ఒత్తిడి లేని చదువులో ఉండే మాధుర్యము, చదువు అంటే ఒక సైన్స్ అని హాయిగా ఆడుతూ పాడుతూ ఏ విధంగా నేర్చుకుంటూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలో తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ. వెంకటేశ్వర్లు, సీనియర్ ఉపాధ్యాయులు బి శ్రీనివాస్, బి సునీత, బికే విద్యావతి, శైలజ, విద్యావతి, అనిత,అలివేలు మంగ తదితర ఉపాధ్యాయ బృందం 50 మంది పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్ఐవి నియంత్రణపై చైతన్యం

ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః హైరిస్క్ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాల ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలను చైతన్యపరచాలని ములుగు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు అన్నారు. ములుగు ప్రధాన ఆసుపత్రి మీటింగ్ హాల్‌లో ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల ఐసిటిసి కౌన్సిలర్లకు, లింక్ వర్కర్లకు, ఎన్‌జివోలలో పనిచేస్తున్న సిబ్బంది సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మాట్లాడుతూ హెచ్ ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలను చైతన్యపరచాలని సిబ్బందిని కోరారు.జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, గర్భినేతరులకు స్క్రీనింగ్ పరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలనిసూచించారు. జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ కంట్రోల్, టిబి నియంత్రణ, కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ చంద్రకాంత్, ఇంచార్జి డెమో సంపత్, జ్యోతి, సారయ్య, సాయి, ములుగు జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల దిశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మున్నూరు కాపు' క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ హనుమకొండ టౌన్ : అటవీ, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ ఇంటి వద్ద జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ను మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు. సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కటకం పెంటయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కనుకుంట్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి పేరుకారి శ్రీధర్, కోశాధికారి పూజారి సత్యనారాయణ, మంద రాకేష్, మేడిది మధుసూదన్, పల్లం పద్మ రవి, సతీష్, డివిజన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాపక్షం/పర్వతగిరి: విద్యార్థులు ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని మూడెత్తులతండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, మూడెత్తుల తండా నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యుజిసి కర్ర పెత్తనాన్ని వ్యతిరేకించాలి

ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ

ప్రజాపక్షం/కెయు క్యాంపస్ : పాలకుల నిర్లక్ష్యం వల్ల నిర్వీర్యమైన రాష్ట్ర విశ్వవిద్యాలయాలను పునరుద్ధరించకుండా కేవలం కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నూతన ముసాయిదా బిల్లు తెచ్చిందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అభిప్రాయపడ్డారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌లో విశ్రాంత ప్రొఫెసర్లు, కేయూ విద్యార్థి పరిశోధక జాక్ సభ్యులు పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విశ్వవిద్యాలయాలను గాలికి వదిలేసి, నిర్లక్ష్యం చేస్తూ గ్రాంట్లను పరిమితం చేసి రాజకీయ నాయకుల ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు అనుమతులు ఇచ్చి ప్రోత్సహించడం ప్రారంభమైందన్నారు. ఇదే క్రమంలో యూనివర్సిటీల గ్రాంట్స్ కమిషన్ కూడా గత 15 సంవత్సరాల నుండి రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు తన ఆర్థిక సహాయాన్ని, పరిశోధనా ప్రాజెక్టులను, పరిశోధకులకు కల్పించే ఫెలోషిప్స్ పూర్తిగా తగ్గిస్తూ కేవలం కర్ర పెత్తనమే చెలాయిస్తూ వస్తున్నదని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ 2020 కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానంలో భాగంగా యూజీసీ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియమాక నియమావళిని మార్చడం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు కోర్సులలో విద్యార్థుల ప్రవేశాలకు నిబంధనలు సడలిస్తూ అనేక సూచనలు చేస్తూ ముసాయిదా బిల్లును విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కాల రాయడం కొరకే చేస్తున్న పని అని మండిపడ్డారు. ప్రొఫెసర్ ఎం సారంగపాణి మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రకారం విద్యా రంగం ఉమ్మడి జాబితాలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం చాలీచాలని నిధులు ఇస్తున్నప్పటికీ విశ్వవిద్యాలయాలు నాణ్యమైన సమకాలీన సమాజానికి ఉపయోగపడే విద్య అందించలేక పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారని, ప్రస్తుతం రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం ప్రకారం గవర్నర్ ఆమోదంతో ఉపకులపతులను నియమించే విధానం అమలులో ఉందని ప్రస్తుత యుజిసి ముసాయిదా బిల్లు రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను రాష్ట్ర గవర్నర్ కి కట్టబెట్టే ప్రతిపాదనలు ముందుకు తెచ్చిందన్నారు.సమావేశంలో రిటైర్డ్ ఆర్డిఓ జాన్సన్, డాక్టర్ మంద వీరస్వామి, డాక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అర్హుల గుర్తింపు

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి : ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో గ్రామసభలోగ్రామస్తుల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు పథకాల ఎంపికలో నిర్వహించిన సర్వే లోఅర్హులైన లబ్ధిదారులను గుర్తించిన లిస్ట్‌లో పేర్లు రాని వారు అధైర్య పడవద్దు అని, ప్రస్తుతం గ్రామ సభలో ఈ నాలుగు పథకాలకు సంబంధించి కౌంటర్లను ఏర్పాటు చేయడమైనదని, మిగిలిపోయిన లబ్ధిదారులుఉన్నట్లయితే మళ్లీ దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందన్నారు. సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా వాటిని పరిష్కరిస్తానన్నారు. గంగాదేవిపల్లికి రెగ్యులర్ పంచాయితీ సెక్రెటరీ లేక ప్రగతి మరుగున పడిపోతుందని ప్రజలు కోరిన విధంగా పర్మనెంట్ పంచాయతీ సెక్రెటరీ నియమించుటకు కృషి చేస్తానని కలెక్టర్ అన్నారు.అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఇందిరమ్మ ఇండ్ల నోడల్ అధికారి రాంరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ. మండల ప్రత్యేక అధికారి సురేష్, మండల తాసిల్దార్ మహ్మద్ రియాజ్ ఉద్దీన్ , సమంత అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సొంత మండలానికి మున్సిపల్ నిధులు మళ్లింపు

ఎంఎల్ఏపై మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్ధు ఆరోపణ

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి మున్సిపల్ అంబేద్కర్ సెంటర్ అభివృద్ధికి కేటాయించిన రూ.4 కోట్ల నిధులను ఎమ్మెల్యే సొంత మండలం అయిన గణపురం చెరువు సుందరీకరణకు ఆ నిధులను మళ్లించడం జరిగిందని భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్.వెంకటరాణి సిద్ధు ఆరోపించారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలు భూపాలపల్లి మున్సిపల్ పాలకవర్గ పదవి కాలం ముగిసిన సందర్భంగా అభివృద్ధికి సహకరించిన పట్టణ ప్రజలకు, అధికారులకు నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భూపాలపల్లి మున్సిపాలిటీలో అంబేద్కర్ సెంటర్ అభివృద్ధి కోసం అప్పటి ఎమ్మెల్యే మా నాయకుడు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి రూ.10 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు సెంట్రల్ లైటింగ్ తో ఏర్పాటు చేయడం కోసం గతంలోనే శంకుస్థాపనలు చేయడం జరిగిందని, పనులు జరుగుతున్న క్రమంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగిందని, ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పనులను ఆపివేసి నాలుగు కోట్ల డబ్బులను మున్సిపాలిటీకి సంబంధంలేని గణపురం చెరువు సుందరీ కారణకు నిధులను వాడడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజల అభిప్రాయాన్ని కాదనకుండా మున్సిపల్ నిధులను తన సొంత మండలంలో గణపురం చెరువుకు కేటాయించుకోవడం సరైనది కాదని మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి అన్నారు. గత సంవత్సర కాలం గా 30 వార్డుల్లో ఉన్న అనేక అభివృద్ధి పనులు కుంటు పడ్డాయని, గతంలో ఉన్న పనులకే మళ్లీ శంకుస్థాపనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ ప్రస్తుత ఎమ్మెల్యే పట్టిస్తున్నారన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సుమారు లక్ష జనాభా కలిగి ఉందని ప్రజలకు అవసరపడే నాలుగు లైన్ల రోడ్డు వైడనింగు పనులను ఆపివేసి కాంట్రాక్టర్‌ను మార్చి ఎస్‌విసి కంపెనీకి కమిషన్ల కోసమే పనులను మళ్లీ అప్పజెప్పడం జరిగిందన్నారు. భూపాలపల్లి అం బేద్కర్ సెంటర్ నుండి బస్టాండ్ సుభాష్ కాలనీ రామ్ నగర్ 2 ఇంక్లైన్ జంక్షన్ వరకు లారీలతో అనేక ఇబ్బందులు ప్రజలు పడుతున్నారని ఆ పనులను జరగకుండా చేసి ఆ నిధులను గణపురం చెరువు అభివృద్ధి పనులకు కేటాయించడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఇప్పటికైనా ఎమ్మెల్యే మళ్లించిన నిధులను కేటాయించి భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ అభివృద్ధి కోసం కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నూనె రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు కొత్త హరిబాబు, బద్ది సమ్మయ్య, మేకల రజిత మల్లేష్, ఎడ్ల మౌనిక శ్రీనివాస్, భానోత్ రజిత జుమ్మలాల్ కో ఆప్షన్ సభ్యురాలు బీతోజు వజ్రమని చారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ స్పందించరు.. పాలకులు పట్టించుకోరు!

వరంగల్ జిల్లా ఆరేపల్లి రైతుల వినూత్న నిరసన

ప్రజాపక్షం/వరంగల్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకోగా.. వరంగల్ జిల్లా ఆరేపల్లి గ్రామ రైతులు మాత్రం వినూత్నంగా జరుపుకున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ లో కోల్పోతున్న తమ భూములను కాపాడాలంటూ కలెక్టర్‌కు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని, పాలకులు సైతం పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ భూములు కోల్పోతున్న ఆరేపల్లి గ్రామ రైతులు గ్రామకూడలి వద్ద ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఆరేపల్లి గ్రామ శివారు ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ వద్ద ఇన్నర్ రింగ్ రోడ్డుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మాస్టర్ ప్లాన్ ప్రకటించింది. దానిని ప్రభుత్వం గతంలో ఖరారు చేసింది. అయితే అక్కడ అధికార పార్టీతో పాటు గత ప్రభుత్వంలో కీలక నేతగా వ్యవహరించిన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతకు సంబంధించిన భూములు ఉన్నాయి. నేతలకు చెందిన వ్యాపార, విద్యా సంస్థలు, నిర్మాణంలో ఉన్న విల్లా ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ లో వారు భూములు కోల్పోతున్నందున.. ఏకంగా మాస్టర్ ప్లాన్ నే మార్చేశారు. దీంతో అనేక మంది రైతులు జీవనాధారంగా ఉన్న తమ భూములను కోల్పోతున్నారు. ఆశాస్త్రీయంగా రూపొందించిన కొత్త మాస్టర్ ప్లాన్ తో.. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నా.. అధికారులు మాత్రం నేతల ఒత్తిళ్లతో.. కొత్త మాస్టర్ ప్లాన్ వైపే మొగ్గు చెబుతున్నారు. ముందుగా ప్రకటించిన మాస్టర్ ప్లాన్ కాకుండా కొత్తది అమలు చేస్తే.. తాము భూములు కోల్పోతున్నామంటూ స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారంతా కలిసి గత రెండు నెలలుగా అధికారుల ముందు తమ గోడు వెళ్ళగక్కుతున్నారు. ఎమ్మార్వో, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్ ను కలిసినా అధికారులు స్పందించడం లేదని, నేతలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై నిరసనలో భాగంగా.. భూములు కోల్పోతున్న రైతులంతా గురువారం ఆరేపల్లి గ్రామ కుడలిలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి తమ నిరసన తెలిపారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు.

కార్పొరేట్ల కోసం ప్లాన్ మార్పు..

గ్రామ రైతులు మాట్లాడుతూ.. రైతుల భూములకు ఇబ్బందులు లేకుండా ముందుగా ఇన్నర్ రింగ్‌రోడ్ మాస్టర్ ప్లాన్ ప్రకటించారని, కొందరు కార్పొరేట్ వ్యక్తుల కోసం పాత ప్లాను మార్చడంతో.. అనేక మంది రైతులు జీవనాధారమైన పంటలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్,స్థానిక ఎంఎల్ఏ,జిల్లా ఇన్చార్జిమంత్రికి ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం పాత మాస్టర్ ప్లాన్ ఖారారు చేయాలని డిమాండ్ చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:ఆసుపత్రి కి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కమార్‌సింగ్ ఆదేశించారు. గురువారం జిలాలోని డోర్నకల్, కురవి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. డోర్నకల్ మండల కేంద్రం, బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ విభాగం పరిశీలించారు. ప్రతి రోజు వైద్యం కోసం ఎంతమంది రోగులు వస్తున్నారని, ఆసుపత్రికి సంబంధించినవాహనాలు ఎన్ని ఉన్నా యి, ఎలా పనిచేస్తున్నాయి వాటి స్థితిగతులును అడిగి తెలుసుకున్నారు.అలాగే ఆసుపత్రిలో త్రాగునీటి పరిస్థితి ఎక్కడి నుండి వస్తుందనే వివరాలతో పాటుగా ప్రసూతి సేవల విభాగాలని కలెక్టర్ తని ఖీ చేశారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు ఆయ్యేటట్లు చూడాలన్నారు. అలాగే డోర్నకల్ మండలంలో జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న విద్య బోధనల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సబ్జెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి పిల్లలకు బోధించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతిలో అత్యుత్తమ పలితాలు సాధించాలని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భో జనంఅందించాలని, స్టడి రూంలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగాఉంచాలని,పాఠశాలలోమైనర్ రిపేర్లు ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పండుగలా వ్యవసాయం

ప్రజాపక్షం/ధర్మసాగర్ : ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన మహిళా రైతు కూలీలను గురువారంఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆప్యాయంగా పలుకరించారు. కూలీలు వేరుశెనగ చేనులో పనులు నిర్వహిస్తున్న క్రమంలో అటుగా వెళ్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి కారు ఆపి వారి వద్దకు వెళ్లారు. కూలీలతో ఆయన ముచ్చటించారు. పొలం పనులు ఏ విధంగా సాగుతున్నాయి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం రైతులకు పండగలా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి వివరించారు. అంతేగాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేసారని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా తమ వద్దకు వచ్చి కూలీల కష్టాలు తెలుసుకున్నందుకు వారు ఆనందం వ్యక్తం చేశారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని 23వ వార్డులో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న వార్డు సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగామాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా సబండ వర్గాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డు అందజేస్తామన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, టిపిఓ సునీల్, కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, సిరుప అనిల్, కాంగ్రెస్ నాయకులు ఇస్లావత్ దేవన్, బుర్ర కొమురయ్య, సాంబమూర్తి, కాంగ్రెస్ వార్డు ఇంచార్జ్ హఫీజ్ మహమ్మద్ ఉన్నారు.

గురుకులాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ప్రజాపక్షం/జనగామటౌన్: గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ఇక్కడ విద్యను పొందితే ఉన్నతంగా రాణించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కర్యాలయంలో గురుకులాల్లోని సీట్ల ప్రవేశానికి విద్యార్థుల సహాయార్థం ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు.

అర్హులను మరిచారు.. గ్రామసభల్లో నిరసన సెగ

ప్రజాపక్షం/గూడూరు: గ్రామసభలు గురువారం మూడవరోజుకు చేరుకున్నాయి. గ్రామసభల్లో అర్హతలేనివారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తూ అర్హులను వదిలేశారని కొంతమంది బాధితులు అధికారుల ముందు నిరసన వ్యక్తం చేశారు. గతంలో మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం డబ్బులు తీసుకుని పేర్లు ఇచ్చారంటూ ఆరోపణలు చేశారు.అధికారులు మాట్లాడుతూ ఎవరికైతే ఈ లిస్టులో పేర్లు

రైతుల అభ్యున్నతి కోసమే సహకార సంఘాలు

ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

ప్రజాపక్షం/పిట్లం: ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు రైతుల అభ్యున్నతి కొరకే పనిచేస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. ఆయన గురువారం పిట్లం మండలంలోని కారేగాం, చిల్లర్గి సహకార సంఘాల భవనాలను మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి, కుంట రమేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సహకారసంఘాల ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే రైతులు ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకువెళ్ళి వారికి అవసరమైన సహకారం అందించడమే సొసైటీల లక్ష్యం అన్నారు. భారతదేశంలోని ఆయా ప్రాంతాల్లో రకాలుగా రైతులకు ఇచ్చిన దాఖాలాలు ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే ఎంతో పేరుగాంచిన ఆనంద్ కోఆపరేటీవ్ సొసైటీ ద్వారా ఇప్పుడు పాలు, అమూల్ బటర్ , అమూల్ ప్రొడక్ట్స్ ఇలాంటి సహకారసంఘాల ద్వారానే ప్రారంభమైన ప్రపంచంలోనే అతిపెద్ద సహకారసంఘంగా ఎదిగాయని గుర్తు చేశారు. పిట్లం సొసైటీ చైర్మెన్ శపథంరెడ్డి, డైరెక్టర్లు అందరు కలిసి సొసైటీకి గొప్ప వనరులు ఇచ్చే బంగారు బాతులు అన్నారు. త్వరలోనే పిట్లంకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డిగ్రీతో పాటు ఇంజనీరింగ్ కళాశాలకు ప్రపోజల్ పంపించామని తెలిపారు. త్వరలోనే పిట్లం మద్దెల్‌చెర్వు రోడ్డు పనులు పూర్తి అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్‌రెడ్డి సొసైటీ సంఘాల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌మారేడు కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జంబిగె హన్మండ్లు, మాజీ ఏఎంసీ చైర్మెన్ కృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, డైరెక్టర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పట్ల అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలు అయోమయంలో ఉన్నారని, వారికి ఆ పథకాల గురించి వివరిస్తూ అవగాహన కల్పించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అధికారులకు సూచించారు. గురువారం పిట్లం మండలకేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా తదితర పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బిసి సంక్షేమసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జాతీయ బిసి సంక్షేమసంఘం కామారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మెన్ మార గంగారెడ్డి, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మెన్ కుంట రమేష్‌రెడ్డిలు గురువారం పిట్లం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కృష్ణారెడ్డి, దేవేందర్‌రెడ్డి, అడ్వకేట్ రాంరెడ్డి, సొసైటీ చైర్మెన్ ఒంటరి శపథంరెడ్డి, మాజీ జడ్పీటీసీ మురళిగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగ హన్మండ్లు, బీసీ సంఘం సభ్యులు జిల్లా ఉపాధ్యక్షుడు నీలకంటి సంతోష్, జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జీ ఆకుల లక్ష్మణ్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు సనపుల మధు, సోషల్ మీడియా ఇంచార్జీ అఫ్రోజ్, మరగల దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలకు ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్‌రావు ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/దండేపల్లి : మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేదలు అయిన సుద్దాల రాములు, జిల్లపల్లి శ్రీనివాస్, మర్సుకొల చందు, జుల లక్కయ్యలు వివిధ కారణాలతో అనారోగ్యం తో మృతి చెందగా ఒక్కో కుటుంబానికి 5000 వేల రూపాయల చొప్పున నాలుగు కుటుంబాలకు 20000 వేల రూపాల ఆర్థిక సహాయాన్ని మంచిర్యాల శాసనసభ్యుడు ప్రేమ్ సాగర్ రావు ఇవ్వగా ఇట్టి నగదును రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి గురువారం ఆయా కుటుంబాలకు అందచేశారు. ఈ కార్యక్రమం లో గ్రామ కమిటీ అధ్యక్షులు గొట్ల మహేందర్, ఎస్‌సి సెల్ అధ్యక్షులు అరెపల్లి రమేష్, జీళ్లపల్లి బాను చందర్, బల్లి కొండ రాజన్న, జంజిరాల రాజు, బుక్యా రవి, లెంకథి శేకర్ పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాట్ల అనుమతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల జిల్లాలో గుర్తించిన ఇసుక రీచ్‌లకు అదనంగా ఐదు రీచ్‌లు ఏర్పాటుకు అవసరమైన అనుమతుల కొరకు ప్రతిపాదనలు సమర్పించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి భూగర్భ గనుల శాఖ, భూగర్భ జల, పంచాయితీ, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, కాలుష్య నియంత్రణ శాఖ నిజమాబాద్ పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం, టిజిఎండిసి, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నూతనంగా ఐదు ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు పర్యావరణ అనుమతుల కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల, వేంపల్లి బ్లాక్ 1,2, నస్పూర్ మండలం తాళ్ళపల్లి, జైపూర్ మండలం ఇందారం ప్రాంతాలలో రీచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని, పర్యావరణ అనుమతుల కొరకు సమర్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల కళాశాలకు సహకారమందిస్తా: ఎమ్మెల్యే

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: బాలికల కళాశాలను తన వంతు సహకారమందిస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గురువారం సందర్శించారు. ఎమ్మెల్యేకు ముందుగా ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ రూ.40 వేల స్వంత డబ్బులతో మొరం వేయించి మొక్కలు పెంచారని తెలుసుకుని ప్రిన్సిపాల్‌ను అభినందించారు. అంతకు ముందు కలాశాలలోని మైదానం బురద గుంటలా ఉండేదని, కనీసం ప్రార్థన చేయడానికి విద్యార్థినులు నిలబడే పరిస్థితి లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయమై ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేకు విన్నవించారు. మొక్కల పెంపకం ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్డు, రెండు కూరలు అసాధ్యం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: కోడిగుడ్డు, రెండు కూరలు అందించలమేని డీఈఓకు ఒకరోజు టోకెన్ సమ్మె నోటీసు ఇవ్వటం జరిగిందని తెలంగాణ మధ్యాహ్న భోజన రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపునూరు చక్రపాణి అన్నారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓకు జనవరి 28న టోకెన్ సమ్మె చేస్తున్నట్లు సమ్మె నోటీసు ఇవ్వటం జరిగింది. జిల్లావ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం దగ్గరికి కార్మికులు తరలిరావలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు కూరలు పెట్టాలి, కోడిగుడ్డు తప్పనిసరి ఇవ్వాలని చెప్పి అధికారులు కార్మికులను ఒత్తిడి తీసుకొస్తున్నారని, దీంట్లో భాగంగా ప్రభుత్వం ఇచ్చేది 5 రూపాయలు కోడిగుడ్డుకు బయట మార్కెట్‌లో 7 నుండి 8 రూపాయలు ఒత్తిడి చేస్తున్నారనిదయచేసి ఈ విషయంపై పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సిన అవసరముందని కార్మికులు తప్పనిసరి రావలని కోరారు. కార్యక్రమంలో సోఫియా, సంగీత, సిద్ధమ్మ పాల్గొన్నారు.

13వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాపక్షం/నిజాంపేట్: నస్కల్ రోడ్డు నిర్మాణం కొరకు రిలే నిరాహార దీక్షలు నేటికి 13 రోజు చేరుకున్నాయి. స్కూల్ గ్రామ యువకులు రోడ్డు బాగు చేయాలని గత 13 రోజులుగా నిరాహార దీక్షలు చేపడుతున్న ప్రభుత్వానికి కానీ ఎలాంటి స్పందన లేదా అని ప్రజలు నిస్సహాయం వ్యక్తం చేశారు. రోడ్డు పనులు ప్రారంభించే వరకు దీక్షలు విరమించే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గయ్య, తీగల శ్రీనివాస్ గౌడ్, హబీబ్ శ్రీనివాస్, చంద్రయ్య, యాదవ రెడ్డి, అజయ్ గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గోదాం దగ్ధం

ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ పట్టణంలోని బస్ డిపో ఎదుట ఉన్న స్క్రాప్ గోదాం గురువారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్క్రాప్ గోదాంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి ఇది గమనించిన నిర్వాకులు అటువైపు నుంచి వెళ్తున్న ప్రజలు ఫైర్ ఇంజన్ కు సమాచారం ఇవ్వడంతో రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పి వేశాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, లతా రమేష్ యాదవ్, సంఘటన స్థలానికి చేరుకొని షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన స్క్రాప్‌ను పరిశీలించారు. బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తారని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదవాలి

కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం స్థానిక సోఫి నగర్ సమీపంలోని నిర్మల్ గ్రామీణం, సోన్ కేజీబీవీ పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు కీలక సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని నిశిత పరిశీలన జరిపారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు.కూరగాయలు, ఆహారం కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రతిరోజు భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన సరుకులు, నాసిరకం కూరగాయలను వినియోగించకూడదని, కోడిగుడ్ల నాణ్యతను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. నాసిరకమైన బియ్యం, వంట నూనె, ఇతర సరుకులు సరఫరా చేస్తే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని అన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం తరగతి గదిలో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మమేకమై వారికి అభ్యాసం, లక్ష్యాలు, సబ్జెక్ట్‌ల వారీగా పాఠాలు బోధించి సూచనలు చేసారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీల కోఆర్డినేటర్ సలోమి కరుణ,సుజాత, లతాదేవి, రాజు, అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాపక్షం/ఆర్మూర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సిఐ కొమ్ము స్టీవెన్‌సన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్ పోలీసులు నిజాంసాగర్ కెనాల్ వద్ద రూట్‌వాచ్ నిర్వహిస్తున్న క్రమంలో అంకాపూర్ వీధి నెంబరు 2 ఎస్‌సి కాలనికి చెందిన నూనె శ్రీకాంత్, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండకు చెందిన నూనె కిరణ్‌లు ఎండు గంజాయితో పట్టుబడ్డారు. 1.6 కెజిల ఎండు గంజాయితోపాటు టిఎస్ 16 ఈడబ్ల్యు 2441 బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనంచేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. పట్టుబడ్డ వారిని విచారించగా ఈ గంజాయిని ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ నుండి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి చుట్టుపక్కల గ్రామాలకు చిన్న చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమౌళి, గంగాధర్ గౌడ్, సాయిలు, మోహన్, దేవిదాస్, వికాస్ గౌడ్, నరేష్, సందీప్, శ్రీనివాస్, కవిత ఉన్నారు.

అర్హత గల ప్రతి ఒక్కరికీ పరిహారం

కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాపక్షం/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాలవరంగల్‌ఖమ్మం విజయవాడ జాతీయ రహదారి 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితుల వివరాలను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 384 కిలోమీటర్ల మేర ఉంటుందని, రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని, ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మొదటి జాబితాలో పరిహారం అందని అర్హత గల వారు సంబంధిత పత్రాలు, బ్యాంక్ పాస్ పుస్తకాలతో సంప్రదించినట్లయితే రికార్డులు పరిశీలించి సరిగ్గా ఉన్నట్లు నిర్ధారణ జరిగితే సంబంధిత లబ్దిదారుల నుండి అక్విటెన్సీ తీసుకొని నిర్దేశిత ధరల ప్రకారం పరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రధానాచార్యులు రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

6వ తరగతి ప్రవేశాలకు ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఇందల్వాయి మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 6వ తరగతిలో బాలికలకు 30 సీట్లు, బాలురకు 30 సీట్లు ఖాళీలున్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ లింక్ https://tsemrs. telanganga.gov.in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

స్కూల్ బస్సు బోల్తా..తప్పిన ప్రమాదం

ప్రజాపక్షం/మాక్లూర్: నవీపేట్ మండలంలోని సాహిత్ స్కూల్ బస్సు కమలాపూర్ వద్ద పంట పొలాల్లో ఒక్కసారిగా బోల్తపడడంతో విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం సాహితీ స్కూల్ బస్సు డ్రైవర్ క్లీనర్‌తో నడిపించి ప్రమాదానికి కారణమైనట్టు వారు తెలిపారు. దాదాపు బస్సులో ముప్పై మంది విద్యార్థులు ఉన్నారు. బోల్తాపడ్డ బస్సులోని విద్యార్థులను రైతులు వచ్చిబయటకు తీయడంతో స్వల్ప గాయాలతో విద్యార్థులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాహితీ స్కూల్ పై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ తెలిపారు.

మాక్లూర్‌లో కల్తీ మద్యం

ప్రజాపక్షం/మాక్లూర్: మాక్లూర్ మండలంలోని రేణుక వైన్స్‌లో కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైన్స్‌లో కింగ్‌ఫిషర్ కంపెనీ బీరులో చెత్తా చెదారాలు దర్శనమిచ్చాయి. దీంతో ఒక్కసారిగా మద్యం ప్రియులు అవాక్కయ్యారు. వైన్స్ యజమానికి తెలపడంతో మరో బీరు ఇస్తానంటు వారు తెలిపారు. ఇలాంటి కల్తీ మద్యం అమ్మకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని మద్యం ప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న రుణాలు సద్వినియోగం

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రజాపక్షం/ఆసిఫాబాద్: ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రుణలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో స్వయం సహాయక సంఘాలకు మంజూరైన 25.4 కోట్ల రూపాయల రుణ వితరణ చెక్కును మంచిర్యాల, ఆదిలాబాద్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్లు మురళీ మనోహర్ రావు, ప్రభుదాస్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం లతో కలిసి జిల్లా మహిళా సమాఖ్యకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తూ రుణ సౌకర్యాన్ని కల్పిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన పొందాలని తెలిపారు. గత 7 రోజులుగా సెర్ప్ సిబ్బంది, విఒఎలు, సిసిలు, ఎపిఎంలు అహర్నిశలు కృషిచేసి బ్యాంకు లింకేజీ ప్రక్రియను పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు. తీసుకున్న రుణాలను తిరిగి క్రమం తప్పకుండా చెల్లించాలని, బ్యాంకులకు ఎలాంటి బాకీ లేకుండా చెల్లింపులు జరపాలని తెలిపారు. సుమారుగా 22 కోట్ల రూపాయలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు వారు రుణాలు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోర్తేటి శ్రీదేవి ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనడం మహిళా సంఘాలకే కాకుండా జిల్లాకు గర్వకారణమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు డిపిఎం. రామకృష్ణ, డిఆర్‌పిలు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి, సంబంధిత అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మహిళా పోలీస్ స్టేషన్

ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్

ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి: మెదక్ జిల్లా కేంద్రంలో త్వరలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయబోతున్నట్లు మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా॥ మైనంపల్లి రోహిత్ పేర్కొన్నారు. గురువారం మెదక్ ఎస్పి కార్యాలయంలో ప్రారంభించిన సెల్యూట్ బెస్, పరేడ్ గ్రౌండ్ తో పాటు గ్యాలరీలకు శంఖుస్థాపన చేసిన అనంతరం మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ట్రాఫిక్ పోలీస్‌లను కూడా ఏర్పాటు చేయలేని దౌర్భాగ్యమైన దుస్థితిని మెదక్‌కు తీసుకువచ్చారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా మెదక్ పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌తో పాటు ట్రాఫిక్ వింగ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు గత సంవత్సరం ఆగష్టు 28,2024నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రేటరీ లకు లేఖను అందజేసినట్లు ఆయన గుర్తుచేశారు. అంతే కాకుండా మెదక్ రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయం కు పక్కా భవనం తో పాటు మెదక్ నియోజక వర్గంలోని హావేళిఘణాపురం మండలం పోలీస్ స్టేషన్‌కు పక్కా భవనం ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

పోచారం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/బాన్సువాడ: రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిచడానికి కృషి చేస్తుందని, నిజమైన పేదవారికి సంక్షేమ పథకాలు అందజేయడం కోసమే గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలు ఏర్పాటు చేసి అర్హులైన వారిని గుర్తించడం జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం బాన్సువాడ మునిసిపల్ పరిధిలోని 13,15 వార్డులలో నిర్వహించిన గ్రామసభలో వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజమైన లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, కుల, మత పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు అర్హులైన వారికి అందుతాయన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ అని రేషన్ కార్డులపై ప్రతిపక్షాలు చేసే వ్యాఖ్యలను ప్రజలు నమ్మవద్దన్నారు. వార్డు సభలలో ప్రజలు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులపై ప్రజలు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వర ప్రసాద్, మునిసిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఖలీక్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ నార్ల సురేస్ గుప్తా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్‌బిన్ మొసిన్, కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, కౌన్సిలర్ బాడి శ్రీనివాస్, ఎజాస్, గుడాల నగేష్, గొల్ల వెంకన్న యాదవ్, షాహబ్, మాజీ వార్డు సభ్యులు దాసరి శ్రీనివాస్, రాయిస్, జహీర్, రవిందర్, షోయెబ్, గౌస్, బాబా, హకీమ్, మునిసిపల్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన

కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజాపక్షం/అల్లాదుర్గం: అల్లాదుర్గం మండల కేంద్రంలో గురువారం విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత రెవెన్యూ యంత్రాంగంతో కలిసి ప్రభుత్వ భవనాల నిర్మాణం కొరకు స్థలాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఏవైతే అనుకూలంగా ఉంటాయో వాటిని గుర్తించి నివేదికలు తయారుచేసి దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. అల్లాదుర్గ్ మండల కేంద్రంలో ఎస్‌టిఓ ఆఫీస్, ఫైర్ స్టేషన్, ఐసిడిఎస్, ఎంపీడీవో కార్యాలయం, గురుకులం, ఐటిఐ ప్రభుత్వ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గ్ తాసిల్దార్ డి.మల్లయ్

క్రీడ

అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్..

శ్రీలంకను చిత్తు చేసిన భారత్

అండర్–19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ జైత్రయాత్ర కొనసాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకను భారత్ 60 పరుగుల తేడాతో చిత్తుగా ఓడించి టోర్నీలో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (49; 44 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకుంది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక.. భారత బౌలర్ల ధాటికి 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 58 పరుగులకే పరిమితమైంది. లంక టాప్5 బ్యాటర్లలో ఒక్కరూ రెండంకెల స్కోరు చేయలేదు. ఆరో స్థానంలో వచ్చిన రష్మిక సెవ్వండి (15) టాప్ స్కోరర్. టీమ్‌ఇండియా బౌలర్లలో షబ్నమ్ 2, జోషిత 2, పరుణికా సిసోధియా 2, ఆయుషి శుక్లా, వైష్ణవి శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లలో ఓపెనర్ త్రిష మినహా ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. కెప్టెన్ నిక్కి ప్రసాద్ (11), మిథిలా వినోద్ (16), జోషిత (14) రన్స్ చేశారు. కమలిని (5), భవికా (7), ఆయుషి (5) నిరాశ పర్చారు. లంక బౌలర్లలో ప్రముది, ఏసేని తలగునె, లిమాన్స తిలక రత్న రెండేసి వికెట్లు పడగొట్టగా.. రష్మిక, చామోడి ప్రభోద, మనుడి నానయక్కర ఒక్కో వికెట్ తీశారు.

ఎంసిఎ.. గిన్నిస్ రికార్డ్

వాంఖడే గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌లో ఘనత

ముంబయిలోని వాంఖడే క్రికెట్ స్టేడియం 50ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ముంబయి క్రికెట్ అసోసియేషన్ సంబరాలు నిర్వహిస్తోంది. ఈ ఐకానిక్ స్టేడియంలో తొలి మ్యాచ్ జరిగి గురువారం నాటికి సరిగ్గా 50 ఏళ్లు. 1975లో జనవరి 23 29 మధ్య భారత్, వెస్టిండీస్ మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో దివంగత ఏక్‌నాథ్ సోల్కర్ సెంచరీ చేశాడు. దీన్ని పురస్కరించుకుని బుధవారం వాంఖడే స్టేడియంలో ఎంసీఏ క్రికెట్ బంతులతో అతిపెద్ద వాక్యాన్ని రూపొందించి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుంది. 14,505 ఎరుపు, తెలుపు బంతులను ఉపయోగించి 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ వాంఖడే స్టేడియం' అనే వాక్యాన్ని రాశారు. ఈ వరల్డ్ రికార్డు కోసం ఉపయోగించి బంతులను ముంబయి నగరంలోని పాఠశాలలు, క్లబ్స్, ఎన్జీవోల్లోని యువ క్రికెటర్లకు ఇవ్వనున్నారు.

రంజీ ఫైనల్..

సచిన్ కొడుకుపై వేటు!

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్‌కు ఊహించని షాక్ తగిలింది. రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ ఫైనల్లో అర్జున్ టెండూల్కర్‌కు అవకాశం దక్కలేదు. దేశవాళీ క్రికెట్‌లో అర్జున్ టెండూల్కర్ గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. నాగాలాండ్‌తో గురువారం ప్రారంభమైన ఫైనల్లో గోవా టీమ్‌మేనేజ్‌మెంట్ అర్జున్ టెండూల్కర్‌కు చోటివ్వలేదు. దాంతో అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన అర్జున్ టెండూల్కర్ 16 వికెట్లు పడగొట్టాడు. గోవా తరఫున మూడో హయ్యెస్ట్ వికెట్ నిలిచాడు. అయినా అతన్ని తుది జట్టులోకి తీసుకోలేదు.

వైట్‌బాల్ క్రికెట్‌లో అర్జున్ తడబడినా.. రంజీ ట్రోఫీలో మాత్రం మెరుగైన ప్రదర్శనే చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తొలిసారి అర్జున్ టెండూల్కర్‌ను పక్కనపెట్టిన గోవా టీమ్.. ఆ తర్వాత విజయ్ హాజారే ట్రోఫీలోనూ చోటివ్వలేదు. రంజీ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లోనైనా అతనికి చోటు దక్కుతుందని అంతా అనుకున్నారు. కానీ గోవా మేనేజ్‌మెంట్ సచిన్ తనయుడిని పక్కకు పెట్టేసింది. ముంబై జట్టులో అవకాశాలు దక్కకపోవడంతోనే అర్జున్ టెండూల్కర్ గోవాకు మారాడు. ఇప్పుడు ఆ జట్టులోనూ అతనికి తుది జట్టులో చోటు దక్కడం లేదు. ఈ సీజన్ రంజీ ట్రోఫీలో అర్జున్ టెండూల్కర్ ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. నాగాలాండ్‌తో జరిగిన ప్లేట్ గ్రూప్‌లో ఐదు వికెట్లతో సత్తా చాటాడు.

ఐపీఎల్ 2025 మెగా వేలంలో అర్జున్ టెండూల్కర్‌ను ముంబై ఇండియన్స్ అతని కనీస ధర రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది. 2021లో ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన అర్జున్ టెండూల్కర్ ఐపీఎల్ 2023లో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడి మూడు వికెట్లు పడగొట్టాడు.

అర్జున్ టెండూల్కర్ దేశవాళీ సీజన్ అనూహ్యంగా ముగియడంతో ఐపీఎల్ 2025 సీజన్‌లోనూ అవకాశాలు దక్కాలని సచిన్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. ఫైనల్లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన గోవా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 7 వికెట్లకు 258 పరుగులు చేసింది.

రీల్

కన్నప్పలో ప్రభాస్‌పై... ఊహించని ట్రీట్!

ఇప్పుడు టాలీవుడ్ నుంచి రాబోతున్న పలు భారీ చిత్రాల్లో మంచు వారి హీరో మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న తన డ్రీం ప్రాజెక్ట్ సినిమా కన్నప్ప కోసం తెలిసిందే. అయితే ఈ చిత్రం కోసం ఇండియా వైడ్‌గా అనేకమంది స్టార్స్ ఈ సినిమాలో కనిపించనుండగా ఈ సినిమాలో పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ కూడా కీలక పాత్ర చేస్తున్నాడు. అయితే ఈ చిత్రంలో ప్రభాస్ కేవలం చిన్న క్యామియో రోల్ మాత్రమే చేస్తున్నాడని టాక్ వచ్చింది.

కానీ అంతకు మించే తనపై ట్రీట్ ఉంటుంది అని ఇపుడు బజ్ వినిపిస్తుంది. ఇలా తన స్క్రీన్ టైం దాదాపు 20 నిమిషాలు ఉంటుందని మొదట ఓ టాక్ రాగా ఇపుడు మరో సాలిడ్ అప్డేట్ అయితే కన్ఫర్మ్ అయ్యింది. దీనితో కన్నప్పలో ప్రభాస్‌పై ఓ స్పెషల్ సాంగ్ కూడా ఉన్నట్టుగా తెలుస్తుంది. ఈ సాంగ్‌ని ప్రముఖ డాన్స్ మాస్టర్ గణేష్ మాస్టర్ కంపోజ్ చేసినట్టు తెలిపారు. దీనితో ఈ సినిమాలో ప్రభాస్ చాలా లిమిటెడ్ గానే కనిపిస్తుంది అనుకుంటే కొన్ని ఊహించనివే మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని చెప్పాలి. మరి ప్రభాస్ లాంటి స్టార్‌ని వీరు ఎలా హ్యాండిల్ చేశారు అనేది వేచి చూడాలి.

'గేమ్ ఛేంజర్'లా మారనున్న సమంత!

సమంత సోషల్ మీడియాలో మాత్రం ఏదో రూపంలో అభిమానుల అటెన్షన్ గ్రాబ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఓ ఇంట్రెస్టింగ్ విషయం గురించి చర్చించింది. రెండేళ్లుగా అమ్మడు డైరీ రాయడం మొదలు పెట్టిందట. డైరీ రాయడం మొదలైన నాటి నుంచి తనలో వస్తోన్న మార్పుల గురించి రివీల్ చేసింది. డైరీ రాయడం పాతపద్ధతైనా భవిష్యత్‌లో చదువుకోవడానికి.. పాత జ్ఞాపకాల్లోకి వెళ్లడానికి మంచి సాధనం. అప్పుడెలా ఉన్నా? ఇప్పుడెలా ఉన్నాం? అనే వ్యత్యాసం తెలుసుకోవడానికి ఛాన్స్ ఉంటుంది. విషయం చిన్నదైనా? డేలో ఏం జరుగుతుందో ప్రతీది డైరీ రాయడం ఎంతో మంచి అలవాటుగా పేర్కొంది. డైరీ రాయడం ఆరంభంలో ఇబ్బంది గా ఉన్నా ఒక్కసారి రాయడం మొదలైన తర్వాత అలవాటుగా మారితే రాయకుండా ఉండలేమంది. డేలో కొంత సమయాన్ని డైరీకి కేటాయిస్తే మనలో ఎంతో పరివర్తన కలుగుతుంది. తప్పోప్పులు తెలుసు కోవడానికి అవకాశం ఉంటుంది. డైరీ ఇప్పుడో 'గేమ్ ఛేంజర్' లా మారింది. అందుకే మీరు కూడా డైరీ రాయడం మొదలు పెట్టండి. ఎవరి జీవితంలో ఎలాంటి మార్పులు వస్తాయో ఈ డైరీ కొన్నేళ్ల తర్వాత చెబుతుంది. ఇది ఎంతో మంచి అలవాటు. అందరూ అలవాటు చేసుకోండని అభిమానులకు సామ్ సూచించింది.

ఆర్జీవికి 3నెలల జైలు శిక్ష

దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ముంబయి కోర్టు మూడు నెలల జైలు శిక్ష విధించింది. చెక్ బౌన్స్ కేసుకు సంబంధించి అంధేరీ మెజిస్ట్రేట్ కోర్టు వర్మపై నాన్‌బెయిల బుల్ వారెంట్‌ను జారీ చేసింది. మూడు నెలల్లో ఫిర్యాదుదారుడికి రూ.3.7లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. అలా చేయని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తామని కోర్టు స్పష్టం చేసింది. 2018లో మహేశ్ చంద్ర అనే వ్యక్తి వర్మపై ఈ చెక్ బౌన్స్ కేసును వేశారు.



వయసు అనేది సంఖ్య మాత్రమే

– మనీషా కొయిరాలా

వయసు అనేది ఇండస్ట్రీలో ఒక సమస్య కాదని సీనియర్ నటి మనీషా కొయిరాలా అన్నారు. సీనియర్ నటీమణులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. జీవించి ఉన్నంత వరకు సంతోషంగా, సంతృప్తిగా ఆరోగ్యంగా ఉండాలనకుంటున్నట్లు తెలిపారు. 'ఇండస్ట్రీలోని సీనియర్ నటీమణులకు ముఖ్యమైన పాత్రలు ఇవ్వాలి. వృద్ధాప్యం అనేది వినోద పరిశ్రమలో ఒక సమస్య కాదు. కానీ, ఇది పరిష్కరించాల్సిన సామాజిక సమస్య.

ఎందుకంటే హీరోల వయసు గురించి ఎవరూ కామెంట్స్ చేయడం నేను వినలేదు. ఈ విషయంలో మహిళలనే ట్రోల్ చేస్తారెందుకు?. సినిమాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. ఆమెకు తల్లి, సోదరి పాత్ర ఇద్దాం అని అంటారు. కానీ, మహిళలు ఎలాంటి పాత్రలైనా చేయగలరు. యాక్షన్ పాత్రలనైనా అలవోకగా చేయగలరు. గతంలో ఎంతో మంది సీనియర్ హీరోయిన్లు దీన్ని నిరూపించారు. నేను కూడా ఎలాంటి పాత్రనైనా సవాలుగా తీసుకొని చేస్తా. ఇప్పటికీ ఇంకా కొత్త పాత్రలు చేసి నన్ను నేను నిరూపించుకోవాలనుకుంటున్నా. ఆర్టిస్టుగా ఎదగాలని కోరుకుంటున్నా. వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే. 50 ఏళ్లు దాటిన తర్వాత కూడా మనం ఒక అద్భుతమైన జీవితాన్ని గడపగలం. ఏజ్ అనేది సమస్య కాదని ప్రపంచానికి చూపాలి. రానున్న తరాలకు మార్గదర్శి కావాలి. నేను జీవించి ఉన్నంత వరకు సంతోషంగా, సంతృప్తిగా ఆరోగ్యంగా ఉండాలనుకుంటున్నా. ఇదే ఆశయంతో జీవిస్తున్నా' అని చెప్పారు.

85శాతం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. శుక్రవారం రోజున రాష్ట్రంలో మిగిలిన 2279 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహిస్తామని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్నప్రతి వ్యక్తికీ పథకాలు అందిస్తామని,దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పదేళ్ల తర్వాత గ్రామ సభలు నిర్వహిస్తుండటంతో పల్లెల్లో పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. పలకరింపులు, ఆప్యాయతల కలబోతగా గ్రామసభలు కనిపిస్తున్నాయని, దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకంగా గ్రామసభల వేదికగానే అర్హులను గుర్తిస్తున్నామని సీతక్క పేర్కొన్నారు.

కల్వకుర్తి ఎత్తిపోతలతో.. వనపర్తి సస్యశ్యామలం

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి/పాన్‌గల్: ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాంతం నుండి ఒకప్పుడు వలసలు వెళ్లేవారని, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పుడు సస్యశ్యామలంగా మారిందని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాలపై రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో గురువారం ఉదయం ఘనపూర్ మండలంలోని సల్కలాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేండ్లలో గుట్టలకు, కాలువలకు, ఇతర వాటికి రైతు భరోసా పేరుతో రూ. 25వేల కోట్ల ప్రజాధనం అన్యాక్రాంతం చేసిందని, ప్రభుత్వ లక్ష్యాలు అన్యాక్రాంతం కాకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాలనే గ్రామ సభలు పెట్టి ప్రజామోదం పొందటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిజమైన లబ్దిదారులకే అందాలని ఇంకా ఎవరైనా మిగిలిపోయిన పేర్లు జాబితాలో లేకున్నా నమోదు చేసుకొనేందుకు గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

ఆందోళన అవసరం లేదు

ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు శాగాపూర్ గ్రామాలలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి గ్రామ సభలలో పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకుంటే సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందించడం జరుగుతుందన్నారు. ప్రజా రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ పథకం, రేషన్ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాలను ఈ నెల 26వ తేదీ నుంచి అందించడమే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం రైతు వేదికలో కళ్యాణ లక్ష్మీ లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ ఉమాదేవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ గోవిందరావు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రులపై కఠినం

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని' డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో కోఠిలోని డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యా లయాన్ని గురువారం ముట్టడించారు. ధర్నా నిర్వహించి,కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.అనంతరం నిరసనకు దిగిన వారిని అరెస్ట్ చేసి, సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కె.ధర్మేంద్ర,నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నదన్నారు. రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ధ్వజమెత్తారు.ప్రైవేట్ ఆసుపత్రులు తమ వికృత వ్యాపార మెడికల్ దందాకు తెరలేపాయని,ఇటీవల కాలంలో కిడ్నీ అక్రమ మార్పిడిలు, చర్మ సంబంధిత సర్జరీలు, బ్లడ్ అక్రమ దందాలు, నకిలీ డాక్టర్ల సేవలు, ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల విచ్చలవిడి దోపిడీలు తారాస్థాయికి చేరాయని వారు విమర్శించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కాసుల కక్కుర్తికి అలవాటు పడి, ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. రెండురోజుల క్రితం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ అలకనంద మల్టీస్పెషలిటీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు అక్రమంగా నిర్వహిస్తున్నారని, గోప్యంగా ఒక వ్యక్తి సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి సీజ్ అనే పేరుతో తాత్కాలిక చర్యలు తీసుకున్నారన్నారు. సదరు ఆసుపత్రి కేవలం 9 పడకలకు మాత్రమే అనుమతి పొంది,32 పడకల ఆస్పత్రిగా చెలామణీ అవుతున్ననదని, అక్రమంగా, అనుమతులు లేకుండానే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు ముందే చర్యలు తీసుకోలేదో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సదుపాయాలను మరింతగా వేగవంతం చేయాలని, అన్ని రకాల డయాగ్నోస్టిక్ సేవలను పేషెంట్‌లకు అందుబాటులో పెట్టాలని, త్వరితగతిన పరీక్షల రిపోర్టులు ఇవ్వాలని, ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని,అన్ని ఆసుపత్రులలో అన్ని రకాల మందుల కొరత లేకుండా అందించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్య ప్రసాద్,శ్రీమాన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ మహమూద్,పి.శివకుమార్,మజీద్ అలీఖాన్, మధు, కళ్యాణ్, అనీల్ కుమార్, శేఖర్, వీరేశ్, భాను,సంజయ్, నగేష్, శివకుమార్, జెట్టిశ్రీనివాస్, వంశీ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న వేళ

(మొదటి పేజీ తరువాయి)

రూ.3లక్షల సాయాన్ని అందిస్తామని ప్రకటించింది. ప్రతీ నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,58,0 90 దరఖాస్తులను కూడా స్వీకరించింది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 1,91,240మంది అర్హులను గుర్తించారు. కొన్ని చోట్ల గృహలక్ష్మి ఇంటికి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ రావటంతో ఆ పథకం కూడా పేదలకు అందకుండా పోయింది. పదేళ్లుగా పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, గృహలక్ష్మీ పథకం ఇళ్లు ఏవీ కూడా రాక అందని ద్రాక్షగా మారాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అడుగులు వేస్తోంది.

తొలి విడత సొంత జాగా ఉన్నవారికే ప్రాధాన్యత

ఇందిరమ్మ ఇళ్లకు తొలి విడత సొంత జాగ ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నారు. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10,05,454 మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకోగా, పది రోజులుగా అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,37,272 దరఖాస్తులను అధికారుల బృందం పరిశీలించింది. కొన్ని చోట్ల యాప్‌లో సాంకేతికత సమస్య రావటం, కొందరు దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోవటం, మరికొందరు వృత్తిరీత్యా నగరాలకు వెళ్లటం వంటి కారణాలతో వంద శాతం సర్వే పూర్తి కాలేదు. దాదాపు 92 శాతం దరఖాస్తులు పూర్తి కాగా, మిగతా దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నారు. పరిశీలించిన దరఖాస్తుల్లో అధికారులు అన్ని కోణాల్లో పరిశీలించి అర్హులను గుర్తించారు. వరంగల్ జిల్లాలో 66,622 మంది అర్హులుగా గుర్తించగా, హనుమకొండ జిల్లాలో 49,863 మందిని, జనగామ జిల్లాలో 32,448 మందిని అర్హులుగా గుర్తించారు. అలాగే మహబూబాబాద్ జిల్లాలో 56,274 మంది లబ్దిదారులను, భూపాలపల్లి జిల్లాలో 32,448 మంది, ములుగు జిల్లాలో 32,448 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2,73,751 మందిని అర్హులుగా గుర్తించారు. తొలి విడతలో వీరికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అయితే గత ప్రభుత్వం కూడా గృహ లక్ష్మీ పథకం కింద దరఖాస్తులను స్వీకరించి 1,91,240 మంది అర్హులను గుర్తించారు. అప్పటితో పోల్చితే 78వేల మందికి పైగా అర్హులైన లబ్దిదారులను గుర్తించారు. అయితే అప్పట్లో కేవలం 2,58,090 దరఖాస్తులే గృహ లక్ష్మీ ఇళ్ల కోసం వస్తే ఈ సారి భారీగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,05,454 దరఖాస్తులు రావడం గమనార్హం.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 50 వేల ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్చి 11, 2024వ తేదీన ఇందిరమ్మ ఇళ్లకు సిఎం రేవంత్ రెడ్డి భద్రాచలంలో శ్రీకారం చుట్టారు. ఆ తరువాత గత ఏడాది డిసెంబరు 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలనలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించా రు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు 42వేల ఇళ్లు రానున్నాయి. అలాగే పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాలు, భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని వాజేడు, వెంకటాపురం మండలాలు, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల పరిధిలోని కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలా లు, ఇల్లందు నియోజకవర్గంలోని గార్ల, బయ్యా రం మండలాలు ఓరుగల్లు ఇలాఖాలో కలిసిపోయాయి. దీంతో వీటితో కలిపి ఓరుగల్లుకు సుమారు 50వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు రానున్నాయి. మొత్తం 100శాతం సబ్సిడీతో ప్రభుత్వం రూ.5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ. ఇంటిని నిర్మించనుంది. ఒక కుటుంబంలో ఒకరికే ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటిని మంజూరు చేయనున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల అర్హుల ఎంపిక ఇలా

ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాల వ్యాప్తంగా 10,05,454మంది ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. పది రోజులు అధికారులు ప్రత్యేక యాప్ ద్వారా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ప్రధానంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్థానికులై ఉండి. సొంత జాగా ఉన్నవారికి, ఇళ్లు లేనివారికి, గుడిసెలో నివాసం ఉంటున్నవారికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించింది. మట్టి గోడలు, పెంకుటిల్లు, అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటికే అసంపూర్తిగా ఇంటిని నిర్మించుకున్నవారికి, ఆర్సీసీ కప్పులేని వారు, ఇటుక గోడలు లేని ఇంటికి, యువ వితంతువు, భూమిలేని వ్యవసాయ కార్మికులు, పారిశుధ్య కార్మికులు, వికలాంగులకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వనుంది. ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్లు లబ్ధిదారులను ఎంపిక చేశారు. లబ్ధిదారుల జాబితాను గ్రామసభ లేదా వార్డు సభల్లో ప్రకటిస్తున్నారు. అలాగే రూ.5 లక్షలను ఇంటి నిర్మాణంలో వివిధ దశల్లో అందిస్తారు. బేస్మెంట్ పూర్తిచేస్తే రూ.1లక్ష స్లాబ్ లెవల్లో మరో రూ.1లక్ష స్లాబ్ పూర్తయిన తరువాత రూ.2లక్షలు, ఇల్లు మొత్తం పూర్తిచేసిన తరువాత మిగతా రూ.లక్ష లబ్ధిదారులకు అందించనున్నారు

స్థలపరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

పర్యటించింది. ఈ సందర్భంగా ఎంపి రామసహాయం రాఘురామిరెడ్డి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావులు ప్రతినిధి బందానికి ఎయిర్ పోర్టు ఆవశ్యతను వవరించారు. ఇక్కడి ఏర్పాటు చేయడం వల్ల ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘఢ్ ప్రాంతాలకు అనువుగా ఉంటుందని,